తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 14.02.2026 | సంపుటి : 12 సంచిక : 206 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698




# పురపోరులో కాంగ్రెస్ ప్రభంజనం



## రెండో స్థానంలో కారు, వాడిన కమలం
## అత్యధిక మున్సిపల్స్‌లో హస్తం పార్టీ పాగా

- 7 కార్పోరేషన్లలో నాలుగింట కాంగ్రెస్ పార్టీ గెలుపు
- నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీ ఆధిక్యం
- కొత్తగూడెంలో సత్తా చాటిన సిపిఐ
- సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీలలోని 2,582 వార్డుల్లో ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో 1,347 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో 83 మున్సిపాలిటీలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. ఇక బీఆర్ఎస్ 717 వార్డుల్లో గెలుపొందింది. దాంతో 13 మున్సిపాలిటీలను ఆ పార్టీ దక్కించుకుంది. బీజేపీ 261 వార్డుల్లో గెలుపొందారు. నారాయణపేట మున్సిపాలిటీని ఆ పార్టీ దక్కించుకుంది. స్వతంత్ర అభ్యర్థులు.. 256 వార్డుల్లో విజయం సాధించారు. 8 మున్సిపాలిటీల్లో మాత్రం ఏ పార్టీకి పూర్తి స్థాయి మెజార్టీ రాలేదు. దీంతో హంగ్ ఏర్పడింది. అలాగే జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం గమనార్హం. ఏడు కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ నాలుగు

| కార్పొరేషన్ | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ | ఇతరులు |
|---|---|---|---|---|
| రామగుండం(60) | 38 | 13 | 1 | 8 |
| నిజామాబాద్(60) | 17 | 1 | 28 | 15 |
| మహబూబ్‌నగర్ (59/60) | 29 | 15 | 7 | 8 |
| మంచిర్యాల(60) | 44 | 8 | 5 | 3 |
| కరీంనగర్(66) | 14 | 9 | 30 | 13 |
| నల్గొండ(48) | 27 | 9 | 4 | 8 |
| కొత్తగూడెం(60) | 22 | 8 | 1 | 29 |

స్థానాల్లో హవా కొనసాగించింది. నల్గొండ, రామగుండం, మంచిర్యాల కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్ కార్పొరేషన్ కూడా దాదాపుగా హస్తం పార్టీ ఖాతాలో పడే అవకాశం ఉంది. రెండు స్థానాల్లో బీజేపీ.. ఒక స్థానంలో ఇతరులు ఆధిక్యంలో ఉన్నారు. ఇందులో నిజామాబాద్, కరీంనగర్‌లో బిజెపి ఆధిక్యంలో ఉండగా, కొత్తగూడెంకార్పోరేషన్‌లో సిపిఐ ఆధిక్యంలో



ఉంది. కార్పొరేషన్లలో బీఆర్ఎస్ ఖాతా తెరవకపోవడం గమనార్హం. ఏడు కార్పొరేషన్ల పరిధిలోని 412 డివిజన్ల నుంచి 2 వేల 225 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. రామగుండం కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకం ఎగరవేసింది. రామగుండం కార్పొరేషన్‌లోని మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ 38 డివిజన్లలో విజయం సాధించింది. బీఆర్ఎస్ 13 స్థానాలకే పరిమితం అయింది. మంచిర్యాల కార్పొరేషన్‌ను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. మంచిర్యాల కార్పొరేషన్ లో మొత్తం 60 డివిజన్లు ఉండగా.. 39 డివిజన్లలో కాంగ్రెస్ ఆధిక్యం కనబర్చింది. 8 స్థానాల్లో బీఆర్ఎస్, 4 సీట్లలో బీజేపీ ఆధిక్యంలో ఉంది. కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. మిగతా 2లో..

## ప్రభుత్వంపై విశ్వాసం నింపిన ఫలితాలు

75 % స్థానాల్లో విజయం ఆషామాషీ కాదు
ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తాం: మహేష్ కుమార్ 2లో..

అఖండ విజయం కట్టబెట్టినందుకు

## ధన్యవాదాలు

- ప్రజాభిమానమే విజయానికి కారణం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం



## మున్సిపోల్స్‌లో భారీ విజయం

ముఖ్యమంత్రి రేవంత్‌కు ప్రియాంక అభినందన 2లో

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలపడింది

- ఎక్కువ ఓట్లు..సీట్లు సాధించుకోగలిగాం
- కరీంనగర్, నిజామాబాద్ కైవసం చేసుకుంటున్నాం
- ఫలితాలపై మీడియాతో రామచంద్రరావు



హైదరాబాద్(జనంసాక్షి): మున్సిపల్ ఎన్నికల్లో భాజపా బలపడింది.. ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. గణనీయంగా ఓట్లు సాధించామని, పలుచోట్ల సీట్లు గెలిచామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో 250 వార్డుల్లో గెలిచాం. సింగిల్ లార్జెస్ట్ పార్టీగా 6 మున్సిపాలిటీల్లో భాజపా నిలిచింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లు కైవసం చేసుకో బోతున్నాం. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్‌లో మా పార్టీ అభ్యర్థులే ఛైర్మన్లు అవుతారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్రుల మద్దతుతో ఛైర్మన్ పదవులు దక్కించుకుంటాం అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భాజపా ఆశించిన మేరకే ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఫలితాలు ఆశాజనకంగా రాలేదు. మొత్తం వార్డులు, డివిజన్లు కలిపి 350 సీట్లు గెలుస్తున్నాం. త్రిముఖ పోరులో భాజపాకు కొంత నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా మిగతా 2లో..

## సీఎం, మంత్రులు ఒక్కటైనా బీఆర్ఎస్ హవాను అడ్డుకోలేకపోయారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత
- మున్సిపల్ ఫలితాలే ఇందుకు నిదర్శనం: హరీశ్

## నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు

సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

కాశ్మీర్‌తో కలిపి భారత్ మ్యాప్

## పాక్ గగ్గోలుతో తొలగించిన అమెరికా

## మహిళల ఖాతాల్లో రూ.5వేలు

ఎన్నికల నేపథ్యంలో సీఎం స్టాలిన్ ప్రకటన

వివరాలు 2వ పేజీలో..

## కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం మేమే



అధికార ఆగడాలను ఎదుర్కొని బలం చాటాం

- భవిష్యత్‌లో మరింత సమర్థంగా పనిచేస్తాం
- బీఆర్ఎస్‌పై మాట్లాడిన వారి నోళ్లు మూయించాం
- డబ్బు, మద్యంతో విజయం సాధించిన కాంగ్రెస్
- సింగరేణిలో అక్రమాలను బయటపెట్టగలిగాం
- 750 వార్డులతో 30% పైగా గెలిచాం: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వీరోచితంగా పోరాడాదారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. అధికార పార్టీ సామ, దాన, భేద దండోపాయాలు ప్రయోగించినా ప్రజల మనసును గెలుచుకోలేకపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలు సహజంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు. బీఆర్ఎస్‌పై ఏదేదో మాట్లాడిన వారి నోళ్లు మూత పడేలా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి అంత నమ్మకం ఉంటే పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు మిగతా 2లో..




## అభివృద్ధి, సంక్షేమానికే 'పుర'ఓటు

కాంగ్రెస్ ఖాతాలో 94 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లు రెండు కార్పొరేషన్లు

- బీఆర్ఎస్, బీజేపీ హంగ్ కట్టు కథలను ప్రజలు నమ్మలేదు
- అత్యున్నత ప్రమాణాలతో పాలనను అందిస్తాం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో ఇప్పటివరకు అందిన ఫలితాల మేరకు 83 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్ల ను కాంగ్రెస్ పార్టీ అజేయంగా కైవసం చేసుకుంది.. ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉంది మా స్థానాలు మరిన్ని పెరుగుతాయి అన్నారు. స్వతంత్రులు, ఇతర పార్టీల వారు మాతో కలిసి పనిచేయ డానికి ఆసక్తిగా ఉన్నారు చివరకు మొత్తంగా 116 మున్సిపాలిటీలకు గాను 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమ అవుతాయని స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించింది మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడింది అన్నారు. అక్కడ బిజెపి, కాంగ్రెస్, ఇండిపెండెంట్ లు ఉన్నారు, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది అన్నారు. గత రెండు మిగతా 2లో..

# ఇరాన్‌పై యుద్ధ మేఘాలు

## కరేబియన్ సముద్రం నుంచి ఆ దేశం దిశగా కదులుతున్న అమెరికా యుద్ధ నౌకలు



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఆ దేశంపై చర్యల కు అమెరికా సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా ఇప్ప టికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టింది. తాజాగా అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ కరేబియన్ సముద్రం నుంచి ఇరాన్ వైపు కదిలినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మే ప్రారంభం వరకు ఈ నౌక అక్కడే ఉండనున్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది.ఇరాన్ పాలకులపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను పశ్చిమాసియాకు తరలించారు. తాజాగా జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌తో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీలను ఇరాన్ వైపు తరలిస్తుండడంతో అమెరికా ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల అమెరికా వెనెజువెలాపై దాడి చేసి, మదురోను బంధించిన సమయంలోనూ యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ విమాన వాహక నౌక నుంచే యుద్ధ విమానాలు దాడిలో పాల్గొన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ నేపథ్యంలో యూఎస్ విమాన వాహక నౌక ఇరాన్ దిశగా కదలుతుండడం పశ్చిమాసియాలో ఆందోళనలు లేవనెత్తుతోంది.

బంగ్లాదేశ్ ఎన్నికలు..

# బీఎన్‌పీ విజయం

## ఆ దేశ పార్లమెంటు ఎన్నికల్లో 212 స్థానాల్లో విజయం సాధించినట్లు బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ

ఢాకా(జనంసాక్షి):బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించింది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరిగిన పోలింగ్‌లో మిత్రపక్షాలతో కలిపి 212 స్థానాల్లో విజయం సాధించినట్లు పార్టీ ప్రకటించింది. ఈ క్రమంలో బీఎన్‌పీ నేత తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది.జమాత్-ఏ-ఇస్లామి మిగతా 2లో..



## బీఎన్‌పీ విజయం.. ప్రజల విశ్వాసానికి చిహ్నం

బంగ్లా ఫలితాలపై మోదీ పోస్ట్ 2లో

## హసీనా అప్పగింతను కోరతాం: బీఎన్‌పీ

# బిగ్ డీల్

- రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలు
- రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్
- మరింత పటిష్టం కానున్న భారత్ రక్షణ రంగం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(జనంసాక్షి):భారత రక్షణరంగ పటిష్టత దిశగా మరో కీలక ముందడుగు పడింది. రష్యా నుంచి 288 ఎస్-400 క్షిపణుల కొనుగోలుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సుమారు రూ.10,000 కోట్ల ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫాస్ట్ ట్రాక్ మిగతా 9లో..

వెనెజువెలా నుంచి చమురు కొనుగోలుకు 2లో

## అమెరికా పచ్చజెండా

భారత కంపెనీ రిలయన్స్‌కు అమెరికా లైసెన్స్

రోడ్డు ప్రమాద బాధితులకు 2లో

## 'పీఎం-రాహత్'

రూ.1.5 లక్షల నగదు రహిత చికిత్స ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14.02.2026

## చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడితే
# కఠిన చర్యలు

**ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు, ప్రభుత్వ అధికారులపై దౌర్జన్యాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం: డీజీపీ బి. శివధర్ రెడ్డి**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బందిపై ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనల మేరకు ఎన్నికలను నిర్వహించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న సిబ్బం దిని దుర్భాషలాడటం, వారి మీద దాడులకు దిగడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని డిజిపి హెచ్చరించారు. ప్రజాప్రతిని ధులైనా, అభ్యర్థులైనా, రాజకీయ పార్టీల కార్యకర్తలైనా చట్టానికి ఎవరూ అతీతులు కారని, విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడ్డుకుంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చి చెప్పారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా, ఎంతటి ప్రభావశీల వ్యక్తులైనా సరే... ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ, పోలీసు ఉద్యోగులపై చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని డిజిపి ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ, పోలీసు ఉద్యోగులపై ఏవైనా ఫిర్యాదు చేయదలుచుకుంటే రాష్ట్ర ఎన్నికల సంఘానికి గాని, పై అధికారులకు గానీ ఫిర్యాదు చేయవచ్చు కానీ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని చెప్పారు.ఇప్పటికే పోలీసుల మీద, ప్రభుత్వ ఉద్యోగుల మీద చేసిన దౌర్జన్యాల గురించి రిజిస్టర్ అయిన కేసుల విచారణ సత్వరమే పూర్తి చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ లకు, సిపిలకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.వోట్ల లెక్కింపు సందర్భంగా రాజకీయ నాయకులు, రాజకీయ శ్రేణులు ఎన్నికల సిబ్బందికి సహకరిస్తూ నిబంధనల మేరకు వ్యవహరించాలని డిజిపి బి. శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం-రాహత్'

**రూ.1.5 లక్షల నగదు రహిత చికిత్స**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం సేవాతీర్థ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. అందులో 'పీఎం-రాహత్' ఒకటి రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో దీనిని తీసుకువచ్చారు. రూ.1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. నిధుల కొరత కారణంగా ప్రాణాలు కోల్పోకుండా దీని ద్వారా కాపాడుకోవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో దీనిని లాంచ్ చేశారు.రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రి వారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజుల వరకు ఈ సేవలు పొందొచ్చని గతంలో కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. మరోవైపు లక్‌పతీదీదీల సంఖ్యను మార్చి 2029 నాటికి రెట్టింపు చేసేలా కేంద్రం లక్ష్యం విధించుకుంది. ఇప్పటివరకు 3 కోట్లుగా ఉన్న టార్గెట్‌ను ఆరు కోట్లకు పెంచారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు నిధులను రూ.2 లక్షల కోట్లకు పెంచారు. దేశ స్టార్టప్ వ్యవస్థను వేగవంతం చేసేందుకు రూ.10 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ మోదీ సంతకాలు చేశారు.

## సీఎం, మంత్రులు ఒక్కటైనా బీఆర్‌ఎస్ హవాను అడ్డుకోలేకపోయారు

**కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత**

**మున్సిపల్ ఫలితాలే ఇందుకు నిదర్శనం: హరీశ్**

**హైదరాబాద్,ఫిబ్రవరి13(జనంసాక్షి):** ముఖ్యమంత్రి, మంత్రులు సహా యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటై కొట్లాడినా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపును అడ్డుకోలేకపోయారని పార్టీ నేత హరీస్ రావు అన్నారు. అధికార దుర్వినియోగం, డబ్బు రాజకీయాలు, బెదిరింపులు అన్నింటినీ తట్టుకుని గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలనకు చెంపపెట్టు అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దాదాపు 700 పైగా వార్డుల్లో బీఆర్‌ఎస్ గెలుపు సాధించడం యాదృచ్ఛికం కాదన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనం అని పేర్కొన్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మందగించింది. ఎన్నికల హామీలు గాలిలో కలిసిపోయాయి. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. అందువల్లనే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటు అనే కొరడాతో ప్రజలు బుద్ధి చెప్పారు. కాంగ్రెస్‌ను గద్దె దించే శక్తి ఒక్క బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనే అని మొన్న పంచాయితీ ఫలితాలు, నేడు మున్సిపల్ ఫలితాలు కుండబద్దలు కొట్టి చెప్పాయన్నారు. అధికార పక్షం దౌర్జన్యాలను ఎదుర్కొని, ప్రతిపక్షంలో ఉంటూ సాధించిన ఈ ఫలితాలు బీఆర్‌ఎస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. పాలన గాలికి వదిలి.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా కాలం గడుపుతున్న రేవంత్ సర్కారు భరతం పడుతూనే ఉంటం. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ÷ఫైల్యాలను ఎండగడుతూనే ఉంటం. ప్రజల ఆశీస్సులతో తెలంగాణలో గులాబీ జెండా ఎగురేసేందుకు నిర్విరామ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా గెలిచి సత్తా చాటిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులందరికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

# 'పుర'పోరులో కాంగ్రెస్ ప్రభం'జనం'



మొత్తం 66 స్థానాల్లో 29 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఆధిక్యంలో ఉండగా, 14 కాంగ్రెస్, 11 ఇతరులు, ఎంఐఎం 5, బీఆర్‌ఎస్ 7 డివిజన్లలో ఆధిక్యంలో ఉండటం గమనార్హం. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కమ్యూనిస్టుల హవా నడిచింది. అయితే హంగ్ మాత్రం తప్పలేదు. కొత్తగూడెంలో 60 డివిజన్లకు గాను సీపీఐకి 22 స్థానాలు, కాంగ్రెస్‌కు 22 స్థానాలు దక్కాయి. మిగతా చోట బీఆర్‌ఎస్ 8, బీజేపీ, సీపీఎం చెరో స్థానం, స్వతంత్రులు ఆరు చోట్ల గెలిచారు. సీపీఐకి కేటీఆర్ అన్ కండిషనల్ ఆఫర్ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ వైపు వెళ్లకుండా ఉంటే మద్దతిస్తామని.. మేయర్ సీటును కూడా సీపీఐకే ఆయన ఆఫర్ చేయడం విశేషం. బీఆర్‌ఎస్ ఆఫర్‌తో ఇప్పుడు బంతి సీపీఐ కోర్టులో ఉంది. నల్గొండ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అదరగొట్టింది. కాంగ్రెస్ 35 స్థానాల్లో విజయం సాధించింది. బీఆర్‌ఎస్ 10 స్థానాలు, బీజేపీ 02, స్వతంత్రులు ఒక స్థానంలో విజయం సాధించారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో బీజేపీ స్పష్టమైన మెజారిటీ సాధించింది .మొత్తం 60 డివిజన్లకు గాను 30కి పైగా స్థానాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చింది. ఇప్పటికే 12 డివిజన్లలలో బీజేపీ గెలిచింది. మహబూబ్ నగర్ కార్పొరేషన్ 30 డివిజన్లకు కౌంటింగ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్ నగర్ కార్పొరేషన్‌లో ఆధిక్యం కనబర్చింది. కాంగ్రెస్ పార్టీ 14 డివిజన్లలో గెలిచింది. బీఆర్‌ఎస్ 8 స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ నాలుగు, ఎంఐఎం ఒక స్థానం కైవసం చేసుకున్నాయి. 31 నుంచి 60 డివిజన్లకు సంబంధించిన కౌంటింగ్ కొనసాగుతుంది.

## ప్రభుత్వంపై విశ్వాసం నింపిన ఫలితాలు

నిజామాబాద్(జనంసాక్షి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించడం ద్వారా మరోమారు సత్తా చాటిందని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ గెలుపొందిన క్రమంలో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలో శుక్రవారం నిజామాబాద్ పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరాయని.. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో 75 శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుందని అన్నారు. మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించిన ప్రజలు మళ్ళీ ఈ ఎన్నికల్లోనూ గెలిపించారని..మంత్రులు, నేతలు, కార్యకర్తల కృషితో 75 శాతం మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామని అన్నారు. ప్రతిపక్షం ఎన్ని విమర్శలు, వెటకారాలు మాట్లాడిన ప్రజలు కాంగ్రెస్‌ని ఆదరించారని అన్నారు. బిజెపి, బిఆరెస్, ఇంకా అన్నీ పార్టీలు కలిసి కనీసం 25 శాతం కూడా గెలవలేదని ఎద్దేవా చేశారు మహేష్ కుమార్ గౌడ్. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి బిజెపి, ఎంఐఎం పార్టీలు లబ్ది పొందాయని అన్నారు.సీఎం రేవంత్, మంత్రులు కలిసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలిస్తున్నామని అన్నారు. సన్నబియ్యం, ఉచిత బస్సు, కరెంట్ ప్రజలకు అందుతున్నాయని..వచ్చే జీహెచ్‌ఎంసి ఎన్నికల్లోనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో జరిగే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో కూడా గెలుస్తాంమని అన్నారు.వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి రెండో సారి అధికారం లోకి వస్తామని..నిజామాబాద్ కార్పొరేషన్ లో 28 సీట్లు గెలుస్తామని ఆశించాం.. కానీ అలా జరగలేదని అన్నారు. ఎన్నికల్లో ఎంఐఎంకి దూరంగా ఉన్నామని.. అభివృద్ధి కోసం ఏదయినా కఠిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు .

**కాశ్మీర్‌తో కలిపి భారత్ మ్యాప్**

## పాక్ గగ్గోలుతో తొలగించిన అమెరికా

ఇస్లామాబాద్,ఫిబ్రవరి13(జనంసాక్షి):భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిన వేళ.. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత్ మ్యాప్ ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది. చివరకు అగ్రరాజ్య అధికారులకు నచ్చజెప్పి ఆ మ్యాప్‌ను తొలగింపజేశారు. కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. కశ్మీర్‌ను జీవనాడిగా చెప్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. ఇలాంటి సమయంలో దాయాది పేర్కొంటున్నట్టుగా కాకుండా.. భారత్ మ్యాప్ ఉన్నది ఉన్నట్టుగా అమెరికా షేర్ చేసింది. దీన్నిచూసి తట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. అమెరికా అధికారులను ఒప్పించి, దాన్ని తొలగించాలని ప్రాధేయపడటంతో వారు దానిని తొలగించారు. మ్యాప్ షేర్ చేయగానే తాము వెంటనే అగ్రరాజ్య అధికారులను సంప్రదించామని పాక్ విదేశాంగశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబి వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. కాగా.. కశ్మీర్ విషయంలో భారత్ తన వైఖరిని బలంగా వినిపిస్తోంది.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలపడింది

కొత్తగూడెంలో ఒక డివిజన్, అశ్వారావుపేటలో ఒక వార్డు గెలిచాం. కాంగ్రెస్‌కు అనుకున్న ఫలితాలు రాలేదు.. అనేక చోట్ల హాంగ్ వచ్చింది. తెలంగాణ ప్రజలు మంచి తీర్పు ఇచ్చారు. భాజపాను ఓడించడానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, మజ్లీస్ కలిసి పని చేశాయి. అందుకే బీఆర్‌ఎస్ ఇన్ని సీట్లు గెలవగలిగింది. హాంగ్ వచ్చిన చోట భాజపా ఎవ్వరికీ మద్దతు ఇవ్వదు. హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పట్టణ ప్రాంతాల్లో భాజపా బలంగా ఉంది. తెలంగాణ ప్రజలు భాజపాను విశ్వసిస్తున్నారు. కచ్చితంగా అధికారంలోకి వస్తాం. మేం ఎవ్వరికీ మద్దతు ఇవ్వం. కానీ మాకు ఎవరైనా మద్దతు ఇస్తామంటే తీసుకుంటాం అని రామచందర్‌రావు తెలిపారు. భవిష్యత్ ఎన్నికల్లో మరింతగా ఉత్సాహంతో పనిచేస్తామని అన్నారు.

# అఖండ విజయం కట్టబెట్టినందుకు ధన్యవాదాలు

- **ప్రజాభిమానమే విజయానికి కారణం**
- **మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమని.. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద- మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు రేవంత్. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితం అవుతామన్నారు. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పుకొచ్చారు.

## మున్సిపోల్స్‌లో భారీ విజయం సీఎం రేవంత్‌కు ప్రియాంక అభినందన

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ భేటీలో తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై చర్చ జరిగినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ ను ప్రియాంక ప్రత్యేక్యంగా అభినందించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు కాబట్టే.. కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం కట్టబెట్టారని ప్రియాంక గాంధీకి తెలియజేశారు సీఎం రేవంత్.

## నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు

స్వాతంత్ర్యం తర్వాత భారత్-చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందం చేసుకొని ఉంటారన్నారు. దేహ్రాదూన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్-చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్‌ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు.బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దు ప్రాంతాలను నిర్ణయించుకునే అవకాశం భారత్‌కు వచ్చింది. తూర్పున మెక్‌మోహన్ రేఖ లద్దాఖ్‌లోని ప్రాంతాల గురించి నెహ్రూకు అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, దీని (టిబెట్ సరిహద్దు ప్రాంతంలో)పై కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా.ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్‌లోని నగరం), షిన్‌జియాంగ్‌లకు వెళ్లిపోయారు. ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. ఈ క్రమంలోనే 1954లో టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి" అని సీడీఎస్ చౌహాన్ వివరించారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్-చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్‌లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు.

# అభివృద్ధి, సంక్షేమానికే 'పుర'ఓటు

దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయం అన్నారు. అభివృద్ధి ,సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీటవేశారని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని, రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని ఈ ఫలితాలతో తేటతెల్లమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని బిఆర్‌ఎస్, బిజెపి నేతలు ప్రతిరోజు గాలి కబుర్లు చెబుతూ కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పైన కాంగ్రెస్ పార్టీ పైన చేస్తున్న విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పును ఇచ్చారని అన్నారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వం బాధ్యత మరింత పెరిగింది అత్యున్నత ప్రమాణాలతో పాలన అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత ఈ ఫలితాలతో స్పష్టమైందని అన్నారు.పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రసారమాధ్యమాల్లో కనిపించాలని, ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని ప్రతిపక్షాలు కట్టు కథలు అల్లడం, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలనీ డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఉండాలని ప్రజాస్వామ్య వాదిగా తాను బలంగా కోరుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు.

## కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం మేమే

వెళ్లాలి. ప్రధాన ప్రతిపక్షంగా మేము సఫలమయ్యాం, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నాం. అందుకే ప్రజల నుంచి మాకు మద్దతు లభిస్తోంది. ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఎన్నికల ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది. అధికార పార్టీ 80-90శాతం గెలిస్తేనే గెలుపు అవుతుంది. స్థానిక ఎన్నికలు కాబట్టే స్థానికంగానే ప్రచారం చేశాం. పనితీరు బాగా ఉంటే ప్రజలు ఆదరిస్తారని కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారులలు, అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ గెలిచిందే తప్ప నిజమైన విజయం కాదన్నారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచిందని ఆరోపించారు. ప్రజల మనసు గెలుచుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. మా విజయంతో కాంగ్రెస్ నాయకుల నోళ్లు మూతపడ్డాయన్నారు. 2,581 మున్సిపల్ వార్డులలో ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ పార్టీ 750 వార్డులు గెలిచింది. ఈ ఎన్నికల్లో కూడా 30 శాతానికి పైగా సీట్లు బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం 40 శాతానికి పైగా ఓటు బ్యాంకు సాధించామని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఎదుర్కొంటామన్నారు. బీజేపీని నిలువరించేందుకు సింగరేణి ప్రాంతంలో సీపీఐతో కలిసి పోరాడామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ సింగరేణి గొంతు కోస్తున్నాయని మండిపడ్డారు. సింగరేణిలో జరిగిన అవినీతిని ఆధారాలతో బయటపెడితే బీజేపీ సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు కాపాడుతుందో తెలియడం లేదన్నారు.సింగరేణిలో జరుగుతున్న అరాచాకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సింగరేణిని కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలన్నారు. రేవంత్ రెడ్డికి గుణపాఠం చెప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో సైనికుల్లా పోరాటం చేసిన బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియాలో అండగా నిలబడ్డ తమ్ముళ్లకు, చె÷-లలెలకు, ఓటేసిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని కేటీఆర్ తెలిపారు. దాదాపు 700-800 వార్డుల్లో గెలుస్తామని భావించాం. 15 మున్సిపాలిటీల్లో మేం స్పష్టంగా గెలిచాం. మరో 37 మున్సిపాలిటీల్లో మాకు మంచి ఫలితాలు వచ్చి.. హంగ్ పరిస్థితి ఉంది. మా కార్యకర్తలు వీరోచితంగా పోరాడారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగు సార్లు రీకౌంటింగ్ నిర్వహించారు. వర్ధన్నపేటలో పలుమార్లు రీకౌంటింగ్ చేయడంతో అక్కడ మా కార్యకర్తలు ధర్నా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2020లో మున్సిపల్ ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్ 122, కాంగ్రెస్ 4, భాజపా, 2, ఎంఐఎం 2 చోట్ల గెలిచాయి. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 30శాతానికిపైగా వార్డులు గెలిచింది. మొత్తం మీద మంచి ఫలితాలు వచ్చినట్టు భావిస్తున్నాం. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ అధికారులను అడ్డంపెట్టుకుని విజయం సాధించింది.. డబ్బు, మద్యం పంపిణీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. అధికార పార్టీ ఎన్ని అక్రమలు చేసినా.. ధైర్యంగా బీఆర్‌ఎస్‌కు ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు. సింగరేణి బొగ్గు కుంభకోణం బయటపెట్టిన తర్వాత కేతన్‌పల్లి మున్సిపాలిటీలో సీపీఐ కూడా మాతో కలిసి వచ్చింది. దీంతో అక్కడ విజయం సాధించాం. హంగ్ ఏర్పడిన చోట.. ఛైర్మన్ పీఠాలు కైవసానికి కాంగ్రెస్ అప్పుడే బేరసారాలు, కొనుగోళ్లు మొదలు పెట్టింది. కాంగ్రెస్, భాజపా రెండూ కుమ్మక్కయ్యాయి. సింగరేణిలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే సీపీఐ మాతో కలిసి రావాలి. కాంగ్రెస్, భాజపాను ఎండగట్టేందుకు కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతిస్తాం. సీపీఐ నేత కూనంనేని సాంబశివరావుకు ఫోన్ చేసి ఇదే విషయం చెప్పా. కాంగ్రెస్, భాజపాను ఎదుర్కొనే శక్తి బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ప్రజలు భావిస్తున్నారు. భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

## వెనెజువెలా నుంచి చమురు కొనుగోలుకు పచ్చజెండా

వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అమెరికా నుంచి లైసెన్స్ లభించింది. దీంతో తక్కువ ధరకు చమురు దిగుమతి చేసుకునేందుకు అవకాశం లభించింది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ట్రేడర్లు ఈ అనుమతి పొందగా.. తాజాగా భారత్‌కు చెందిన ప్రైవేటు సంస్థకు ఈ లైసెన్స్ వచ్చింది. అయితే, దీనిపై రిలయన్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను కొన్ని రోజుల క్రితం నిర్బంధించిన అమెరికా.. ఆ దేశంలోని చమురు రంగంపై విధించిన ఆంక్షలను సడలించింది. అక్కడి చమురును విక్రయించుకునేలా వ్యాపారులకు అనుమతి ఇచ్చింది. అయితే, 2019-20లో అమెరికా ఆంక్షలు విధించకముందు వెనెజువెలా నుంచి ముడి చమురును రిలయన్స్ కొనుగోలు చేసేది.




## మహిళల ఖాతాల్లో రూ.5వేలు

తమిళనాడు శాసనసభకు ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మహిళలకు గుడ్ న్యూస్ చెప్పారు. కలైంగర్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున రాష్ట్రంలోని 1.3 కోట్ల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసినట్లు ప్రకటించారు. ఈ మొత్తంలో రూ.2,000 సమ్మర్ స్పెషల్ అని పేర్కొన్నారు. ప్రతినెలా మహిళలకు అందించే రూ.1000 ఆర్థిక సహాయాన్ని ముందుగానే అందించినట్లు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలలో స్త్రీలకు ఇవ్వాల్సిన రూ.3 వేలకు మరో రూ.2000 కలిపి మొత్తం రూ.5వేలు మహిళల ఖాతాలలో జమ చేసినట్లు స్టాలిన్ తెలిపారు. మహిళలకు ఆర్థిక మద్దతు, సంక్షేమం, సాధికారత, స్వయంఉపాధి కల్పించడం ఈ పథకం ఉద్దేశమన్నారు. ఎన్నికల పేరుతో కొందరు ఈ పథకాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాను మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గనని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నిక ల్లో తమ పార్టీకి మద్దతివ్వాలని మహిళలను అభ్యర్థించారు.

## బంగ్లాదేశ్ ఎన్నికలు.. బీఎన్‌పీ విజయం

పార్టీ 70 సీట్లు గెలుచుకుంది. ఇతర పార్టీలు, స్వతంత్రులు మిగిలిన స్థానాలు గెలుచుకున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఎన్నికల ఫలితాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ మార్క్‌ను బీఎన్‌పీ దాటేసింది. ఇక, ఈ ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ ఢాకా-17, బోగ్రా-6 స్థానాల నుంచి బరిలోకి దిగారు. ఈ రెండుచోట్ల కూడా ఆయన విజయం సాధించారు. ఎన్నికలకు కొన్ని రోజుల ముందే రహ్మాన్ తల్లి ఖాలిదా మరణించిన సంగతి తెలిసిందే. .

### బీఎన్‌పీ విజయం.. ప్రజల విశ్వాసానికి చిహ్నం

బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించింది. ఈ ఫలితాలపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందిస్తూ రహ్మాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లా లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారు. "బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీని ఘన విజయం దిశగా నడిపించిన తారిఖ్ రహ్మాన్ కు అభినందనలు. మీ నాయకత్వంపై బంగ్లా ప్రజల విశ్వాసానికి ఈ గెలుపు నిదర్శనం. ప్రజాస్వామ్య, ప్రగతిశీల సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుంది. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం, ఉమ్మడి లక్ష్యాలపై ముందుకువెళ్లేందుకు మీతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం" అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.299 పార్లమెంట్ స్థానాలు ఉన్న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే 150 మంది సభ్యుల సంఖ్యాబలం అవసరం. తాజా ఎన్నికల ఫలితాల్లో 212 స్థానాల్లో విజయం సాధించినట్లు బీఎన్‌పీ ప్రకటించింది. 70 సీట్లకు పరిమితమైన జమాత్-ఏ-ఇస్లామీ పార్టీ ఓటమిని అంగీకరించింది. బీఎన్‌పీ నాయకుడు తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అవినీతి కేసుల నేపథ్యంలో 17 ఏళ్ల క్రితం దేశం నుంచి వెళ్లిపోయిన రహ్మాన్ ఇటీవలే బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. తల్లి జియా ఖాలిదా మరణంతో పార్టీ పగ్గాలను అందుకున్న ఆయన.. తాజా ఎన్నికల్లో బీఎన్‌పీని విజయం దిశగా నడిపించారు.

### హసీనా అప్పగింతను కోరతాం

భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని కోరతామని బీఎన్‌పీ వెల్లడించింది. "ఇది రెండు దేశాల విదేశాంగ శాఖలు నిర్ణయించాల్సిన అంశం. విచారణ ఎదుర్కొనేందుకు ఆమెను స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వాన్ని కోరతాం" అని ఆ పార్టీ ప్రతినిధి సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు.విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. 2024 ఆగస్టు నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుల్లో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లోనూ ఆమెకు శిక్షలు పడ్డాయి. గతంలోనూ ఆమె అప్పగింతకు సంబంధించి అభ్యర్థనలు వచ్చాయి. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల దీవెనలు

- సీఎం రేవంత్ రెడ్డి పటిష్ట వ్యూహం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో భారీ విజయం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సాగించిందని, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పటిష్ట వ్యూహం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో భారీ విజయం సాధ్యం అయిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల అందించిన దీవెనలు మరువలేమని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మరింత బాధ్యతలు పెంచాయని, నూతన ఉత్సాహంతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా చేసిన కృషి, ప్రజల ఆశీర్వాదాలతో కాంగ్రెస్ పార్టీకి భారీ విజయం చేకూరిందని చిన్నారెడ్డి వివరించారు. బీ.ఆర్.ఎస్. పార్టీ నాయకులు హరీష్ రావు, కే.టీ.ఆర్., బీజేపీ నాయకులు ఎన్నో కుట్రలు, తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు వాటిని తిప్పికొట్టారని చిన్నారెడ్డి అన్నారు. ఇకనైనా బీ ఆర్ ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకుని ప్రజల కోసం పని చేయాలని చిన్నారెడ్డి సూచించారు. తన నియోజకవర్గం వనపర్తి, పెబ్బేరు మున్సిపల్ లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ధన్యవాదాలు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన పట్టణంలోని 30వార్డుల ప్రజలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మీడియాకు విడుదల చేశారు. ఈ విజయం కాంగ్రెస్ కార్యకర్తల శ్రమకు ఫలితమన్నారు. రెండేళ్ల ప్రజాపాలన, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాబోయే రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అన్నారు.

## తెలంగాణ ప్రజలను, పాత్రికేయులను విడుదల చేయాలి

- చత్తీస్‌ఘడ్ జేగర్‌గుండా పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజలను, పాత్రికేయులను విడుదల చేయాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు ఆంధ్రప్రదేశ్ మారేడుమిల్లి అడవుల్లో ఎన్కౌంటర్ లో చనిపోయిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ నాయకుడు మాడి హిడ్మ చనిపోయి 40 రోజులు కావస్తున్న సందర్భంలో ఆదివాసి గిరిజన సంప్రదాయ ప్రకారం కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంలో ఆదివాసి ప్రాంతానికి తెలంగాణ ప్రజలు తెలంగాణ ప్రాంత పాత్రికేయులు పాల్గొని తిరిగి చతిస్గడ్ నుండి తిరిగి వస్తుండగా చతిస్గడ్ పోలీసులు పాత్రికేయులను ప్రజలను అక్రమంగా అరెస్టు చేసి జేగర్‌గుండా పోలిస్టేషన్ లో నిర్బంధించారని తెలిపారు. ఒక ఆదివాసీ ప్రజల నాయకుడు చని పోయిన హెడమా, రాజేల 40 రోజుల కార్యక్రమంలో పాల్గొనడం ఎందుకు నేరం అవుతుందని, చనిపోయిన వారికి అంతిమ కార్యక్రమాలు నిర్వహించడం మన సాంప్రదాయమని పోలీసుస్టేషన్‌లో నిర్భంధించిన వారిని వెంటే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నా భార్య గెలుపు.. జనసేనానికి గిఫ్ట్

- విజయలక్ష్మి భర్త నాగేశ్వర రావు

**నల్గొండ, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్గొండ జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ ఎన్నికల్లో 14వ వార్డును జనసేన పార్టీ సొంతం చేసుకుంది. 60 ఓట్ల మెజార్టీతో జనసేన అభ్యర్థి విజయ లక్ష్మి గెలుపొందారు. ఆమె విజయంపై భర్త నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈరోజు తన జీవితంలో మర్చిపోలేని రోజన్నారు. ఈ గెలుపు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు గిఫ్ట్ అని అన్నారు. జనసేన అడుగులు తెలంగాణలో పడాలన్న జనసేనాని కోరికకు తామిస్తున్న బహుమతి ఇదేనని ఆయన చెప్పుకొచ్చారు. గ్రూప్ 2కు ప్రిపేర్ అవుతున్న తన భార్యను ఒప్పించి మరీ ఎన్నికల్లో నిలబెట్టానని.. తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందన్నారు. తెలంగాణలో జనసేన గెలుపు ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. దాని వెనక తమ కష్టం ఉందని చెప్పారు. తెలంగాణలో పవన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతర పోరాటం చేసినట్లు తెలిపారు. తన భార్యను గెలిపించినందుకు నేరేడుచర్ల ప్రజానీకానికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



- నిర్మల్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షకులు అనిల్ కుమార్

**నిర్మల్ రూరల్, ఫిబ్రవరి13 (జనం సాక్షి) :** హెచ్ఐవి,ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పరిశీలకులు వి.అనిల్ కుమార్ తెలిపారు.శుక్రవారం నిర్మల్ గ్రామీణ మండలం నరసాపూర్ 'జి'మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవి,ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ హెచ్ఐవి వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు.హెచ్ఐవి అంటువ్యాధి కాదని సమాజంలో అందరి లాగా జీవించవచ్చని తెలిపారు. హెచ్ఐవి సోకిన వ్యక్తులు ఎఆర్టి మందుల ద్వారా జీవనకాల ప్రమాణాన్ని పెంచు కోవచ్చని తెలిపారు.ఐసిటిసి కౌన్సిలర్ సుదర్శన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హెచ్ఐవి పై అవగాహన పెంపొందిం చుకోవాలని తెలిపారు.అలాగే హెచ్ఐవి సోకే మార్గాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సిపిఓ మోహిజ్ అహ్మద్,ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ప్రశాంత్, రోజా, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో హస్తం హవా

- మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండా
- బెల్లంపల్లి మున్సిపాలిటీలో హంగు
- క్యాతనపల్లి మినహా పురపోరులో హస్తానికే పట్టం కట్టిన జిల్లా ప్రజలు
- బీఆర్ఎస్‌కు కలిసొచ్చిన క్యాతనపల్లి కామ్రేడ్లు



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో జరిగిన 4 మున్సిపాలిటీ మరియు నగర పాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని నిలుపుకుంది.అధికార కాంగ్రెస్ పార్టీకి క్యాతనపల్లి, బెల్లంపల్లి మినహా అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో మెజార్టీ సాధించింది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 44 డివిజన్ లలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎరవేసింది. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కృషి ఫలితంగానే మంచిర్యాల నగరపాలక సంస్థ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసింది . మంచిర్యాల జిల్లాలో ఒక నగరపాలక సంస్థ అలాగే నాలుగు మున్సిపాలిటీ ఉండగా మంచిర్యాల నగరపాలక సంస్థలో 60 డివిజన్లలో 44 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులు భారీ విజయం సాధించారు . బిఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే బిజెపి పార్టీ 5 సీట్లను తమ ఖాతాలో వేసుకుంది,జాగృతి పార్టీ తరఫున ఏఐఎఫ్బి తరఫున పోటీ చేసిన సింహం గుర్తుపై ఇద్దరు అభ్యర్థులు గెలుపొందారు . అలాగే జనసేన పార్టీ తరఫున ఒకే ఒకరు బరిలో దిగి విజయం సాధించారు. మంచిర్యాల నియోజకవర్గంలోని లక్షెట్టిపేట మున్సిపాలిటీలో హస్తం హవా కొనసాగింది అధికార కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ పీఠాన్ని కైవసము చేసుకుంది .15 వార్డులలో 11 వార్డులను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. బిఆర్ఎస్ పార్టీ మూడు సీట్లకే పరిమితమైంది అలాగే మరొక సీటు బిజెపి ఖాతా ఓపెన్ చేసింది ఏది ఏమైనప్పటికీ పూర్తిస్థాయి మెజారిటీ మంచిర్యాల నియోజకవర్గంలోని ఒక నగరపాలక సంస్థ , ఒక మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ సొంత మెజారిటీతో అధికార పీఠాన్ని చెజిక్కి0చుకుంది .జిల్లాలో కార్మిక శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గంలో ఉన్న రెండు మున్సిపాలిటీలలో ఒక మున్సిపాలిటీ మాత్రమే అధికార పార్టీ కైవసం చేసుకుంది చెన్నూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అధికార పీఠాన్ని అధిరోహించనుంది .చెన్నూరు మున్సిపాలిటీ లోని 18 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 11 వార్డులను గెలిచి చిన్నూరు మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకుంది బిఆర్ఎస్ పార్టీ నాలుగు సీట్లకే 4 పరిమితమైంది .బిజెపి రెండు సీట్లను గెలుపొందింది అలాగే ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందాడు చెన్నూరు మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అలాగే చెన్నూర్ నియోజకవర్గంలోని మరో మున్సిపాలిటీ ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి చుక్క ఎదురయింది. .ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ 7 సీట్లకే పరిమితమైంది. ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ సిపిఐ పార్టీ ఇక్కడ అలయన్స్ గా ఆలయన్స్ గా కలిసి పోటీ చేశారు . బిఆర్ఎస్ పార్టీకి 10 సీట్లు రాగా, సిపిఐ పార్టీ నాలుగు సీట్లు కైవసం చేసుకుంది.స్వతంత్ర అభ్యర్థి ఒక సీటు గెలుచుకున్నాడు. ఇక్కడ ఖ్యాతనపల్లి మున్సిపల్ అధికార పీఠాన్ని టిఆర్ఎస్ అలాగే కామ్రేడ్లు కలిసి కైవసం చేసుకున్నారు. అలాగేజిల్లాలోని మరో మునిసిపాలిటీ బెల్లంపల్లి లో ప్రజలు హంగు తీర్పు ఇచ్చారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా అధికార కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ ఒక్కొక్క పార్టీ 14 సీట్లలో గెలుపొందారు. బిజెపి ఒక సీటును తన ఖాతాలో వేసుకుంది స్వతంత్రుడు స్వతంత్ర అభ్యర్థులు ఐదు సీట్లలో గెలుపొందారు స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీకి మద్దతిస్తే ఆ పార్టీ బెల్లంపల్లి మున్సిపాలిటీ అధికార పీఠాన్ని అధిరోహించే అవకాశాలు ఉన్నాయి. గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ శాతం మంది కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులుగా పోటీ చేసినట్లు సమాచారం . ఈ నేపథ్యంలో రెబల్ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపితే కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి మున్సిపాలిటీ హస్తగతం చేసుకుని అవకాశాలున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీకి జై కొడితే ఆ పార్టీ బెల్లంపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని జిక్కించుకునే అవకాశాలు మెండుగా కనపడుతున్నాయి ఏదేమైనాప్పటికీ మంచిర్యాల జిల్లాలో చెన్నూరు మున్సిపాలిటీలోని ఖతనపల్లి మినహా అన్ని మున్సిపాలిటీలో అలాగే మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ తమ అధిపత్యాన్ని నిలుపుకొని అధికారాన్ని చేపట్టడానికి సిద్ధంగా ఉంది. ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో టిఆర్ఎస్ పార్టీ ముందస్తుగా కామ్రేడ్లతో కలిసి పోటీ చేయడంతో కలిసి వచ్చిందని చెప్పుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా కామ్రేడ్లు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేయగా ఖ్యాతనపల్లి మున్సిపాలిటీలో మాత్రం టిఆర్ఎస్ తో కలిసి పోటీ చేయడం మూలంగా ఖ్యాతనపల్లి మున్సిపాలిటీ ని బిఆర్ఎస్ పార్టీ , సిపిఐ కలిసి అధికార పీఠాన్ని కైవసం చేసుకోనున్నాయి. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముందస్తు వ్యూహంతో కామ్రేడ్లతో కలిసి పనిచేయడానికి చొరవ తీసుకోవడం మూలంగా బి ఆర్ ఎస్ పార్టీకి ఖ్యాతనపల్లి మున్సిపాలిటీ కలిసి వచ్చిందని చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి రోజుకు జిల్లాలో ఆదరణ పెరుగుతుందని ఈ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి.ఒక్క మున్సిపాలిటీ మినహా మంచిర్యాల జిల్లాలో ఒక కార్పొరేషన్ మిగతా మున్సిపాలిటీలన్నిటిలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టనుంది .జాగృతి వ్యవస్థాపకురాలు కవిత పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థుల్లో ఇద్దరు గెలుపొందడం విశేషం . పవన్ కళ్యాణ్ పార్టీ జనసేన నుండి పోటీ చేసిన ఒక అభ్యర్థి గెలుపొందారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఆశించిన రీతిలో సీటు రావడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం మరింత రెట్టింపు అయింది.అత్యధిక సీట్లు గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బాణాసంచ వేలుస్తూ స్వీట్స్ పంచుతూ సంబరాలు చేసుకున్నారు.

## ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీదే విజయం

- అందుకు నిదర్శనం తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు..
- కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు : ఎంపీ మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీదే విజయమని.. అందుకు నిదర్శనం తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలని.. నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడారు. తాజాగా వెల్లడైన మున్సిపల్ ఎన్నికల ఫలితాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.మున్సిపల్ ఫలితాలను చూస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్యాబినెట్ ను ప్రజలు ఆశీర్వదించినట్టు కనిపించిందని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా విశ్వసిస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు. 75 నుంచి 80 శాతం వరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 2023లో బీఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇచ్చిన ప్రజలు.. అప్పటినుంచి ఏ ఎన్నిక జరిగిన కాంగ్రెస్ పార్టీ వైపు నిలుస్తున్నారని తెలిపారు. 2023 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లోను ప్రజలు బీఆర్ఎస్ పై కోపంతోనే ఉన్నారు. కొన్నిచోట్ల బీఆర్ఎస్, బీజేపీ మున్సిపాలిటీల్లో గెలిచినా.. అది ప్రజాస్వామ్యంలో సహజంగా జరిగే ప్రక్రియ అని, 12 ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీని, పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి మద్దతు ఇస్తున్నారని, అది ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహ మంత్రుల గురించి ప్రతిపక్ష పార్టీలు ఇష్టారాజ్యాంగా మాట్లాడుతున్నాయి. ఈ కారణంగానే బీఆర్ఎస్, బీజేపీ నష్టపోయాయి. ఈ విషయాన్ని ఆ రెండు పార్టీలు గుర్తించాలి. మీడియా, సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలు ప్రజలు నమ్మకపోగా.. ఎన్నికలు జరిగినప్పుడు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. ఏ ఎన్నిక జరిగిన 100 శాతం కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఉండాలనేది మా అభిప్రాయం. ఇప్పటికైనా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాస్వామ్యయుతంగా ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రజల మంచి కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నిర్మల్ మున్సిపాలిటీ 'హస్త'గతం

- గట్టి పోటీనిచ్చిన బిజెపి అభ్యర్థులు



**నిర్మల్ రూరల్,ఫిబ్రవరి13(జనం సాక్షి) :** నిర్మల్ పట్టణంలో హోరాహోరిగా సాగిన మున్సిపల్ ఎన్నికలలో శుక్రవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో 24 మంది కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి నిర్మల్ మున్సిపాలిటీని హస్తగతం చేసుకున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీని ఇచ్చినప్పటికీ చివరికి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది.పట్టణంలో మొత్తం 42 మున్సిపల్ వార్డులకు గాను 24 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందగా,13 స్థానాలను బిజెపి పార్టీ అభ్యర్థులు గెలుపొందారు.అలాగే బిఆర్ఎస్ పార్టీ 2 స్థానాలు,ఎంఐఎం పార్టీ3 స్థానాలలో గెలుపొందారు.అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడంతో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని సునాయాసంగా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.ఉత్కంఠగా సాగిన మున్సిపల్ ఎన్నికల పోరులో ముందటి నుండే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎక్కువగా గెలుస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ,భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు దీటుగా పోటీ ఇవ్వడం, పట్టణంలో ఒకింతగా అయోమయ పరిస్థితి ఎదురైంది.కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటారన్న నమ్మకం ఉన్నప్పటికీ,మరోవైపు బిజెపి పార్టీ అభ్యర్థులు ఎక్కువగా గెలుస్తారని ప్రచారం జరగడం,మరోవైపు బిజెపి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందని ఊహాగానాలు రావడంతో ఒక దశలో కాంగ్రెస్,బిజెపి పార్టీ నాయకులు ఎవరికి వారు విజయ అవకాశాలపై లెక్కలు వేసుకున్నారు.శుక్రవారం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ స్థానాలు విజయం సాధించడంతో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని హస్తం పార్టీ కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అందరూ ముందటి నుండి అనుకున్నట్టుగానే నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అప్పాల గణేష్ కు మార్గం సుగమమైంది.మున్సిపల్ ఎన్నికలు సజావుగా సాగడానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,ఎస్పీ జానకి షర్మిల ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ మున్సిపల్ ఎన్నికలు,కౌంటింగ్ ప్రక్రియను దిగ్విజయంగా నిర్వహించారు.ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.పట్టణంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రజలు కిక్కిరిసి పోవడంతో,ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పోలీసులు చేపట్టారు.

## చెన్నూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం

**చెన్నూర్ పిబ్రవరి 13 (జనం సాక్షి) :** చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని కైవాసం చేసింది. పార్టీ శ్రేణుల సమిష్టి కృషి, ప్రభుత్వంపై ప్రజలకున్న విశ్వాసంతోనే స్పష్టమైన మెజార్టీతో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం పార్టీ పటిష్టతకు నిదర్శనమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు అహర్నిశలు శ్రమించాయి. ఈ విజయం కార్యకర్తల కష్టానికి దక్కిన ఫలితం అని మంత్రి వివేక వెంకటస్వామి కొనియాడారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఈ ఎన్నికల తీర్పు ప్రతిబింబిస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. గెలుపునకు కారకులైన ప్రతి ఒక్క నాయకుడికి, కార్యకర్తకు పేరుపేరునా అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## చండూరులో హస్తం హవా

**10 వార్డుల్లో 6 గెల్చుకున్న కాంగ్రెస్**

**నల్లగొండ, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధిక స్థానాల్లో అధికార పార్టీ హవా కొనసాగింది. చండూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో చండూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మొత్తం 10 వార్డుల్లో కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 3, సీపీఐ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. 1వ వార్డు: బీఆర్ఎస్ – తేలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్,2వ వార్డు: కాంగ్రెస్ – బుషిపాక వాసు,3వ వార్డు: బీఆర్ఎస్ – సామ సుజాత యాదవ రెడ్డి,4వ వార్డు: సీపీఐ – జెల్లా ధనమ్మ,5వ వార్డు: బీఆర్ఎస్ – కొండ్రెడ్డి మధు ,6వ వార్డు: కాంగ్రెస్ – కోడి శ్రీనివాసులు,7వ వార్డు: కాంగ్రెస్ – కోడి సుష్మ వెంకన్న, 8వ వార్డు: కాంగ్రెస్ – భూతరాజు దశరథ, 9వ వార్డు: కాంగ్రెస్ – కలిమికొండ జనార్ధన్, 10వ వార్డు: కాంగ్రెస్ – కటకం రమేశ్ గెలుపొందారు.

## సుల్తానాబాద్‌లో ఎగిరిన కాంగ్రెస్ జెండా

**15 స్థానాల్లో 12 గెలుచుకున్న హస్తం పార్టీ**

**పెద్దపల్లి, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** సుల్తానాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులకు గానూ 12 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్, బీజేపీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు ఒక్కో స్థానాన్ని దక్కించుకున్నాయి. సుల్తానాబాద్ మున్సిపాటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. 1వ వార్డు: కాంగ్రెస్ – ఈర్ల స్వరూప,2వ వార్డు : కాంగ్రెస్ – గాజుల రాజమల్లు,3వ వార్డు: బీజేపీ – కందునూరి సమత,4వ వార్డు: కాంగ్రెస్ – బిరుదు కృష్ణ,5వ వార్డు: కాంగ్రెస్ – గరిగే శోభారాణి,6వ వార్డు: కాంగ్రెస్ – బాకం సాయికిరణ్,7వ వార్డు: కాంగ్రెస్ – వర ప్రదీప్,8వ వార్డు: కాంగ్రెస్ – చింతల రాజు,9వ వార్డు: కాంగ్రెస్ – టికే ప్రభాకర్,10వ వార్డు: కాంగ్రెస్ – అంతటి పుష్పలత 11వ వార్డు: బీఆర్ఎస్ – కల్వల శంకరమ్మ,12వ వార్డు: ఏఐఎఫ్‌బీపీ – అమిరిశెట్టి శ్రావణి,13వ వార్డు: కాంగ్రెస్ – సిద్ధ తిరుపతి,14వ వార్డు: కాంగ్రెస్ – వేగోళం పద్మ,15వ వార్డు: కాంగ్రెస్ – గాదాసు మంజుల గెలుపొందారు.

SHIFTING OF N ANNARAM BRANCH
H.No.8- 36, ఎన్ అన్నారం, పెన్ పహాడ్ మండలం, సూర్యాపేట జిల్లా
PUBLIC NOTICE
16.02.2026 నుండి SBI ఎన్ అన్నారం బ్రాంచ్ కోడ్: 21537 ను మరింత సౌకర్యవంతమైన మరియు విశాలమైన ప్రదేశానికి మారుస్తున్నట్లు ప్రకటించడానికి మేము సంతోషిస్తున్నాము
కొత్త చిరునామా 1- 70, ఎన్ అన్నారం గ్రామం, ఎన్ అన్నారం నుండి సూర్యాపేట రోడ్డు. పెన్ పహాడ్ మండలం సూర్యాపేట జిల్లా పిన్ కోడ్ 508213
ఇట్లు : బ్రాంచి మేనేజర్ కె. పి. పతంజలి నాథం
మా టెలిఫోన్ నంబర్లు : 9703372744, 7981071737

## స్వేచ్ఛా సంస్కృతిపై సంఘ్ పరివార్

# నిరంతర దాడి

ఫిబ్రవరి 14 వచ్చిందంటే చాలు, దేశవ్యాప్తంగా ఒక వింతైన అభద్రతా భావం పాలకులను, వారి అనుబంధ శక్తులను వెంటాడుతుంటుంది. ప్రేమను పంచుకోవడమే నేరమైనట్లు, ఇద్దరు వ్యక్తులు ఇష్టపూర్వకంగా కలుసుకోవడం భారతీయ సంస్కృతికి విరుద్ధమైనట్లు 'హిందుత్వ' శక్తులు గగ్గోలు పెట్టడం ఏటా చూస్తున్న ప్రహసనమే. అయితే, ఇది కేవలం సంప్రదాయాల రక్షణ పేరుతో జరుగుతున్న హంగామా మాత్రమే కాదు. ఇది పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే క్రమంలో సాగుతున్న ఒక ప్రమాదకర రాజకీయ అజెండా. ప్రేమికుల రోజు వంటి సహజమైన మానవ భావవ్యక్తీకరణకు సంబంధించిన సందర్భాలు ఇప్పుడు సామాజిక అంశాలుగా కాకుండా సాంస్కృతిక-రాజకీయ ఘర్షణల కేంద్రంగా మారాయి. ప్రేమ అనేది రెండు వ్యక్తుల మధ్య పుట్టే సహజమైన భావం. కానీ దానిని "పాశ్చాత్య సంస్కృతి ప్రభావం"గా ముద్రవేసి, భారతీయ సంస్కృతికి వ్యతిరేకమని ప్రచారం చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయి.




నిజానికి 'ప్రేమ' అనేది ఏ దేశానికో, ఏ మతానికో పరిమితమైనది కాదు. కానీ, ఆర్‌ఎస్‌ఎస్ (=ూూ) సిద్ధాంతకర్తలు దీనిని ఒక పాశ్చాత్య దిగుమతిగా చిత్రీకరిస్తూ యువతపై దాడులకు తెగబడుతున్నారు. భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థలు వాలెంటైన్స్ డే నాడు పార్కుల్లో, కెఫేలలో జంటలను వేధించడం, బలవంతపు పెళ్లిళ్లు చేయడం వంటి అరాచకాలకు పాల్పడుతున్నాయి. భారతీయ సంస్కృతి గురించి మాట్లాడే ఈ శక్తులు, అదే సంస్కృతిలో భాగమైన ప్రేమను, స్నేహాన్ని ఎందుకు ద్వేషిస్తున్నాయో సామాన్యులకు అర్థం కాని విషయం.

ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధ సంస్థల పేరుతో కొన్ని రాష్ట్రాల్లో ప్రేమికుల రోజున యువ జంటలపై దాడులు, బెదిరింపులు, అవమానాలు, బలవంతపు పెళ్లిళ్ల హెచ్చరికలు వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిని "నైతిక పోలీసింగ్"గా పిలుస్తున్నారు. "భారతీయ సంస్కృతి కాపాడుతున్నాం" అనే నినాదంతో ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను కట్టడి చేయడం ప్రమాదకర ధోరణిగా మారుతోంది. సమాజాన్ని సంస్కారవంతం చేయాలన్న నినాదం వెనుక, వాస్తవానికి భయభ్రాంతుల వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యంగా ఈ చర్యలు ఉన్నాయి.

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (దీజ్రీ) పరోక్షంగా ఈ మూక దాడులకు మద్దతునివ్వడమే అసలు విషాదం. విద్వేషం పునాదులపై అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకునే పాలకులకు 'ప్రేమ' అనేది సహజంగానే మింగుడుపడని అంశం. యువతను ఉపాధి, విద్య వంటి మౌలిక అంశాల నుండి పక్కకు మళ్లించి, భావోద్వేగపూరితమైన 'మత సంస్కృతి' చట్రంలో బంధించడమే వీరి లక్ష్యం. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కులను కాలరాస్తూ, ఏం తినాలి, ఎవరిని ప్రేమించాలి అనే అంశాలను కూడా పాలక శక్తులే నిర్ణయించాలనుకోవడం.

ప్రేమను కూడా మతపరమైన కోణంలో చూస్తూ 'లవ్ జిహాద్' వంటి కుట్రపూరిత సిద్ధాంతాలను ప్రచారంలోకి తెచ్చారు. ప్రేమికుల దినోత్సవం నాడు జరిగే దాడులు సమాజంలో ఒక రకమైన 'భయం'ను నెలకొల్పుతాయి. ఈ భయం ద్వారానే ప్రజలను మతం పేరుతో ఏకం చేయడం (ాశీశ్రీఖతీఅఓ్ఱశీఅ) బీజేపీకి సులభతరమవుతుంది. ఒకవైపు విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థల కోసం ఎర్ర తివాచీ పరిచే పాలకులు, అదే విదేశాల నుండి వచ్చిన ఒక పండుగను (వాలెంటైన్స్ డే) మాత్రం వ్యతిరేకించడం వీరి ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం, వారి వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోంది.

భారతీయ సంప్రదాయంలో ప్రేమకు ఉన్న స్థానం గురించి మాట్లాడితే పురాణాలు, ఇతిహాసాలు, సాహిత్యం అన్నీ ప్రేమకథలతో నిండి ఉన్నాయి. రాధా-కృష్ణుల అనురాగం, శకుంతల-దుష్యంతుల ప్రేమకథ, వెంకటేశ్వర స్వామి -నాంచారమ్మ , మీరా-కృష్ణ భక్తి ప్రేమ ఇవన్నీ ప్రేమ భారతీయ సంస్కృతికి విరుద్ధం కాదని స్పష్టంగా చూపుతున్నాయి. అలాంటి దేశంలో ప్రేమికుల రోజును "సంస్కృతి విరుద్ధం"గా చిత్రీకరించడం విరోధాభాసమే. అయినా, "సంస్కృతి పరిరక్షణ" పేరుతో యువత వ్యక్తిగత జీవితంపై నియంత్రణ విధించాలనే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ఇది సంప్రదాయ పరిరక్షణ కాదు; ఒక రకమైన సామాజిక కట్టడి మాత్రమే.

ఈ ఘటనలు పెరగడం వెనుక రాజకీయ లెక్కలు కూడా ఉన్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతు సంక్షోభం, విద్య-ఆరోగ్య రంగాల సమస్యలు వంటి అసలు ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రేమికుల రోజు వంటి అంశాలను పెద్ద వివాదంగా మార్చుతున్నారు. యువత భావోద్వేగాలను లక్ష్యంగా చేసుకుని భయ వాతావరణం సృష్టించడం ద్వారా ఒక రకమైన సామాజిక నియంత్రణ సాధించాలని చూస్తున్నారు.

భారత సమాజంలో సాంప్రదాయ విలువలు బలంగా ఉన్నాయి. అదే సమయంలో యువతలో ఆధునిక అలోచనలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ రెండింటి మధ్య సమతుల్యత అవసరం. ప్రేమ అంటే కేవలం శారీరక ఆకర్షణ కాదు. అది బాధ్యత, పరస్పర గౌరవం, సమానత్వం వంటి విలువలతో కూడిన బంధం. యువతకు ఈ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ దాడులు, బెదిరింపులు, నైతిక పోలీసింగ్ ద్వారా ఆ అవగాహన రాదు. భయంతో కూడిన సమాజం మానవీయంగా మారదు.

ఆర్‌ఎస్‌ఎస్ వంటి శక్తులు ప్రతిపాదించే 'సంస్కృతి'లో స్త్రీ స్వేచ్ఛకు చోటు లేదు. యువతీ యువకులు తమ భాగస్వాములను స్వయంగా ఎంచుకోవడం అనేది పితృస్వామ్య మరియు కుల వ్యవస్థల పునాదులను కదిలిస్తుంది. ప్రేమ వివాహాలు కులాల గోడలను బద్దలు కొడతాయనే భయం వల్లే, ప్రేమికుల దినోత్సవం వంటి సందర్భాలను వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

ప్రజాస్వామ్య దేశంలో పౌరుల ఇష్టాయిష్టాలు రాజ్యాంగబద్ధమైనవి. మతతత్వ శక్తులు వీధుల్లో పడి ప్రేమికులను వేధించడం చట్టవిరుద్ధం. సంస్కృతి అనేది నిరంతరం పరిణామం చెందేది, అది ఎవరికీ సొత్తు కాదు. ప్రేమను ద్వేషించే శక్తుల అసలు రంగును గుర్తించి, లౌకిక, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు యువత నడుం బిగించాలి."



**టి. నాగరాజు**
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి
ఫోన్:9490098292

## ఎంత బాగుంటుంది!



హిందూ ముస్లిం
అనుకొనేబదులు
నేను భారతీయుణ్ణి
అనుకుంటే -దేశం
ఎంతబాగుంటుంది!
వివక్షలుపెంచటంకాదు
భారతీయులంతాఒక్కటే
ఈ నినాదంతోకదులు!
చైనాను మించిపోతాం!
దేశం ఎంతబాగుంటుంది
గుళ్ళు మసీదులు
కూల్చటంకంటే -అవి
మనపూర్వ సంపద
అనుకునిముందుకెళితే
దేశంఎంతబాగుంటుంది!
వైజ్ఞానికరంగంలో
అభివృద్ధి సాధిస్తూ
150కోట్లజనంతో
శక్తివంతంగామారితే
దేశమెంతబాగుంటుంది!
అల్లాహోఅక్బర్లు
రాంభజనలు ఆపి
చెయ్యి చెయ్యి పట్టుకుని
ఎవ డొస్తాడో రండి అంటే
దేశం ఎంతబాగుంటుంది
మతాల గోల వదిలేసి
తరగతిగదుల్లో పిల్లలు
రాజ్యాంగ పీఠికపఠిస్తూ
లౌకికభావంపెంచుకుంటే
దేశంఎంతబాగుంటుంది
అప్పుడుఅమెరికాకేకాదు
దానిబాబుదేశానికైనా
సమాధానం చెప్పగలం!
అలాగేకాని జరిగితే
దేశంఎంతబాగుంటుంది
భిన్నత్వంలో ఏకత్వం
మనదేశనిజమైనబలం!
'హిందూ'ఒక్కటేచాలదు
కలసిఉంటేకలదు సుఖం
దేశం ఎంతబాగుంటుంది

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో-

# భారతీయ వ్యవసాయం తాకట్టు!



అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలపై దేశవ్యాప్తంగా చర్చ ఊపందుకుంది. ముఖ్యంగా సోయా బీన్, పాల ఉత్పత్తులు, నూనె గింజలు వంటి విభాగాలపై ఈ ఒప్పందం దీర్ఘకాలిక ప్రభావాలు చూపుతాయనే అభిప్రాయం పలువురు ఆర్థిక నిపుణుల నుంచి వినిపిస్తోంది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో భారత దేశం క్రమంగా మరింతగా విలీనమవుతున్న తరుణంలో వ్యవసాయ రంగం వంటి సున్నితమైన విభాగం అంతర్జాతీయ పోటీలో ఎలా నిలబడగలదన్న ప్రశ్న అత్యంత కీలకంగా మారింది. భారతదేశంలో వ్యవసాయం కేవలం ఆర్థిక కార్యకలాపం మాత్రమే కాదు. ఇది కోట్లాది కుటుంబాలకు జీవనాధారం. దేశ జనాభాలో సుమారు 55% మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2024-25 సంవత్సరంలో వ్యవసాయ రంగం జీడీపీకి సుమారు 18.2% వాటాను అందించింది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో వాణిజ్య ఒప్పందం కింద తక్కువ ధరలతో వ్యవసాయ ఉత్పత్తులు భారీగా దిగుమతి అయితే దేశీయ మార్కెట్‌లో ధరల సమతుల్యత దెబ్బతినే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికా వ్యవసాయ రంగానికి ప్రభుత్వ సబ్సిడీలు అత్యధికంగా లభిస్తున్నాయి. 2023 సంవత్సరంలో అమెరికా రైతులకు అందించిన ప్రత్యక్ష సబ్సిడీలు సుమారు 45 బిలియన్ గా అంచనా వేయబడ్డాయి. ఈ సబ్సిడీల కారణంగా అక్కడి ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండటం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అమెరికా ఉత్పత్తులు చౌకగా లభిస్తున్నాయి. ఇదే ధోరణి భారత మార్కెట్‌లోకి ప్రవేశిస్తే దేశీయ రైతులు ధరల పోటీలో నిలబడలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. సోయాబీన్ రంగాన్ని పరిశీలిస్తే ఈ ఆందోళన మరింత స్పష్టమవుతుంది. 2024-25 సంవత్సరంలో భారతదేశంలో సోయాబీన్ ఉత్పత్తి సుమారు 15.26 మిలియన్ మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ఈ పంటపై మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో లక్షలాది రైతులు ఆధారపడి ఉన్నారు. అదే సమయంలో అమెరికా ప్రపంచ సోయాబీన్ ఉత్పత్తిలో సుమారు 28% వాటాను కలిగి ఉంది. అక్కడి విస్తృత ఉత్పత్తి సామర్థ్యం కారణంగా తక్కువ ధరలతో సోయాబీన్ భారతదేశానికి దిగుమతి అయ్యే అవకాశాలు పెరుగుతున్నాయి.

2025 సంవత్సరంలో అమెరికా నుంచి భారతదేశానికి వ్యవసాయ దిగుమతుల విలువ సుమారు వి2.85 బిలియన్ కు చేరింది. ఇది 2024తో పోలిస్తే సుమారు 34% పెరుగుదల. అదే కాలంలో భారతదేశం నుంచి అమెరికాకు వ్యవసాయ ఎగుమతులు సుమారు వి5.91 బిలియన్ గా నమోదయ్యాయి. ఈ గణాంకాలు చూస్తే వాణిజ్యం రెండు దిశల్లో పెరుగుతున్నట్టు కనిపించినా దిగుమతుల వేగం ఎక్కువగా ఉండటం వ్యవసాయ మార్కెట్‌పై ఒత్తిడిని పెంచే అంశంగా మారింది.

ఇతర కోణంలో పరిశీలిస్తే ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి కొన్ని అవకాశాలు కూడా ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బియ్యం, మసాలాలు, సముద్ర ఉత్పత్తులు వంటి రంగాల్లో భారత ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని అంచ నాలు ఉన్నాయి. 2025 నాటికి వ్యవసాయ ఎగుమతులను 100 బిలియన్ స్థాయికి తీసుెకెళ్లాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ మార్కెట్లకు విస్తృత ప్రవేశం అవసరమనే వాదన కూడా వినిపిస్తోంది.మొత్తం మీద చూ స్తే అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారతీయ వ్యవసాయ రంగానికి అవకాశాలను తీసుకొచ్చే శక్తి కలిగి ఉన్నప్పటికీ సరైన రక్షణ చర్యలు లేకపోతే అది గుదిబండగా మారే ప్రమాదం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. సోయాబీన్, పాల ఉత్పత్తులు వంటి సున్నిత రంగాలను కాపాడే విధానాలు స్పష్టంగా రూపొందించకపోతే ధరల పతనం, రైతుల ఆదాయ తగ్గుదల వంటి సమస్యలు తీవ్రతరం కావచ్చు. అందువల్ల ఈ ఒప్పందం అమలులో గణాంకాల ఆధారిత నిర్ణయాలు, దశలవారీ అమలు విధానం, దేశీయ రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే వ్యూహం అత్యవసరంగా మారింది. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ వ్యవసాయ రంగంపై, ముఖ్యంగా సోయాబీన్ వంటి నూనె గింజల రంగంపై, బహుముఖ ప్రభావాలను చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది తక్షణ ప్రభావం కంటే మధ్యకాలికం నుంచి దీర్ఘకాలిక స్థాయిలో ఎక్కువగా ప్రతిఫలించే విధంగా ఉంటుంది. 2026 నుంచి 2035 మధ్యకాలాన్ని అంచనా కాలంగా తీసుకుంటే ధరలు, ఉత్పత్తి, రైతుల ఆదాయం, మార్కెట్ నిర్మాణం, ప్రభుత్వ విధానాలపై వచ్చే మార్పులు స్పష్టంగా విశ్లేషించవచ్చు. మొదటిగా ధరల అంశాన్ని పరిశీలిస్తే, అమెరికా నుంచి తక్కువ ధరలతో వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశించినప్పుడు దేశీయ ధరలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుంది. 2026-27 సంవత్సరంలో సోయాబీన్ దిగుమతులు మొత్తం వినియోగంలో 5% స్థాయిలో ఉంటే ధరలపై ప్రభావం పరిమితంగా ఉంటుంది. కానీ అదే దిగుమతులు 2030 నాటికి 12% కు చేరితే దేశీయ మార్కెట్ ధరలు సగటున 18% వరకు తగ్గే అవకాశం ఉంద ని ఆర్థిక నమూనాలు సూచిస్తున్నాయి. 2035 నాటికి దిగుమతుల వాటా 20% దాటితే ధరల పతనం 25% నుంచి 30% వరకు ఉండే ప్రమాదం ఉంది. ఇది నేరుగా రైతులు పొందే ఆదాయంపై తీవ్రప్రభావం చూపుతుంది.

ఉత్పత్తి విస్తీర్ణం. 2024-25 సంవత్సరంలో సోయాబీన్ సాగు విస్తీర్ణం సుమారు 12.95 మిలియన్ హెక్టార్లుగా నమోదైంది. ధరల పతనం కొనసాగితే 2028 నాటికి ఈ విస్తీర్ణం 10% వరకు తగ్గే అవకాశం ఉంది. 2032 నాటికి ఇది 18% వరకు పడిపోయే ప్రమాదం ఉంది. దీని అర్థం లక్షలాది రైతులు సోయాబీన్ సాగు నుంచి ఇతర పంటల వైపు మళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. కానీ ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ భద్రత లేకపోతే రైతుల ఆర్థిక అస్థిరత మరింత పెరుగుతుంది.


రైతుల ఆదాయం. 2025 సంవత్సరంలో సోయాబీన్ రైతుల సగటు వార్షిక ఆదాయం సుమారు ₹98000 గా అంచనా వేయబడింది. ధరలు 20% తగ్గితే అదే ఆదాయం 2030 నాటికి 78000 స్థాయికి పడిపోయే అవకాశం ఉంది. ఇది సుమారు 20% ఆదాయ నష్టం. 2035 నాటికి ధరల పతనం 30% కు చేరితే రైతుల ఆదాయం 68000 వరకు తగ్గే ప్రమాదం ఉంది. వ్యవసాయం ఇప్పటికే అధిక ప్రమాదాలతో కూడిన రంగంగా ఉన్న నేపథ్యంలో ఈ ఆదాయ తగ్గుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీయగలదు. ఉపాధి ప్రభావం. సోయాబీన్ సాగు, దానికి అనుబంధంగా ఉన్న నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ రంగాల్లో సుమారు 1.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. సాగు విస్తీర్ణం 15% తగ్గితే ఉపాధి అవకాశాలు 10% వరకు తగ్గే అవకాశం ఉంది. 2030 నాటికి ఈ రంగంలో ఉపాధి కోల్పోయే వారి సంఖ్య 15 లక్షలకు చేరే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్న కారణంగా ఇది సామాజిక అస్థిరతకు దారితీయగలదు.

ఐదవ అంశం మార్కెట్ నిర్మాణం. అమెరికా వంటి దేశాల్లో వ్యవసాయం పెద్ద కార్పొరేట్ ఆధారితంగా కొనసాగుతోంది. భారీ ఫార్ములు, అధిక సాంకేతిక వినియోగం, ప్రభుత్వ సబ్సిడీల కలయిక వల్ల అక్కడి ఉత్పత్తులు తక్కువ ధరలకు లభిస్తున్నాయి. భారత మార్కెట్‌లో ఈ ఉత్పత్తులు పెరిగితే స్థానిక వ్యాపారులు, చిన్న ప్రాసెసింగ్ యూనిట్లు పోటీ తట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. 2027 నుంచి 2032 మధ్యకాలంలో దేశీయ నూనె పరిశ్రమలో చిన్న యూనిట్ల సంఖ్య 20% వరకు తగ్గే అవకాశం ఉందని కొన్ని అంచనాలు సూచిస్తున్నాయి. విధాన అవసరం. ఈ పరిస్థితుల్లో 2026 నుంచి 2035 మధ్యకాలంలో ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోకపోతే సోయాబీన్ రంగంపై ప్రతికూల ప్రభావం తీవ్రతరం అవుతుంది. దిగుమతులపై పరిమిత కోటాలు, ధరల పతనం జరిగినప్పుడు స్వయంచాలక రక్షణ సుంకాలు, విలువ ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వంటి చర్యలు తీసుకుంటే ప్రతికూల ప్రభావాన్ని 30% నుంచి 40% వరకు తగ్గించవచ్చు అనే అంచనాలు ఉన్నాయి. మొత్తంగా పరిశీలిస్తే అమెరికాతో వాణిజ్య ఒప్పందం సోయాబీన్ రంగానికి తక్షణంగా పెద్ద షాక్ ఇవ్వకపోయినా 2028 తర్వాత దాని ప్రభావం స్పష్టంగా బయటపడే అవకాశాలు ఉన్నాయి. ధరల పతనం, సాగు విస్తీర్ణం తగ్గుదల, రైతుల ఆదాయ క్షీణత, ఉపాధి నష్టం వంటి అంశాలు పరస్పరం అనుసంధానమై గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే శక్తి కలిగి ఉన్నాయి. సరైన విధాన జోక్యాలు లేకపోతే ఈ ఒప్పందం సోయాబీన్ రంగానికి గుదిబండగా మారే ప్రమాదం ఉంది. అదే సమయంలో సమతుల్యమైన రక్షణ చర్యలు తీసుకుంటే ఈ ప్రభావాన్ని నియంత్రించి రైతులకు స్థిరమైన భవిష్యత్తును అందించే అవకాశం కూడా ఉంది. ఈ కారణంగానే రాబోయే సంవత్సరాల్లో విధాన నిర్ణయాలు సోయాబీన్ రంగ భవిష్యత్తును నిర్ణయించే కీలక పాత్ర పోషించబోతున్నాయి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# విలువలేని విద్యా వ్యాపారం



### డిగ్రీల కర్మాగారాల నుండి జ్ఞాన సమాజం వైపు

భారతదేశంలో ఉన్నత విద్య ఒకప్పుడు సామాజిక మార్పుకు, పేదరిక నిర్మూలనకు, ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రధాన సాధనంగా పరిగణించబడింది. కానీ గత రెండు దశాబ్దాల్లో అది క్రమంగా లాభాపేక్షతో నడిచే వ్యాపార రంగంగా మారిపోతున్నది. ప్రైవేట్ విశ్వవిద్యాలయాల విస్తరణ, భారీ ఫీజులు, అదనపు చార్జీలు, హాస్టల్ బలవంతపు వసతులు, విద్యార్థులపై క్రమశిక్షణ పేరిట బౌన్సర్ల సంస్కృతి, కలిసి ఉన్నత విద్యను విలువలేని వాణిజ్య వస్తువుగా మార్చుతున్నాయి.

**ఇది ఏకైక సంస్థ సమస్య కాదు; వ్యవస్థాగత వైఫల్యం.**

దేశంలో ఉన్నత విద్యను పర్యవేక్షించే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏ.ఐ.సి.టి.ఇ) వంటి సంస్థలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ మరియు డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై సమర్థ నియంత్రణ లోపిస్తున్నది. అకడమిక్ ఫీజు కాకుండా 'కెరీర్ డెవలప్‌మెంట్', 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్', 'అడ్మినిస్ట్రేటివ్' పేర్లతో అదనపు వసూళ్లు సాధారణమయ్యాయి. డే స్కాలర్ విద్యార్థుల నుంచే హాస్టల్, మెస్ చార్జీలు వసూలు చేయడం వంటి ఘటనలు విద్యను సేవగా కాకుండా ఆదాయ వనరుగా చూస్తున్న మనస్తత్వాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏ.ఐ.ఎస్.హెచ్.ఇ) తాజా నివేదిక ప్రకారం దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సుమారు 28 నుండి 29 శాతం మధ్య ఉంది. అంటే కాలేజీ వయస్సున్న ప్రతి 100 మందిలో కేవలం 28 లేదా 29 మందికే ఉన్నత విద్య అందుతోంది. షెడ్యూల్డ్ కాస్ట్ విద్యార్థులలో ఇది సుమారు 23 శాతం, షెడ్యూల్డ్ ట్రైబ్ విద్యార్థులలో 18 శాతం చుట్టూ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం మరింత తక్కువ. ఈ పరిస్థితిలో సంవత్సరానికి 2 లక్షల నుండి 5 లక్షల రూపాయల ట్యూషన్ ఫీజులు, అదనంగా హాస్టల్ ఫీజులు, రవాణా, ఇతర చార్జీలు కలిపి ఒక ఇంజినీరింగ్ లేదా మేనేజ్‌మెంట్ కోర్సు మొత్తం ఖర్చు 10 నుండి 20 లక్షల రూపాయల వరకు పెరగడం సామాజిక అసమానతలను తీవ్రమం చేస్తోంది.

ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను పరిశీలిస్తే విభిన్న దృశ్యం కనిపిస్తుంది. హార్వర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి), యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్ఫర్డ్ వంటి సంస్థల్లో ట్యూషన్ ఫీజులు అధికమే అయినప్పటికీ, 'నీడ్ బేస్డ్ ఫైనాన్షియల్ ఎయిడ్' వ్యవస్థ బలంగా అమల్లో ఉంటుంది. కుటుంబ ఆదాయం నిర్దిష్ట పరిమితికి దిగువన ఉంటే పూర్తి ఫీజు మాఫీ లేదా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందుతుంది. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి సుమారు 1:7 లేదా 1:10 మధ్య ఉండటం వల్ల వ్యక్తిగత మార్గదర్శనం సాధ్యమవుతుంది. పరిశోధన నిధులు విస్తృతంగా లభిస్తాయి. హాస్టల్ వసతులు నాణ్యమైనవి; విద్యార్థి సంఘాలు చట్టబద్ధంగా పనిచేస్తాయి; విద్యార్థి-మేనేజ్‌మెంట్ మధ్య అధికారిక సంభాషణ వ్యవస్థ ఉంటుంది.

భారతదేశంలోని అనేక ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో మాత్రం విద్యార్థి-టీచర్ నిష్పత్తి 1:25 లేదా 1:40 వరకు పెరుగుతోంది. తాత్కాలిక అధ్యాపకులపై ఆధారపడటం ఎక్కువ. పరిశోధన వ్యయం దేశీయ స్థూల ఉత్పత్తిలో 0.7 శాతం కన్నా తక్కువగా ఉండగా, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 2 నుండి 3 శాతం వరకు ఉంటుంది. రంగురంగుల బ్రోచర్లు, గ్లాస్ భవనాలు ఉన్నప్పటికీ, ఆధునిక ల్యాబ్‌లు, పరిశోధన సదుపాయాలు తక్కువగా ఉండే పరిస్థితి ఉంది.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం గత కొన్ని సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థి ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఫీజుల ఒత్తిడి, అకడమిక్ ఒత్తిడి, ఉద్యోగ భవిష్యత్తుపై అనిశ్చితి, సామాజిక ఒంటరితనం-ఇవన్నీ కలిపి మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. అనేక ప్రైవేట్ క్యాంపస్‌లలో కౌన్సిలింగ్ వ్యవస్థలు బలహీనంగా ఉన్నాయి.


నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 (ఎన్.ఇ.పి-2020)లో 'గ్రేడెడ్ ఆటానమీ' పేరుతో విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఇచ్చారు. స్వయం ప్రతిపత్తి అంటే అకడమిక్ స్వేచ్ఛ, కొత్త కోర్సుల ఆవిష్కరణ, పరిశోధన ప్రోత్సాహం కావాలి. కానీ అమలులో అది ఫీజుల పెంపు, మార్కెట్ ఆధారిత కోర్సుల విస్తరణకు దారితీస్తున్నదనే విమర్శ ఉంది. సుప్రీంకోర్టు పలుమార్లు విద్యను లాభాపేక్షలేని సేవగా పేర్కొన్నప్పటికీ, ఆ ఆత్మను కాపాడే కఠిన నియంత్రణలు అమలులో కనిపించడం లేదు.

భారతదేశంలో ఉన్నత విద్యపై ప్రభుత్వ వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 1.3 శాతం చుట్టూ ఉంది. ఇది పెరగకపోతే ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బలహీనమవుతాయి. అధ్యాపకుల ఖాళీలు వేలల్లో ఉన్నాయి. పబ్లిక్ యూనివర్సిటీలకు నిధులు తగ్గించి, ప్రైవేట్ రంగానికి రాయితీలు ఇవ్వడం దీర్ఘకాలంలో సామాజిక విభజనను పెంచుతుంది. డబ్బున్న వారికి ఏసీ తరగతులు, అంతర్జాతీయ ప్రమాణాల సదుపాయాలు; పేదలకు పాత భవనాలు, ఉపాధ్యాయుల కొరత...ఇది ద్వంద్వ విద్యా వ్యవస్థ.

ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు కొన్ని కీలక మార్పులు అవసరం. ప్రైవేట్ మరియు డీమ్డ్ విశ్వవిద్యాలయాలపై కఠిన ఆర్థిక ఆడిట్ తప్పనిసరి చేయాలి. ఫీజు నిర్మాణాన్ని ప్రజలకు బహిర్గతం చేయాలి. రాష్ట్ర స్థాయిలో స్వతంత్ర ఫీజు నియంత్రణ అథారిటీ ఏర్పాటు చేయాలి. విద్యార్థి సంఘాల హక్కులను చట్టబద్ధం చేయాలి. క్యాంపస్‌లలో బౌన్సర్ల సంస్కృతిని పూర్తిగా నిషేధించాలి. ప్రతి విశ్వవిద్యాలయంలో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ కేంద్రం తప్పనిసరి చేయాలి.

పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నీడ్ బేస్డ్ స్కాలర్‌షిప్ వ్యవస్థను విస్తరించాలి. విద్యార్థి రుణాలపై వడ్డీ సబ్సిడీ ఇవ్వాలి. పరిశోధన నిధులను కనీసం స్థూల దేశీయోత్పత్తిలో 2 శాతానికి పెంచే లక్ష్యం పెట్టుకోవాలి. విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తిని గరిష్టంగా 1:20 వరకు పరిమితం చేయాలి. నియామకాల్లో పారదర్శకత ఉండాలి.

విద్య ఒక హక్కు. అది మార్కెట్ ఉత్పత్తి కాదు. విశ్వవిద్యాలయం ఒక వ్యాపార సంస్థ కాదు; అది సమాజానికి దిక్సూచి. డిగ్రీలు కాగితపు ముక్కలు కాదు; అవి బాధ్యతలు. భారతదేశం నిజమైన జ్ఞాన సమాజంగా ఎదగాలంటే, ఉన్నత విద్యను మళ్లీ విలువలతో ముడిపెట్టాలి. లాభం కంటే లక్ష్యం, ఫీజు కంటే భవిష్యత్తు, బ్రాండ్ కంటే బుద్ధి-ఇవే మార్గదర్శక సూత్రాలు కావాలి. అప్పుడే డిగ్రీల కర్మాగారాల స్థానంలో సృజనాత్మకత, పరిశోధన, సమానత్వం పునరుద్ధరించబడతాయి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# సేవాలాల్ ఆశయాలు..

## గిరిజన అభ్యున్నతికి అసలైన మార్గాలు..

భారతీయ సామాజిక విప్లవకారుల్లో సద్గురు సేవాలాల్ మహారాజ్ అగ్రగణ్యులు. 18వ శతాబ్దంలోనే అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం, వారి సామాజిక సంస్కరణల కోసం పోరాడిన ధీశాలి ఆయన. నేడు తండాల్లో సేవాలాల్ జయంతి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి, కానీ ఆయన కలలుగన్న విద్యావంత, వ్యసనరహిత సమాజం ఎంతవరకు సాకారమైందనేది నేటికీ ఒక మిలియన్ డాలర్ల ప్రశ్నే. ముఖ్యంగా విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న వెనుకబాటుతనం ఆందోళన కలిగిస్తోంది. ఒక సామాజిక దిక్సూచి సేవాలాల్ మహారాజ్.. కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు.. ఒక గొప్ప పర్యావరణవేత్త, గో సంరక్షకుడు మరియు స్త్రీ పక్షపాతి. "లడాయి మత్ మారో, లబారి మత్ బోలో" (హింస వద్దు, అబద్ధం ఆడవద్దు) అంటూ ఆయన ఇచ్చిన పిలుపు బంజారా సమాజానికి ఒక రాజ్యాంగం వంటిది. అజ్ఞానపు చీకట్లను చీల్చుతూ అక్షర జ్ఞానం వైపు మళ్లాలని ఆయన నాడే బోధించారు. కానీ, నేటి ఆధునిక కాలంలో కూడా గిరిజన గూడాలు విద్యా వెలుగుల కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉండటం విచారకరం.

విద్యారంగం అందని ద్రాక్షగా ఉన్నత చదువులు గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్య కొంతమేర మెరుగుపడినప్పటికీ, ఉన్నత విద్యలో వెనుకబాటుతనం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మౌలిక వసతుల లేమి: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో కనీస వసతులు లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల ఉత్సాహాన్ని నీరుగార్చుతోంది. భాషా పరమైన అడ్డంకులు: మాతృభాష అయిన 'గోర్ బోలి'లో బోధన లేకపోవడం వల్ల ప్రాథమిక స్థాయిలో గిరిజన విద్యార్థులు ఇతర విద్యార్థులతో పోటీ పడలేకపోతున్నారు. తల్లిదండ్రులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోతోంది. ఇది గిరిజన సమాజంలో అక్షరాస్యత శాతాన్ని కుంగదీస్తోంది. ఉద్యోగ అవకాశాలు రిజర్వేషన్లు ఉన్నా రాని ఫలితం.. రిజర్వేషన్లు అనేవి రాజ్యాంగం కల్పించిన హక్కు అయినప్పటికీ, గిరిజన యువతకు అవి పూర్తిస్థాయిలో అందడం లేదు.నైపుణ్యాల కొరత మారుమూల తండాల్లో సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణా కేంద్రాలు అందుబాటులో లేవు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వచ్చే ఉద్యోగాలకు గిరిజన యువత అర్హత సాధించలేకపోతున్నారు.ప్రభుత్వ నోటిఫికేషన్ల జాప్యం ఏళ్ల తరబడి నోటిఫికేషన్లు రాకపోవడంతో వయోపరిమితి మించిపోయి, గిరిజన నిరుద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారు.పట్టణ ప్రాంత విద్యార్థులతో పోలిస్తే, గ్రామీణ తండాల విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య, ఇంటర్నెట్ వనరులు అందకపోవడం వల్ల పోటీ పరీక్షల్లో వెనుకబడుతున్నారు.

**రాజకీయ చైతన్యం - అభివృద్ధికి కీలకం**

రాజకీయంగా బంజారాలు తమ గళాన్ని బలంగా వినిపించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. కేవలం ఓటు వేసే యంత్రాలుగా కాకుండా, విధాన నిర్ణయాల్లో భాగస్వాములు కావాలి. ముఖ్యంగా మహబూబాబాద్ వంటి గిరిజన ప్రాధాన్యత ఉన్న జిల్లాల్లో అభివృద్ధి నిధులు నేరుగా తండాల మౌలిక వసతులకు, విద్యా కేంద్రాలకు అందేలా ఒత్తిడి తీసుకురావాలి.

సద్గురు సేవాలాల్ మహారాజ్ కు ఇచ్చే నిజమైన నివాళి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు; ఆయన ఆశించినట్లుగా ప్రతి తండా బిడ్డ చేతికి పుస్తకం అందడం, ప్రతి యువకుడికి గౌరవప్రదమైన ఉద్యోగం లభించడం. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో గిరిజన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి చేర్చాలి. గిరిజన యువత కూడా మూఢనమ్మకాలు, వ్యసనాలను వీడి సేవాలాల్ చూపిన ధర్మ మార్గంలో పయనిస్తూ విద్యావంతులుగా ఎదగాలి. అప్పుడే బంజారా సమాజం ఆత్మగౌరవ శిఖరాలను అధిరోహిస్తుంది.



**తేజావత్ రవి నాయక్**
జర్నలిస్ట్ మహబూబాబాద్,
ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ముఖ్య సలహాదారులు.. తెలంగాణ స్టేట్.

# డబుల్ బెడ్‌రూం ఇండ్లలో నివసించకపోతే ఇండ్లు రద్దు

- అర్హులైన ఇతరులకు కేటాయిస్తాం
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండి విపి గౌతం స్పష్టీకరణ



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ధిదారులు నివసించక పోతే, వాటి కేటాయింపు ను రద్దు చేసి అర్హులైన ఇతరులకు మంజూరు చేస్తామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి. పి. గౌతమ్ స్పష్టం చేశారు. వివిధ దశల్లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పఠాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు డబల్ బెడ్ రూమ్ కాలనీ లను సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సంగారెడ్డి ప్రాజెక్టు డైరక్టర్ సి. చలపతి రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవీందర్, డి.నర్సయ్య తదితరులతో కలిసి కర్దనూరు, పోచారం, అమీన్ పూర్, రామేశ్వరం బండ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా కాలనీల్లోని స్థితిగతులను తెలుసుకున్నారు. తొలుత కర్దనూనార్ లో సుమారు 9 ఎకరాల విస్తీర్ణం లో దాదాపు రూ. 140 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కాలనీ లోని పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేసి నివాస యోగ్యంగా తీర్చిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. ఇక్కడ ప్రధానంగా మౌలిక వసతుల పనులు మాత్రమే మిగిలి ఉన్నందున, వాటన్నిటిని పూర్తి చేసి, వచ్చే నెలలో లబ్ధిదారులకు కేటాయించేలా చూడాలన్నారు. శంకరపల్లి ప్రధాన రహదారిలో, అవుటర్ రింగ్ రోడ్డుకు అత్యంత సమీపంలో ఉన్న ఈ కాలనీ మంచి ల్యాండ్ మార్క్ గా రూపొందుతుందని,కాలనీలో మెరుగైన వసతులతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. మొదటి ఫేస్ లో పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించిన 540 ఇండ్ల కాలనీని ఆకస్మికంగా తనిఖీ చేసి, లబ్ధిదారులే నివసిస్తున్నారా, లేదా అన్న అంశం పై సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇక్కడ చాలామంది నివసించటం లేదని, వారు రాకుంటే రద్దు చేస్తామని స్పష్టం చేస్తూ, ఇకపై ఆకస్మికంంగా తనిఖీ లు చేస్తామన్నారు. స్థానికులతో మాట్లాడుతూ, వెల్ఫేర్ అసోసియేషన్ వారు సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకుని, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించుకోవడం పట్ల అభినందించారు. ఆయ బ్లాక్ లో ఏ ఫ్లాట్ లో ఎవరు ఉంటున్నారన్న లిస్టును కూడా ఏర్పాటు చేసుకోవడాన్ని ప్రశంసిస్తూ,ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇండ్లలో నివసించకుండా కేవలం తాళాలు వేసుకుని, లేదా అద్దెకు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడితే కఠింగా వ్యవహరించనున్నామని ఎండి గౌతం పేర్కొన్నారు. ఇదే విషయాన్ని బల్డింగ్ అసోసియేషన్ వారు సభ్యులందరికీ గట్టిగా చెప్పాలని, ఇప్పటికే ఈ కాలనీల్లో నివసించని వారి వివరాలను తెలుసుకున్నామని, ఇకపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, ఇండ్లలో ఉండని వారికి ఇండ్లను రద్దు చేస్తామని అన్నారు. అనంతరం పోచారంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 62 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 720 ఇండ్ల నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ పనులన్నీ వచ్చే నెలలో పూర్తి కానున్న నేపథ్యంలో, పాఠశాలలు, అంగన్ వాడీ సెంటర్, కమ్యూనిటీహాల్ వంటివి కూడా నిర్మించాలని అధికారులకు సూచించారు. అమీన్ పూర్ లో ప్రాంతంలో ఇప్పటకే లబ్ధిదారులకు కేటాయించినడబుల్ బెడ్ రూం కాలనీలో విస్తృతంగా పర్యటించి, నిర్మాణంలో ఉన్న ఇండ్ల పనులపై సమీక్షించారు. ముఖ్యంగా ఎంతో సుందరంగా, ప్రతి వీధిలోను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పచ్చని మొక్కలు, పాఠశాల వంటివి ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా అనేక మంది ఇక్కడ నివాసముండకుండా వేరే చోట ఉంటున్నారంటూ స్థానికులు చెప్పారు. దీనిపై స్పందిస్తూ, ఇండ్ల కేటాయించిన వారికి ఇక్కడి నివాసం ఉండటానికి ఇష్టపడకపోతే, రద్దు చేసి, ఇండ్లు కావాలని వేచి చూస్తున్న ఇతర పేదలకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని అందరికీ అర్థం అయ్యేలా నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రామేశ్వరం బండ లోని జెఎన్ ఎన్ యుఆర్ ఎం కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## నెక్నంపూర్ చెరువుకు శాశ్వత పరిష్కారం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** నెక్నంపూర్ చెరువులో మురుగు నీరు చేరడం వల్ల పరిసర ప్రాంతాల నివాసితులకు తీవ్ర దోమల సమస్యపై పరిష్కరించాలని అధికారులను నిరంతరం కోరామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం అధికారులు, ఆరోగ్య శాఖ సమన్వయంతో అమృత్ పథకం కింద అవసరమైన పనులను ప్రత్యేక ఆహ్వానంగా మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జితేందర్, మాజీ కార్పొరేటర్లు లక్ష్మీ నారాయణ, తాజ్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, హాజీలు స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత చెరువులోకి మురుగు నీరు చేరకుండా పూర్తిగా అడ్డుకట్ట వేస్తామని, వర్షపు నీరు మాత్రమే సక్రమమైన స్టార్మ్ వాటర్ డ్రైన్ల ద్వారా చెరువులోకి చేరేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.దీంతో దోమల నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు ప్రజారోగ్య మెరుగుదలకు శాశ్వత పరిష్కారం తో, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ, ప్రాంత అభివృద్ధి పనులపై స్పష్టతనిచ్చారు.

## ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యశాఖ ఆకస్మిక తనిఖీలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులపై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి ఆధ్వర్యంలో డాక్టర్ పవన్ కార్యక్రమ అధికారి, వసంత ఉప అధికారి మరియు విభాగ సిబ్బంది కలిసి ప్రగతి నగర్‌లోని ప్రసాద్ ఆసుపత్రి మరియు రోడ్ నంబర్ 4లో ఉన్న ప్రసాద్ ఆసుపత్రి యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో అందిస్తున్న వైద్య సేవలు, సంబంధిత రికార్డులు, అనుమతిపత్రాలు, ధృవపత్రాలు, పరిశుభ్రత ప్రమాణాలు, ప్రసూతి సేవలు, స్కానింగ్ సేవలు, శస్త్రచికిత్స గది సేవలు వంటి అంశాలను విపులంగా పరిశీలించారు. అలాగే రోగులకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరియు ప్రభుత్వ నిబంధనల అమలు స్థితిని సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై నోటీసులు జారీ చేయబడతాయని, లోపాలను సరిదిద్దని పక్షంలో సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా మరో బృందం డాక్టర్ గీతా కార్యక్రమ అధికారి ఆధ్వర్యంలో శ్రీకర ఆసుపత్రి, విజయ ఆసుపత్రి, రామరాజ్ ఆసుపత్రులపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

## కొచ్చిలో 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ సందడి

- నామినేషన్లలో దక్షిణాది తారల పోటీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) : ప్రతిష్టాత్మక 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌కు నామి నేషన్లు ప్రకటించడంతో దక్షిణాది సినీ వర్గాల్లో ఉ త్సాహం నెలకొంది. కేరళ టూరిజం భాగస్వామ్యం తో ఫిబ్రవరి 21న కొచ్చిలోని అడ్లక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ వేడుకలు ఘనంగా నిర్వ హించనున్నారు. 2024లో విడుదలైన మలయా ళం, కన్నడ, తమిళం, తెలుగు చిత్రాలకు సంబం ధించిన ఉత్తమ ప్రతిభకు గాను ఈ అవార్డులు అందజేయనున్నారు. మలయాళంలో ఆడుజీ వితం 8 నామినేషన్లతో ముందంజలో ఉండగా, కన్నడలో కృష్ణం ప్రణయ సఖి, తమిళంలో అమర న్ 10 నామినేషన్లు అగ్రగాములుగా నిలిచాయి. తెలుగులో పుష్ప-2 ది రూల్, లక్కీ భాస్కర్, హను మాన్ చిత్రాలు తలా 7 నామినేషన్లతో పోటీని మరింత రసవత్తరంగా మార్చాయి. మలయాళ విభాగంలో ఆట్టం, ఆవేశం, భ్రమయుగం, మంజు మ్మెల్ బాయ్స్, ప్రేమలు, ఉల్లం వంటి చిత్రాలు ఉత్త మ చిత్రంగా పోటీలో ఉన్నాయి. ఉత్తమ నటుడి విభాగంలో మమ్ముట్టి, ఫహద్ ఫాసిల్, పృథ్వీరాజ్ వంటి దిగ్గజాలు నిలిచారు. కన్నడలో భీమ, బ్లింక్, బఘీరా చిత్రాలు ప్రధాన పోటీలో ఉండగా, శివరా జ్‌కుమార్, సుదీప్, దునియా విజయ్ ఉత్తమ నటు డి విభాగంలో నామినేషన్లు సాధించారు. తమిళం లో విక్రమ్, ధనుష్, విజయ్ సేతుపతి, శివ కార్తికే యన్ తదితరులు పోటీలో ఉండటం విశేషం. తెలు గు విభాగంలో ఉత్తమ చిత్రంగా కల్కి 2898 ఏడి, 35 చిన్న కథ కాదు, కమిటీ కుర్రోలు కూడా పోటీలో నిలిచాయి. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, జూ. ఎన్టీఆర్, నాని, దుల్కర్ సల్మాన్ తదితరులు నామినేషన్లు పొందారు. ఉత్తమ నటి విభాగంలో రష్మిక మందన్న, నివేతా థామస్, అనుపమ పర మేశ్వరన్, మీనాక్షి చౌదరి వంటి నటీమణులు చోటు దక్కించుకున్నారు. కల్కి 2898 ఏడి చిత్రా నికి అమితాబ్ బచ్చన్ సహాయ నటుడిగా నామి నేషన్ పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దక్షి ణాది సినీ ప్రతిభకు ఇది మరో మహత్తర వేదికగా నిలవనుంది.

## చేవెళ్ల చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం

- కాంగ్రెస్ 11, బిఆర్ఎస్ 4, బీజేపీ 3
- చైర్మన్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ



**చేవెళ్ల, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** చేవెళ్ల మునిసిపాలిటీ లో 18 వార్డులకు బిఆర్ఎస్ కు నాలుగు, బిజెపికి మూడు, కాంగ్రెస్ 11 వార్డులు గెలుపొంది కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కైవసం చేసుకుంది. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పర్సన్ అభ్యర్థి దేవర సమతావెంకట్ రెడ్డికి 707 అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. మొత్తం మున్సిపాలిటీలోని 18 వార్డులకు సంబంధించిన 59 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. మొదటి రౌండ్ లోనే కాంగ్రెస్ కు నాలుగు, బిఆర్ఎస్ కు నాలుగు, బిజెపికి ఒకటి రాగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులను నిరుత్సాహం సంతరించుకుంది. రెండో రౌండ్ 10 నుండి 18 వ వార్డు వరకు రెండో రౌండ్ కౌంటింగ్ ఓట్ల లెక్కింపు ఉత్కంఠంగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ వారీగా చూసుకుంటే మొదటి రౌండ్ ఫలితాలు పునరావృతం కావని అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదురుచూసినట్టుగానే కాంగ్రెస్ పార్టీకి అధిక సీట్లు వచ్చి అంచనాలు తారుమారయ్యాయి. చేవెళ్ల మునిసిపాలిటీ 18 వార్డులకు పార్టీల వారిగా గెలుపొందిన వివరాలు 1వ వార్డులమ దూత మల్లేష్ (బిఆర్ఎస్), 2వ వార్డు డప్పు సువర్ణ చందు (బిఆర్ఎస్), 3వ వార్డు కరకే మీనాక్షి (బిజెపి), 4వ వార్డు బక్క రెడ్డి మాధవి యాదిరెడ్డి (కాంగ్రెస్), 5వ వార్డు దేవులపల్లి శ్రీనివాసరెడ్డి (బిఆర్ఎస్), 6వ వార్డు సోలిపురం సుచితా బల్వంత్ రెడ్డి (కాంగ్రెస్), 7వ వార్డు కురవ మంగమ్మ మల్లేష్ (బిఆర్ఎస్), 8వ వార్డు దావల్గారి గోపాల్ రెడ్డి (కాంగ్రెస్), 9వ వార్డు తాళ్లపల్లి నరసింహులు (కాంగ్రెస్), 10వ వార్డు పెద్దోళ్ల దయాకర్ (బిజెపి), 11వ వార్డు పైండ్ల మధుసూదన్ రెడ్డి (కాంగ్రెస్), 12వ వార్డు దేవర మనిషా అనంత్ రెడ్డి (బిజెపి), 13వ వార్డు రాములు గౌడ్ (కాంగ్రెస్), 14వ వార్డు మద్దెల శ్రీనివాస్ (కాంగ్రెస్), 15వ వార్డు బండారి శైలజ ఆగి రెడ్డి (కాంగ్రెస్), 16వ వార్డు దేవర సమత వెంకట్ రెడ్డి (కాంగ్రెస్), 17వ వార్డు మూడవత్ కృష్ణ నాయక్ (కాంగ్రెస్), 18వ వార్డు మంగలి కళ్యాణి యాదగిరి ( కాంగ్రెస్) లు గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు నియామక పత్రాలు అందజేశారు. గెలుపొందిన అభ్యర్థులు పార్టీల వారీగా ర్యాలీగా టపాసులు పెలుచుకుంటూ విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు.

## కార్పొరేషన్‌లో కాంగ్రెస్ ఘన విజయం



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లకు గాను సాయంత్రం వరకు 30 డివిజన్ల ఎన్నికల ఫలితాలు విడుదల కాగా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని కార్పొరేషన్‌పై తన పట్టు చాటుకుంది. మొత్తం డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలిచి విజయం పతాకం ఎగరవేశారు. ప్రధానంగా 1, 3, 4, 5, 6, 10, 11, 13, 19, 23, 24, 27, 29, 30 డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా, స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని మరోసారి నిరూపించుకున్నారు. ఇక భారత్ రాష్ట్ర సమితి 8, 9, 12, 15, 16, 17, 18, 26, 28 డివిజన్లలో గెలిచి గణనీయమైన ప్రాతినిధ్యం సంపాదించింది. కొన్ని వార్డుల్లో తక్కువ మెజారిటీలతో గెలుపొందినప్పటికీ పార్టీ కేడర్ కష్టానికి ఫలితం దక్కింది. భారతీయ జనతా పార్టీ 20, 21, 22, 25 డివిజన్లలో విజయం సాధించి పట్టణ ప్రాంతాల్లో తన ఉనికిని చాటుకోగా, ఆల్ ఇండియా మజ్లిస్-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ 14వ డివిజన్‌లో గెలిచి ఒక్క సీటుతో సంతృప్తి చెందింది. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన పెద్దగొల్ల నర్సింలు, మంజుల గెలిచి స్థానిక రాజకీయాల్లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించారు. కొన్ని డివిజన్లలో స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు రావడం ఎన్నికల ఉత్కంఠను మరింత పెంచింది. మొత్తంగా చూస్తే కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో నిలవగా, ఇతర పార్టీలకు పరిమిత అవకాశాలే దక్కాయి. రాబోయే పాలనలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై కొత్త కార్పొరేటర్ల పనితీరు ఎలా ఉంటుందో ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయకేతనం

- మెజార్టీ స్థానాలు గెలుపొంది చైర్మన్ కైవసం
- మూడు స్థానాలకి పరిమితం బిఆర్ఎస్
- కనుమరుగైన కమలం



**జోగిపేట, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయ కేతనం ఎగరవేసింది. గత 15 రోజులుగా నిద్ర హారాలు మాని ప్రచారం చేసిన పలు పార్టీల నాయకులు ఊపిరిపించుకున్నారు. అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులో గాను 16 వార్డులలో కాంగ్రెస్ మూడు మూడు వార్డులలో టిఆర్ఎస్ ఒకటి ఇండిపెండెంట్ గెలుచుకున్నాయి. ఇందులో ఒకటో వార్డు నుండి గడ్డి అరుణ్( కాంగ్రెస్), రెండవ వార్డ్ నుండి కోసికే రాజశేఖర్( కాంగ్రెస్) , మూడవ వాడు నుండి మర్రి అరుణకుమారి( కాంగ్రెస్) , నాలుగో వార్డ్ నుండి కల్పన హరికృష్ణ గౌడ్( కాంగ్రెస్) , ఐదవ వార్డ్ నుండి కొత్త గొల్ల మాధవి శ్రీనివాస్( కాంగ్రెస్), ఆరవ వార్డు నుండి రాచకొండ జ్యోతి ప్రదీప్ గౌడ్( కాంగ్రెస్) , ఏడవ వాడు నుండి తోట్ల రామకృష్ణ( కాంగ్రెస్), ఎనిమిదవ వార్డు నుండి భవాని నాగరత్నం గౌడ్ (టిఆర్ఎస్) , 9వ వార్డు నుండి శోభ నారాయణ గౌడ్ (టిఆర్ఎస్) , పదవ వార్డు నుండి పట్లోళ్ల రేఖ ప్రవీణ్ (కాంగ్రెస్) , 11వ వార్డు నుండి కల్పనా నాగరాజ్( కాంగ్రెస్) , 12వ వార్డు నుండి కోరబోయిన సరస్వతి( కాంగ్రెస్) , 13వ వార్డు నుండి పట్లూరిశివశేఖర్ (టిఆర్ఎస్) , 14వ వార్డు నుండి ఊర్మిళ దుర్గేష్ (ఇండిపెండెంట్), 15వ వార్డు నుండి ఆకుల చిట్టిబాబు (కాంగ్రెస్) , 16వ వార్డు నుండి పట్లోళ్ల శ్రీనివాస్( కాంగ్రెస్) , 17వ వార్డు నుండి మేఘావత్ మేఘా రాణి (కాంగ్రెస్) , 18 వ వార్డు నుండి బేగరీ శశిరేఖ అనిల్ (కాంగ్రెస్) , 19వ వార్డు నుండి అల్లే మంజుల శ్రీకాంత్ (కాంగ్రెస్) , 20వ వార్డు నుండి కృష్ణారెడ్డి (కాంగ్రెస్) . లు గెలుపొందారు. గెలిచిన వారికి వార్డు ప్రజలు నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. మిఠాయిలు పంచుకొని బాణసంచాలను పేల్చుకున్నారు. ఈనెల 16న చైర్మన్ ఎన్నిక జరగనుంది.

## భక్తులకు అసౌకర్యంగా ఉండొద్దు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మహాశివరాత్రి సందర్భంగా మెదక్ జిల్లా ఏడుపాయల వనజాతరకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్, త్రాగునీరు, పార్కింగ్, సంస్కృతిక కార్యక్రమాలు, దర్శన ఏర్పాట్ల పనుల పై దిశా నిర్దేశం చేశారు. 2026 జాతరకు సుమారు పది లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉండాలన్నారు. మెదక్ గ్రామీణ సిఐ జార్జి,ఆలయ ఈవో వీరేశం,తహసీల్దార్ సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రాణాలైనా అర్పిస్తాం..శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం..

- మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి




**హయత్‌నగర్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ప్రాంతం లోని బొమ్మల గుడి రోడ్డు నుండి కుంట్లూర్ రోడ్డుకు వెళ్లే ప్రధాన మార్గం లో శివం హిల్స్, శ్రీ దుర్గా నగర్, విష్ణు నగర్, సిరి హిల్స్, శివ గంగా కాలనీ, నంది హిల్స్, విజయ్ నగర్ కాలనీ, 20 కాలనీల సంక్షేమ సంఘ సభ్యులు కలిసి శివం హిల్స్ చౌరస్తా లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం స్వచ్ఛందంగా చందాలు సేకరించి, కాంక్రీట్‌తో ఒక పిల్లర్ నిర్మించారు. ఈ సందర్భంగా మనసురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఎవరికి ఇబ్బంది కలగకుండా, చట్టబద్ధంగా అన్ని అనుమతులు తీసుకొని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేస్తాం. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనుకడుగు వేయము. ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ, చట్టపరమైన మార్గంలోనే ముందుకు సాగుతాము అని స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం హఠాత్తుగా 50 నుండి 100 మంది పోలీస్, జిహెచ్ఎంసి సిబ్బంది భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకుని, నిర్మించిన పిల్లర్‌ను కూల్చివేశారు అని సమాచారం తెలిసిన వెంటనే ఇక్కడకు చేరుకోవడం జరిగిందని అన్నారు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, ఏ కారణంతో పిల్లర్‌ను కూల్చివేశారని ప్రశ్నించగా, జిహెచ్ఎంసి నుండి వచ్చిన సమాచారం మేరకు, అనుమతి లేకుండా నిర్మాణం జరిగినందున కూల్చివేశాం. విగ్రహం ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ముందుగా అనుమతి తీసుకోవాలి అని పోలీస్ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని వద్దకి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "దేశాన్ని కాపాడిన మహానుభావుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోవడం చాలా దురదృష్టకరం. 100 మందికి పైగా ఒకే అభిప్రాయంతో ఉన్నప్పుడు, ఒక్కరి ఫిర్యాదు ఆధారంగా ఇలా చేయడం సమంజసం కాదు" అని అన్నారు. కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, జిల్లా అధ్యక్షులు తో కలిసి స్థానిక డీసీపీ, ఏసీపీ, హయత్ నగర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ని కలిసి వినతిపత్రం అందజేశామని వారు తెలిపారు. డీసీపీ మేడం సానుకూలంగా స్పందిస్తూ, "మీరు కలెక్టర్ ని కలిసి చట్టబద్ధంగా తదుపరి చర్యలు కొనసాగించండి" అని సూచించారు. ఎలాంటి అడ్డంకులు వచ్చిన, ఎన్ని కుట్రలు పొందిన, ఎంతో దృఢ సంకల్పంతో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులందరూ కలిసికట్టుగా ఏర్పాటు చేస్తున్న శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎట్టి పరిస్థితులలో అయినా ఏర్పాటు చేసుకుంటామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర నాయకులు కళ్ళెం రవీందర్ రెడ్డి, ఎల్లప్ప, అనుప రెడ్డి, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు యాస శ్యాంసుందర్ రెడ్డి, రమేష్, మాధవరెడ్డి, కడారి యాదగిరి, రవీందర్ రెడ్డి, కాలనీ వాసులు, శివాజీ మహారాజ్ అభిమానులు, విహెచ్ పి, ఆర్ ఎస్ ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** నారాయణపేట మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల్ గురుకుల పాఠశాల/ కళాశాలలో నారాయణ పేట మున్సిపాల్టీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమును తెరచి బ్యాలెట్ బాక్స్ లను నిర్దేశిత కౌంటింగ్ హాల్ లకు తరలించారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు , అసిస్టెంట్లు తమకు కేటాయించిన వార్డుల వారీగా ఆయా వార్డులకు పోటీ చేయు అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కించారు. అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్స్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కలెక్టర్, తోపాటు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ కౌంటింగ్ హాల్ లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను పరిశీలించారు. ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్ల వారీగా వచ్చిన బ్యాలెట్ పేపర్లను మొదట 25 చొప్పున కట్టలు కట్టి ఉంచారు. అనంతరం ఆయా అభ్యర్థుల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, పటిష్ట పోలీసు బందోబస్తు నియమించినట్లు తెలిపారు.

# గద్వాల కోటలో హోరా హోరీ..

● కింగ్ మేకర్లుగా మారిన స్వతంత్రులు

**గద్వాల టౌన్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రమైన గద్వాల మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి. మొత్తం 37 వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య జరిగిన త్రిముఖ పోరులో ఓటర్లు ఎవరికీ పూర్తి అధికారాన్ని కట్టబెట్టకపోవడంతో, ఇప్పుడు మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.గద్వాల మున్సిపాలిటీలో మొత్తం 37 వార్డులు మేజిక్ ఫిగర్ 19 కానీ ఏ పార్టీ కూడా ఆ సంఖ్యను చేరుకోలేకపోయింది.అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ పార్టీ 15 స్థానాలు అవతరించినప్పటికీ మ్యాజిక్ ఫిగర్‌కు మరో 4 స్థానాల దూరంలో నిలిచిపోయింది. బీఆర్ఎస్ పార్టీ 12 స్థానాలు




బలమైన పోటీని ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ 6 వార్డులను గెలుచుకుని నిర్ణయాత్మక శక్తిగా అవతరించింది. స్వతంత్రులు 3 వార్డుల్లో ఇండిపెండెంట్లు గెలిచి ఇప్పుడు కింగ్ మేకర్లుగా మారారు.ఎంఐఎం 1 స్థానం15వ వార్డులో ఎంఐఎం అభ్యర్థి విజయం సాధించారు.కింగ్ మేకర్ల చేతుల్లో చైర్మన్ పీఠం.ప్రస్తుత సమీకరణాల ప్రకారం కాంగ్రెస్ పార్టీకి చైర్మన్ పీఠం దక్కాలంటే కనీసం మరో నలుగురి మద్దతు అవసరం.గెలిచిన ముగ్గురు స్వతంత్రులు మరియు ఒక్క ఎంఐఎం అభ్యర్థి మద్దతు ఇస్తేనే కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడక అవుతుంది.మరోవైపు బీఆర్ఎస్ మరియు బీజేపీలు కలిసి స్వతంత్రులను తమ వైపు తిప్పుకుంటే రాజకీయ సమీకరణాలు ఊహించని మలుపు తిరిగే అవకాశం ఉంది దీంతో గద్వాల మున్సిపల్ పీఠంపై జెండా ఎగురవేసేందుకు తెరవెనుక క్యాంప్ రాజకీయం బేరసారాలు మొదలైనట్లు తెలుస్తోంది.ఓటరు నాడిని పట్టుకోవడంలో హేమాహేమీలు సైతం తడబడ్డారు.గద్వాల మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో స్వతంత్రులు ఎటువైపు మొగ్గు చూపుతారో వేచి చూడాల్సిందే.జిల్లా రాజకీయాల్లో ఈ 'హంగ్' ఫలితం ఒక సంచలనంగా మారింది.

## ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



**రాజాపూర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడా గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు ఇండ్ల తాళాలు అందజేసి, ప్రభుత్వం పేద ప్రజల గృహ స్వప్నాన్ని సాకారం చేయడంలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అర్హుడైన నిరుపేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు సురక్షితమైన నివాస సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు , ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**వీపనగండ్ల, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్తులే ఉపాధ్యాయులుగ వ్యవహరించారు.మండల విద్యాధికారి నరసింహ ఈ సంధర్భంగా స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం వలన విద్యార్థులలో ఆత్మ సైన్యం పెరుగుతుందని భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలు సాధించడానికి ఉపయోగపడతాయని అన్నారు.ఎం ఈఓ .భింధు, ప్రధానోపాధ్యాయురాలుగా డి.ధీప్తి,16 మంది విద్యార్థిలు ఛాత్రోపాధ్యాయులుగా కొనసాగారు.న్యాయ నిర్ణీతలుగా సిఆర్పి నాగరాజు,వరలక్ష్మి ఉపాద్యాయులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల నిరంజన్,ఎం.ఇ.ఓ.నర్సింహా, జడ్.పి.హెచ్. స్ బొల్లారం ప్రధాన ఉపాధ్యాయుడు రఘు, పాఠశాల ఉపాధ్యాయులు రాధిక,వనిత, రామస్వామి,తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే పిలుపు

**రాజాపూర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** సద్గురు సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల పురస్కరించుకొని రాజాపూర్ మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులతో పరిచయం ఏర్పరచుకుని, టోర్నమెంట్‌ను ప్రారంభించారు. యువత క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని, సేవాలాల్ మహారాజ్ బోధించిన సేవాభావం, ఐక్యత, సమానత్వ సూత్రాలను యువత ఆచరణలో పెట్టాలని ఆయన సూచించారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో స్ఫూర్తి నింపుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ,



నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాజాపూర్ సర్పంచ్ రామకృష్ణ, జబర్దస్త్ ఫేం కిరాక్ ఆర్ పి, ప్రభాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నర్సింహులు, శ్రీశైలం యాదవ్, రమేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, సతీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలి



**వెల్దండ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** బంజారా మహారాజ్ జయంతి వేడుకలను చెదురుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొల్లి గుట్ట తండా లో గల సేవాలాల్ మహారాజ్ దేవాలయ ప్రాంగణంలో ఈనెల 15న నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సేవాలాల్ కమిటీ సభ్యులు, సర్పంచ్ దస్సింగ్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ జయంతి ఉత్సవాలకు రాజకీయ ప్రముఖులు, వివిధ వివిధ తండాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారని, వేడుకల ప్రాంగణంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా వంటి అంశాలు కల్పిస్తున్నామని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే.. భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల హవా..




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలుపడ్డాయి. జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, ఆందోల్ -జోగిపేట్, కోహిర్ , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోగా, జహీరాబాద్ బిఆర్ఎస్ 15, కాంగ్రెస్14, బిజెపి3, స్వతంత్ర 3, ఎంఐఎం 2 స్థానాలలో విజయం సాధించాయి. దీంతో జహీరాబాద్ మున్సిపాలిటీలో హంగు ఏర్పడింది. స్వతంత్ర అభ్యర్థులు, బిజెపి నుండి గెలిచిన అభ్యర్థులపై చైర్మన్ పదవి ఆధారపడి ఉంది. ఇది ఇలా ఉండగా కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం, గుమ్మడిదల, గడ్డి పోతారం బిఆర్ఎస్ అభ్యర్థులు మెజార్టీ స్థానాలు సాధించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో నాయకుల మధ్య అభ్యర్థుల మధ్య సమన్వయం లేకపోవడంతో కొన్ని వార్డులలో రెబల్ అభ్యర్థులు పోటీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే వారి మధ్య సయోధ్య కుదుర్చకపోవడంతో రెబల్ అభ్యర్థులు ఓడిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్నారు.

## ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం..




**రేవల్లి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** గొల్లపల్లి చీర్కపల్లి జర్వాయర్ వ్యతిరేక ఉద్యమం 46వ రోజు పూర్తి చేసుకున్నది కానీ పాలక పక్షం నిమ్మకు నీరు ఎత్తినట్ల వ్యవహరిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో రిజర్వాయర్ ను విరమించుకునేత వరకు అన్ని పక్షాలను కలుపుకొని రానున్న రోజుల్లో దశల వారీగా చలో కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు, నిరవదిక నిరాహార దీక్షలు ఉద్యమానికి శ్రీకారం చుడతామని అఖిల పక్ష నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు దోడ్ల రాములు, సునీల్ కుమార్, రమేష్ యాదవ్, నాయకులు అబ్దుల్ మహమూద్, బంకల జాన్, బంగారయ్య, సుబ్బారెడ్డి, నరెందర్ రెడ్డి, యం కృష్ణయ్య, పొడెండ్ల కురుమయ్య, చిన్నయ్య, బంకల స్వామి, ఎల్లస్వామి అలివేల, చంద్రకళ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా తీర్పు మా ప్రభుత్వ పాలనకు నిదర్శనం

● మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయకేతనం



**మక్తల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని, ఈ ఫలితాలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మఖ్తల్ నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ఎన్నికలైనా విజయం కాంగ్రెస్‌దేనని మరోసారి రుజువైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి ప్రజలు మాకు పట్టం కట్టారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. ఇక్కడ మొత్తం 16 స్థానాలకు గాను 12 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుందని చెప్పారు. ఇది పార్టీ శ్రేణుల సమిష్టి కృషితోనే సాధ్యమైందని కొనియాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారమైన విమర్శలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, వారి తీర్పుతో ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఫలితాల ఊపు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని, అక్కడ కూడా ప్రజలు ఇదే తరహా తీర్పును ఇవ్వబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.

## కట్టుదిట్టంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో కట్టుదిట్టంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఓట్ల లెక్కింపును నిర్వహించారు. ఆలియాబాదు మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్ల లెక్కింపును మజీద్పూర్‌లోని శ్రీ చైతన్య హై స్కూల్‌లో, మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్ల లెక్కింపును జగ్గం గూడాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో, ఎల్లంపేట్ మున్సిపాలిటీకి సంబంధించిన ఓట్ల లెక్కింపును బైబిల్ కాలేజీలో నిర్వహించారు. జనరల్ పరిశీలకులు నిర్మల కాంతి వెస్లీతో కలిసి జిల్లా కలెక్టర్ కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచి బ్యాలెట్ బాక్సులను నిర్దేశిత కౌంటింగ్ హాళ్లకు తరలించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు తమకు కేటాయించిన వార్డుల వారీగా అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు.



అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం లెక్కింపు ప్రక్రియను సీసీ కెమెరాల పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఫలితాల ప్రకారం ఆలియాబాదు మున్సిపాలిటీలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 7, బీజేపీ 3, బీఎస్పీ 1, స్వతంత్ర అభ్యర్థి 1 గెలుపొందారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ 9, బీఆర్ఎస్ 14, బీజేపీ 1 అభ్యర్థులు విజయం సాధించారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 12, బీజేపీ 4 అభ్యర్థులు గెలుపొందారు. ఎన్నికైన అభ్యర్థులకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**వెల్దండ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చూడ ముచ్చటగా ముస్తాబై తోటి విద్యార్థులకు చక్కటి విద్యా బోధన చేశారు. డీఈవోగా వినయ్, హెచ్ఎంగా అవంతిక, ఎంఈవోగా సాయికుమార్లతో 14 పాటు 25 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఆనంతరం సాయంత్రం హెచ్ఎం ప్రేమలత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రేమలత, ఉపాధ్యాయులు రామారావు, చెన్నకేశవులు, విజయ్‌కుమార్, జాంగీర్, సరిత, ప్రభావతి, థార్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక గుర్తింపు

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో శుక్రవారం నాడు కళాశాల వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి జి.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి 100% ఫలితాలు సాధించాలని అన్నారు. ఈనెల 25 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను ప్రతిష్టంగా గుర్తిస్తుందని వచ్చే సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు వస్త్రాలతో కూడిన కిట్టు ఇచ్చే యోచనాల్లో ఉన్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనం పరిశీలనలో ఉందన్నారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ, ఈకళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి చేరుటకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు కావాలని అన్నారు.ఉపాధి దిశగా విద్యనుఅభ్యసించాలన్నారు. విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం పరీక్షలలో అధికమార్కుల తెచ్చుకున్న విద్యార్థులకు పథకాలు అందజేశారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ఈ.రవిప్రకాష్, హరిత, మహమ్మద్ యునూస్, మంజుల, రాజేశ్వర్, సత్యం, శిరీష, నరేందర్ గౌడ్, నాగరాజు, రాజశేఖర్, రాజేశ్వర్, హిఫ్సా, రాజయ్య, తుకారాం, సిద్ధికి, కిరణ్, కృష్ణయ్య, మంజుల, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## మెదక్‌లో హంగ్

● రామయంపేట కాంగ్రెస్, తూప్రాన్ బిఆర్ఎస్

● మెదక్, నర్సాపూర్లో బిజెపి పార్టీ కీలకం

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో తూప్రాన్ మున్సిపాలిటీని బి ఆర్ ఎస్ పార్టీ కైవసం చేసుకోగా, రామయంపేట మున్సిపాలిటీ ని కాంగ్రెస్ గెలుచుకుంది. మెదక్, నర్సాపూర్లో హంగ్ ఫలితాలు వెలుపడ్డాయి. 32 వార్డులు ఉన్న మెదక్లో బిఆర్ఎస్ పార్టీ 15 వార్డులు, కాంగ్రెస్ 14 వార్డులు( ఒక వార్డు ఏకగ్రీవంతో కలిపి ), బిజెపి రెండు వార్డులు, బీఎస్పీ ఒక వార్డు గెలుచుకుంది. బీఎస్పీ వార్డు కౌన్సిలర్ మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 15 వార్డులున్న నర్సాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఆరు వార్డులు, బి ఆర్ఎస్ ఐదు వార్డులు, నాలుగు వార్డులు గెలుచుకున్నాయి. 16 వార్డులున్న తూప్రాన్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాలుగు వార్డులు, బి ఆర్ఎస్ 9 వార్డులు, బిజెపి మూడు వార్డులు గెలుచుకున్నాయి. దీంతో తూప్రాన్ మున్సిపాలిటీ లో బి ఆర్ఎస్కు స్పష్టమైన మెజార్టీ లభించింది. 12 వార్డులున్న రామయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ 8 వార్డులు, బి ఆర్ఎస్ మూడు వార్డులు, బిజెపి ఒక వార్డు గెలుచుకున్నాయి. దీంతో రామయంపేట మున్సిపాలిటీ హస్తగతమైంది.

# కాంగ్రెస్ చేతికి పరకాల మునిసిపాలిటీ



**పరకాల, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. శుక్రవారం రోజున వెలువడిన ఫలితాల్లో 22వ వార్డులకు గాను 13 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయాన్ని సాధించారు. బిఆర్ఎస్ పార్టీ 6, బిజెపి మూడు స్థానాల్లో విజయం సాధించాయి. తీవ్ర ఉత్కంఠ పరిస్థితుల నేపథ్యంలో పార్టీల అంచనాలను తలకిందులు చేస్తూ పరకాల పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పోరండ్ల మౌనిక, ఏకు దివ్య, పావుశెట్టి సునీల్ కుమార్, నల్లెల కుమార్, పసుల లావణ్య, గూడెల్లి సదన్ కుమార్, మాధవి లత, బండి శ్రీధర్, బొచ్చు సుభద్ర, కొయ్యడ శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, సూదమల్ల రమేష్, అల్లే దశరథం విజయం సాధించారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు దుబాసి వెంకటస్వామి, బొచ్చు శ్యామల, గొడుగు రజిత తుమ్మల రాణి, పడిదల దీప్తి, రేగూరి కరుణ విజయం సాధించారు. బెజ్జంకి పూర్ణ చారి, ఆకుల లావణ్య, కుక్కల విజయ్ కుమార్ బిజెపి పార్టీ నుంచి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఆధిక్యం ప్రదర్శించిన కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోనుంది. మున్సిపల్ చైర్మన్ గా పావుశెట్టి సునీల్ కుమార్ ఎంపికయ్యే అవకాశం ఉంది.

# మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల విలక్షణ తీర్పు

- మున్సిపల్ పీఠం దక్కాలంటే స్వతంత్ర అభ్యర్థులే కీలకం




**బెల్లంపల్లి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** బెల్లంపల్లిలో జరిగిన సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో బెల్లంపల్లి పట్టణ ప్రజలు విలక్షణ విలక్షణ తీర్పు ఇచ్చారు. బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డులలో కాంగ్రెస్ పార్టీకి 14 వార్డులు, బిఆర్ఎస్ పార్టీకి 14 వార్డులు, బిజెపి పార్టీకి ఒక వార్డు, స్వతంత్ర అభ్యర్థులకు 5 వార్డుల్లో విజయం లభించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి 7వ వార్డు దావ స్వాతి, 10వ వార్డు డికొండ పద్మ, 11వ వార్డు గాలి సుమలత, 15వ వార్డు చింతల వసంత, 17వ రాగంశెట్టి సతీష్, 23వ వార్డు జంగం కల్పన, 24వ వార్డు దామెర విజయ లలిత, 25వ వార్డు కంకటి ప్రణీత, 26వ వార్డు ఇప్ప కుమారస్వామి, 27వ వార్డు బేతి శ్రావణ్ కుమార్, 28వ వార్డు చిప్ప అర్చన, 29వ వార్డు మేడి పున్నం చంద్, 32వ వార్డు నీలి హారిక గెలుపొందారు. బిఆర్ఎస్ నుంచి 1వ వార్డు కొయ్యడ ప్రసన్న, 3వ వార్డు లక్కాకుల సౌజన్య, 4వ వార్డు ఏట కమల, 5వ వార్డు గోగర్ల స్వప్న, 6వ వార్డు సల్ల కృష్ణవేణి, 9వ వార్డు కాంపెల్లి రాజం, 12వ వార్డు తిరుమల వాసు ధరావత్, 13వ వార్డు దొంగల రాజకుమార్, 14వ వార్డు అసాది మధు, 18వ వార్డు బత్తుల అనిత, 19వ వార్డు ఎస్ కె సిమ్రాన్, 20వ వార్డు తాండ్ర స్రవంతి, 21వ వార్డు రాజనాల రమేష్, 31వ వార్డు బండారి స్రవంతి గెలుపొందారు. బిజెపి పార్టీ నుంచి 34 వార్డులో కొక్కుల రామ్మూర్తి గెలుపొందగా, 2వ వార్డు నుంచి నిచ్చకోల వంశీకృష్ణ, 16వ వార్డు నుంచి మత్తమారి రాయమల్లు, 22వ వార్డు నుంచి పీక ఎల్లబాయి, 30వ వార్డు నుంచి సుకేషిని భరద్వాజ్, 33వ వార్డు నుంచి పోలు ఉమాదేవి స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులలో కాంగ్రెస్ 14, టిఆర్ఎస్ 14, బిజెపి 1, స్వతంత్ర అభ్యర్థులు 5 గెలుపొందడంతో ఏపార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. బెల్లంపల్లి బల్దియా చైర్మన్ పీఠం కోసం స్వతంత్ర అభ్యర్థులే కీలకంగా మారారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డ వారే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులుగా నిలిచి స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు.

# ఎట్టకేలకు కాంగ్రెస్‌కే మున్సిపల్ పీఠం



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** స్థానికంగా బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ తీవ్ర రాజకీయ పోటీ నడుమ జరిగిన నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గట్టి విజయాన్ని నమోదు చేసింది. హోరాహోరీగా సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యంతో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రభావం దృష్ట్యా ఈ ఎన్నికల్లో బీజేపీకి అనుకూల ఫలితాలు వస్తాయని రాజకీయ విశ్లేషకులు ముందస్తు అంచనాలు వేశారు. అయితే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముందుకు సాగేకొద్దీ కాంగ్రెస్ అభ్యర్థులు అనేక వార్డుల్లో స్థిరమైన ఆధిక్యాన్ని కొనసాగించడం ఆసక్తిని రేకెత్తించింది. కొన్ని వార్డుల్లో స్వల్ప మెజారిటీలతో గెలుపొందగా, మరికొన్ని చోట్ల స్పష్టమైన తేడాతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల ప్రచార దశలో ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు, పట్టణ ప్రణాళిక వంటి అంశాలపై ప్రధానంగా చర్చ నడిచింది. స్థానిక సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి ఉందని కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో ప్రస్తావించగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మద్దతుతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని బీజేపీ శ్రేణులు హామీ ఇచ్చాయి. ఫలితాలు వెల్లడైన వెంటనే కాంగ్రెస్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. కార్యకర్తలు మిఠాయిలు పంచుతూ, డప్పులు కొడుతూ విజయోత్సాహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన వీధులలో విజయ ర్యాలీలు నిర్వహించారు. "ఇది ప్రజల తీర్పు... స్థానిక సమస్యలపై మా పోరాటానికి ప్రజలు మద్దతు ఇచ్చారు" అని విజేత అభ్యర్థులు పేర్కొన్నారు. విజేతలలో ఒకరు మాట్లాడుతూ, "పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, శానిటేషన్ వంటి సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుంటాం. పారదర్శక పాలన అందిస్తాం. ప్రతి వార్డుకు సమాన అభివృద్ధి చేస్తాం" అని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా, బీజేపీ నాయకులు ఫలితాలను గౌరవిస్తున్నామని, తాము ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. "ఈ ఫలితాలను సమీక్షించుకుని భవిష్యత్ వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటాం" అని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అసెంబ్లీ స్థాయిలో ఒక పార్టీ బలంగా ఉన్నా, మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక అంశాలు, వ్యక్తిగత పరిచయాలు, వార్డు స్థాయి సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. నిర్మల్ ఫలితం కూడా అదే దిశగా సంకేతాలు ఇస్తోందని వారు పేర్కొంటున్నారు. మొత్తానికి, స్థానికంగా బీజేపీ ఎమ్మెల్యే ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడం పట్టణ రాజకీయ సమీకరణాల్లో కీలక మలుపుగా భావించబడుతోంది. రాబోయే రోజుల్లో మున్సిపల్ పాలన ఎలా ఉంటుందన్నది పట్టణ ప్రజల్లో ఆసక్తికరంగా మారింది.

# న్యాయం గెలిచింది.. కూటమి నిలబడింది



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి13 (జనంసాక్షి):** 11వ తేదీన క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో న్యాయం గెలిచి బిఆర్ఎస్ -సిపిఐ కూటమి విజయకేతనం ఎగరవేసి పుర పోరులో నిలబడిందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల బిఆర్ఎస్ అధ్యక్షులు బాల్క సుమన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. స్థానిక సింగరేణి క్లబ్ లో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కూటమి 14 స్థానాల్లో గెలుపొందడంతో నాయకులు సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజల బతుకులు ఆగమయ్యాయని చెప్పడానికి ఈ ఎన్నికలు ఒక నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వివేక్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమిగా 14 స్థానాల్లో గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయం, నిబద్ధత అనేది ఎప్పటికీ నిలుస్తుందనేది ఈ ఎన్నికలే ఉదాహరణగా చెప్పుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గెలుపొందిన అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో హస్తం హవా

- బీఆర్ఎస్ కోటకు బీటలు
- కాంగ్రెస్ కూటమికి తిరుగులేని తీర్పు
- 30 వార్డులకు 18 స్థానాలు కైవసం
- మున్సిపల్ చైర్మన్ పీఠం హస్తగతం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి రాజకీయాల్లో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠను రేపాయి. ఒక్కొక్కటిగా నువ్వా నేనా అన్నట్లుగా వెలువడిన ఫలితాలతో అభ్యర్థుల గుండెల్లో గుబులు రేపాయి.. మొదటి, రెండు రౌండ్లలో ఎంతో ఉత్కంఠగా ఫలితాలు వెలువడ్డాయి. చివరి రౌండ్ ఫలితాల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తంగా భూపాలపల్లి మున్సిపాలిటీలో 30 వార్డులకు గాను కాంగ్రెస్ కూటమి 18 స్థానాలను కైవసం చేసుకుని హవా కొనసాగించింది. 10 స్థానాలతో బీఆర్ఎస్, 2స్థానాలతో బీజేపీలు సరిపెట్టుకున్నాయి. గతంలో స్థానిక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కు పట్టు ఉండేది. చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుని ఎదురులేని శక్తిగా బీఆర్ఎస్ ఎదిగి, కంచుకోటగా మార్చుకుంది. కానీ ఈ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కోటకు బీటలు బారాయి. అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించి మెజారిటీ స్థానాలను తమ ఖాతాలో వేసుకుని ప్రతి పక్షాలకు సవాల్ విసిరింది. మున్సిపల్ ఫలితాల్లో కాంగ్రెస్ విజయం దుందుభి మోగించడంతో ఆ పార్టీ శ్రేణులు అంబేద్కర్ సెంటర్ లో బాణా సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

### వార్ వన్ సైడే..

30 వార్డులకు సంబంధించిన ఫలితాలు ఎన్నికల అధికారులు ప్రకటించగా, ఈ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించింది. మొత్తం 30 వార్డుల్లో 18 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం విశేషం. మిగిలిన వార్డుల్లో బీఆర్ఎస్, బీజేపీ ఆయా స్థానాలను దక్కించుకున్నారు. ఈ ఫలితాలు జిల్లా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసేలా కనిపించాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల అభిప్రాయం ఏ దిశగా ఉందో ఈ ఫలితాలు స్పష్టంగా తెలియజేశాయి. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 18 వార్డులను గెలుచుకుని ముందంజలో నిలిచింది. పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటర్లు మద్దతు ఇచ్చినట్లు కాంగ్రెస్ అభ్యర్థులు భావిస్తున్నారు. ఈ విజయంతో కాంగ్రెస్ నాయకత్వానికి మరింత బలం చేకూరింది. జిల్లా స్థాయిలో పార్టీకి ఇదొక సానుకూల సంకేతంగా మారింది. భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలకు ఈ ఫలితాలు దారితీయనున్నాయని కాంగ్రెస్ అభ్యర్థులు చెబుతున్నారు.

### రెండో స్థానంలో బీఆర్ఎస్..

ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ 10 వార్డులను కైవసం చేసుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలినప్పటికీ.. పట్టణాల్లో తమ ఓటు బ్యాంక్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేసి విఫలమైనట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలు స్థానిక అభివృద్ధి అంశాలపై ప్రచారం చేసినప్పటికీ.. కొన్ని వార్డుల్లో తీవ్ర పోటీ ఎదురైంది. అయినప్పటికీ 10 వార్డుల్లో విజయం సాధించడం ఆ పార్టీకి కొంత ఊరటనిచ్చింది.

### రెండు వార్డుల్లో బీజేపీ గెలుపు..

ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 2 వార్డులను గెలుచుకుంది. పట్టణాల్లో తమ ప్రభావాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి ఇది చిన్న స్థాయి విజయం అయినప్పటికీ.. భవిష్యత్తు విస్తరణకు ఇది పునాది అని కమలం పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

### స్వతంత్ర అభ్యర్థి సంచలన గెలుపు..

ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించడం సంచలనాత్మకంగా మారింది. స్థానికంగా బలమైన నాయకత్వం, వ్యక్తిగత ప్రజాభిమానంతో వారు గెలిచినట్లు తెలుస్తోంది. ఇది ప్రధాన పార్టీలకు ఒక హెచ్చరికగా ఉన్నా, కాంగ్రెస్ పార్టీలో బీ ఫామ్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి పోటీలో ఉన్న ప్రధాన పార్టీలను మట్టి కరిపించడం విశేషం. ఇదిలా ఉండగా కాంగ్రెస్ కూటమిలో భాగస్వామ్యంగా సీపీఐ, సీపీఎం లు ఐదు స్థానాల్లో పోటీ చేయగా, కేవలం ఒక స్థానంలో మాత్రమే గెలుపొందారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియ పరిశీలన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి పురపాలక ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానం ఫంక్షన్ హాలులో పురపాలక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగింది. కాగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పరిశీలించారు. మొత్తం 10 టేబుల్స్ వద్ద నిర్వహించిన ఓట్ల లెక్కింపును టేబుల్ వారీగా సమీక్షించి, సిబ్బందికి ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపుకు సంబంధించి 10 మంది ఆర్ఓలు, 12 మంది టేబుల్ సూపర్‌వైజర్లు, 20 మంది అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది 40 మందిని నియమించినట్లు తెలిపారు. మొత్తం లెక్కింపు ప్రక్రియను 3 రౌండ్లుగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అధికారుల సమన్వయంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఎన్నికల అధికారి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.



## నెక్కొండలో దొంగల హల్‌చల్

**నెక్కొండ, ఫిబ్రవరి 13 (జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలోని మొహమ్మద్ రహీం 11న రాత్రి అతని భార్య కలిసి బంధువుల ఇంటికి పెండ్లికి వెళ్లాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో నుంచి ఐదు తులాల బంగారం విలువ 2,55,000, 18 తులాల వెండి , విలువ 20,000, నగదు 3, 41,000, మొత్తం 6,16,000 రూపాయలు దొంగతనం చేసినట్లు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము, నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు.

## మహాశివరాత్రి కుర్తా జాతర ప్రారంభం

**కౌటాల ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మండలంలోని తాటిపల్లి గ్రామ శివారులోని వరద నది ఒడ్డున ఉన్న కుర్తా శ్రీ శివ సిద్ది హనుమాన్ ఆలయం లో 5రోజుల పాటు సాగే మహాశివరాత్రి జాతర మహోత్సవం ను శుక్రవారం ప్రారంబించారు.గ్రామ సర్పంచ్ బడగే సంతోష్, ఉప సర్పంచ్ డోశీగ్రే కేశవ్ రావ్ ,ఎల్ములే దత్తు పటేల్ హిందూవాహిని కొమరం భీం జిల్లా సహాప్రముఖ్ చేతుల మీదుగా ప్రతేక పూజలు చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేశారు. కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ రావుత్ రాందాష్, హన్మంతు, గోండే నితీష్, వార్డ్ మెంబెర్స్ అరవింద్, రాజేందర్, ఇప్ప సుధాకర్, ఆలయ పూజారి, మరియు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ములుగు మున్సిపాలిటీ పీఠం కాంగ్రెస్‌దే

- మంత్రి సీతక్క అభినందనలు



**ములుగు బ్యూరో,ఫిబ్రవరి13(జనం సాక్షి):** ములుగు మున్సిపాలిటీ ఎన్నికలు జరగగా శుక్రవారం ఎన్నికల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు 12 మంది గెలవడం చాలా సంతోషంగా ఉందని ములుగు మున్సిపాలిటీలో మొట్ట మొదటి పీఠం కాంగ్రెస్ పార్టీ దక్కించుకునేలా చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులందరికీ మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్డులవారీగా గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు 1వ వార్డు అలోత్ పద్మ దేవ్, 3వ వార్డు యాసం వసంత రవికుమార్, 4వ వార్డు గుంటోజు పావని నిరంజన్ చారి, 5వ వార్డు గుగ్గిళ్ళ దివ్య సుజన్, 6వ వార్డు చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, 8వ వార్డు నల్లెల్ల స్వాతి భరత్ కుమార్,10వ వార్డు గజ్జెల సుస్మిత, 11వ వార్డు కేశెట్టి నవీన్, 13వ వార్డు సిలువేరు సాంబయ్య, 14వ వార్డు ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా,16వ వార్డు ఎండీ కుతుబుద్దీన్, 19వ వార్డు పొడల ఓంప్రకాష్ లకు మంత్రి సీతక్క కండువా కప్పి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కష్ట ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులకు,యూత్ నాయకులకు, ఇంచార్జీలకు,మండలాల అధ్యక్షులకు,మహిళా నాయకులకు సీనియర్ నాయకులకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, జిల్లా నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల కౌంటింగ్

- కొత్త మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు...
- కట్టుదిట్టంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు బ్యూరో,ఫిబ్రవరి13(జనం సాక్షి):** ములుగు కొత్త మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బిదివాకర టి.ఎస్. తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రి కళాశాల లో ములుగు కొత్త మున్సిపాల్టీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పరిశీలించారు.రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమును తెరచి బ్యాలెట్ బాక్సను నిర్దేశిత కౌంటింగ్ హాల్కు తరలించారు.కౌంటింగ్ సూపర్వైజర్లు,అసిస్టెంట్లు తమకు కేటాయించిన వార్డుల వారీగా ఆయా వార్డులకు పోటీ చేయు అభ్యర్థుల, ఏజెంట్ల సమక్షంలో మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కించారు.అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్స్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కలెక్టర్, తోపాటు ఎన్నికల జనరల్ పరిశీలకులు గంగాధర్,అదనపు కలెక్టర్ లు మహేందర్ జి, సంపత్ రావు హాల్ ను పలుమార్లు తిరుగుతూ కౌంటింగ్ ను పరిశీలించారు.ప్రతి వార్డులో పోలింగ్ స్టేషన్ల వారీగా వచ్చిన బ్యాలెట్ పేపర్లను మొదట 25 చొప్పున కట్టలు కట్టి ఉంచారు. అనంతరం ఆయా అభ్యర్థుల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, పటిష్ట పోలీసు బందోబస్తు నియమించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మొత్తం మూడు రౌండ్ లలో 20 వార్డుల ఫలితాలను అధికారులు వెల్లడించారు.

### ములుగు మున్సిపాలిటీ విజేతల వివరాలు....

1వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏ.పద్మ 270 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.2వ వార్డు లో బి ఆర్ ఎస్ అభ్యర్థి కె లక్ష్మి 67 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.3వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓ.వసంత 212 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.4వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి.పావని 67 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.5వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి.దివ్య 99 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. 6వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సి హెచ్ చంద్రకళ 8 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.7వ వార్డులో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి బి.సునీత 62 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.8వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.స్వాతి 64 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.9వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి వాణి 40 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.10వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి. సుస్మిత 211 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.నవీన్ 129 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.12వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి పోరిక రాజు 21 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.13వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సి హెచ్ సాంబయ్య 70 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షాహిన్ మీర్జా 161 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.15వ వార్డు లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి రేసోజు పద్మ 140 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. 16వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ కుతుబుద్దీన్ 25 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.17వ వార్డు లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి భారత్ కుమార్ గోనెల 23 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.18వ వార్డు లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి బైకని అనూష 97 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొడల ఓం ప్రకాష్ 4 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.20వ వార్డులో బి జె పి పార్టీ అభ్యర్థి కొత్త సురేందర్ 38 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ,ఆర్ డి ఓ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీ కైవసం చేసుకున్న కాంగ్రెస్



**కల్లూరు, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి చైర్మన్ దక్కించుకుంది. మున్సిపాలిటీ ఎన్నికల ప్రారంభ నుండి కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీ లు నువ్వా నేనా అనే రీతిలో పోటా పోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎవరికి వాళ్లు మేమే గెలుస్తామని ప్రచారం చేసుకున్నారు. ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలు ఈ గెలుపుకు దోహదంపడ్డాయి. కాంగ్రెస్ పార్టీ 12 వార్డులు, టిఆర్ఎస్ పార్టీ 7 వార్డులు, కాంగ్రెస్ రెబల్ ఇండిపెండెంట్ అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. గెలుపొందిన అభ్యర్థుల వివరాలుఒకటో వార్డు జీల్లెల స్వాతి, కాంగ్రెస్ అభ్యర్థి సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కర్నాటి నాగమణి పై 92 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రెండో వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి ఎక్కిరాల ప్రసన్నకుమార్ పై కాంగ్రెస్ అభ్యర్థి బీరవెల్లి మాధవ్ 149 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మూడో వార్డు దాసరి చంద్రశేఖర్ టిఆర్ఎస్ అభ్యర్థి పై దాసరి సుధారాణి కాంగ్రెస్ అభ్యర్థి 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నాలుగో వార్డ్ ఇండిపెండెంట్ అభ్యర్థి మాచర్ల నాగరాజు పై కాంగ్రెస్ అభ్యర్థి భానోత్ రాంబాయి 115 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఐదవ వార్డ్ లో టిఆర్ఎస్ అభ్యర్థి అజ్మీర చింతామణి పై కాంగ్రెస్ అభ్యర్థి శి లం కోటేశ్వరి 232 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆరో వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మమత పై కాంగ్రెస్ అభ్యర్థి మారోని 246 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఏడవ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి బానోత్ కృష్ణ పై కాంగ్రెస్ అభ్యర్థి ధరావత్ మోహన్ 4 ఓట్ల తో గెలుపొందారు. ఎనిమిదో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి లక్కినేని సతీష్ పై బిఆర్ఎస్ అభ్యర్థి లక్కినేని రఘు96 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 9వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కళ్యాణపు కృష్ణకుమారి పై టిఆర్ఎస్ అభ్యర్థి కళ్యాణపు నవ్య 41 ఓట్ల మెజార్టీతో గెలుపొందరు 10వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి పెద్దబోయిన మల్లేశ్వరరావు పై కాంగ్రెస్ అభ్యర్థి పెద్ద బోయిన లక్ష్మీనరసింహారావు 42 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 11 వార్డులో బి ఆర్ఎస్ అభ్యర్థి వికృతీ మాధవి పై కాంగ్రెస్ అభ్యర్థి కృష్ణ శెట్టి లక్ష్మి 56 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ పై టిఆర్ఎస్ అభ్యర్థి ఎండి ఇస్మాయిల్ 99 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కుసునూరి లక్ష్మి పై టిఆర్ఎస్ అభ్యర్థి దార్ల చిన్న లక్ష్మి 52 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 14 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గా జై పునిష బేగం పై టిఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ రేష్మ 181 మెజార్టీతో గెలుపొందారు. 15వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి ఆష్మ పై యాస నాగమణి 76 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 16వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి దామాల్ రాజు పై ఇండిపెండెంట్ అభ్యర్థి ఉబ్బన రాంబాబు 62 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 17వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వేము విజయలక్ష్మి పై టిఆర్ఎస్ అభ్యర్థి కనపర్తి శ్యామల 24 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 18 వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి దోసపాటి శ్రీనివాస్ రావు పై పెడకంటి కృష్ణయ్య (రామకృష్ణ) 74 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 19వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి ఖమ్మంపాటి స్వరూప పై ఖమ్మంపాటి రాధా 117 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 20వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి ఎనుముల శివ పై కాంగ్రెస్ అభ్యర్థి గుండ్ల పుల్లారావు 32 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.

## భీమవరం అడవి ప్రాంతంలో పులి అడుగుజాడలు గుర్తింపు



**పినపాక, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** పినపాక మండలం టి.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భీమవరం అడవి ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్టు ఆనవాళ్లు లభించాయి. గ్రామానికి సమీపంలోని కణితి ప్రసాద్ పొలం వద్ద పులి అడుగుజాడలను అటవీ అధికారులు గుర్తించారు. అడవికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల వద్ద ఈ అడుగుజాడలు కనిపించడంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పులి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు రాత్రి వేళల్లో అడవి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, పశువులన సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడతామని అటవీ అధికారులు పేర్కొన్నారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆనవాళ్లు గమనించినా వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కోదాడ కోటలో ఎగిరిన హస్తం జెండా..



**కోదాడ, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో కోదాడ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో కైవసం చేసుకుంది. వెలువడిన ఫలితాల ప్రకారం, మొత్తం 35 వార్డులకు గానూ కాంగ్రెస్ 27 స్థానాల్లో విజయం సాధించి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. బీఆర్ఎస్ 3 వార్డులకు పరిమితమైంది, అనూహ్యంగా 18,20,25,29,34 వార్డులలో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులువిజయం సాధించారు. బిజెపి, జనసేన, సిపిఎం పార్టీలుఎక్కడా ఖాతా తెరవలేదు ఈ విజయం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరియు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వానికి నిదర్శనమని పార్టీ శ్రేణులు అభివర్ణించాయి. ఫలితాలు వెలువడగానే కోదాడ పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

### 30వ వార్డు అభ్యర్థి రాష్ట్రంలో భారీ మెజార్టీ

కోదాడ మున్సిపాలిటీ 30 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కారింగుల ఉమా అంజన్ గౌడ్ 1234 ఓట్లతో భారీ మెజార్టీ సాధించి చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ సాధించిన వార్డుగా నమోదయింది, ఎమ్మెస్సీలోఉన్నత విద్యను అభ్యసించిన ఉమా అంజన్ గౌడ్ పోటీ చేసిన మొదటిసారె భారీ మెజార్టీతో విజయం సాధించడం ఒక విశేషమైన మైలురాయి!

## అభివృద్ధే ఆయుధంగా ప్రజల సంక్షేమం

• ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**కోదాడ, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన భారీ విజయం వెనుక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి వ్యూహం స్పష్టంగా కనిపించింది. శుక్రవారం విడుదలైన ఫలితాల ప్రకారం, కోదాడ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కోదాడ మున్సిపాలిటీలోని మొత్తం 35 వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 27 వార్డులను గెలుచుకుని క్లీన్ స్వీప్ దిశగా దూసుకెళ్లింది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 3 వార్డులకే పరిమితం కాగా, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు.బిజెపి, జనసేన వామపక్ష పార్టీలు తమ ప్రభావాన్ని చూపలేకపోయాయి. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఎన్నికల ప్రచారంలో స్వయంగా పాల్గొని, ప్రతి వార్డులో అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఈ ప్రచారంలో భాగస్వాములై, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం వంటివి ప్రజల్లోకి తీసుకెళ్లడం పార్టీ విజయానికి తోడ్పడింది. ఈ విజయం ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వానికి ఓటర్లు ఇచ్చిన బలమైన తీర్పుగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.

# నల్లగొండ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం




**కనగల్లు, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** ఈనెల 11న జరిగిన నల్లగొండ కార్పొరేషన్ తో పాటు మిర్యాలగూడెం, దేవరకొండ, హాలియా, నందికొండ, చిట్యాల, చండూర్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. శు క్రవారం రోజు పోలీస్ ల భద్రత నడుమ అభ్యర్థుల సమక్షంలో ఓట్ల కౌంటింగ్ చేపట్టారు. నల్లగొండ కార్పొరేషన్ తో ఆరు మున్సిపాలిటీలలో అధికార కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించారు. ప్రతిపక్ష బి ఆర్ ఎస్, బిజెపి, ఇతర పార్టీలు నల్లగొండ జిల్లాలో చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి దరిదాపులకు కూడా లేరు. నల్లగొండ మునిసిపాలిటీ స్థాయి నుంచి కార్పొరేషన్ అయిన తర్వాత జరిగిన తొలి ఎన్నికలలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని 48 డివిజన్లో కార్పొరేట్ల ఎంపికలను పారదర్శకతను పాటించి అత్యధిక స్థానాలను గెలిపించుకుని కార్పొరేషన్ ను కైవసం చేసుకున్నారు. నల్లగొండ కార్పొరేషన్ లో కాంగ్రెస్ (27), డివిజన్లు, బి ఆర్ఎస్ ( 9) డివిజన్లు, బిజెపి (4) డివిజన్లు, ఫార్వర్డ్ బ్లాక్ (4) డివిజన్లు, స్వతంత్ర అభ్యర్థులు (2) డివిజన్లు, ఎంఐఎం (2) డివిజన్లు లో అభ్యర్థులు విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలియజేశారు.

### చిట్యాల మునిసిపాలిటీలో కాంగ్రెస్ విజయకేతనం..

చిట్యాల మునిసిపాలిటీలో 12 వార్డులకు గాను 9 కాంగ్రెస్, 1 ట్రాన్స్ జెండర్, రెండు వార్డులు ఇతరులు గెలిచారు. మిర్యాలగూడెం మున్సిపాలిటీలో కాంగ్రెస్ 31, టిఆర్ఎస్ 14, బిజెపి 1, ఫార్వర్డ్ బ్లాక్ 1, ఇండిపెండెంట్ 1 గెల్చుకున్నాయి. హాలియా మున్సిపాలిటీలో కాంగ్రెస్ 11, టిఆర్ఎస్ 1 గెలిచాయి. నందికొండ మునిసిపాలిటీలో కాంగ్రెస్ 11 బి ఆర్ఎస్1 అభ్యర్థులు విజయం సాధించారు. చండూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 5, బి.ఆర్.ఎస్3, సిపిఐ 1 అభ్యర్థులు గెల్పొందారు. దేవరకొండ మునిసిపాలిటీ కూడా కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంది...

## దోమల దాడితో ఆసుపత్రుల బాట..!

• ఎంపీడీవోకు ఫిర్యాదులే గాని చర్యలేమీ లేవు



**మాడుగులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** పూసలపాడు గ్రామంలోని దళిత కాలనీలో మురుగు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఇళ్ల ముందు మురుగు నీరు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది.కాలనీలో దోమలు విపరీతంగా పెరిగి చిన్నారులు, వృద్ధులు తరచూ జ్వరాలతో ఆసుపత్రుల బాట పట్టాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయాల్లో దుర్వాసన, దోమల దాడి కారణంగా ఇళ్ల బయట నిలబడలేని పరిస్థితి నెలకొంది.ఈ సమస్యపై మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఫిర్యాదులు చేస్తున్నాం హామీలు వస్తున్నాయయి కానీ చర్యలు మాత్రం కనిపించడం లేదు అని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మేము మనుషులం కాదా? మా కాలనీలో ఇలా మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల ఊపిరాడని పరిస్థితి. పిల్లలు జ్వరాలతో ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులకు చెప్పినా స్పందన లేదు అని మహిళలు వాపోతున్నారు.తక్షణమే కాలువలను శుభ్రం చేసి శాశ్వత పరిష్కారం చూపించాలని, లేదంటే ఉన్నతాధికారులను ఆశ్రయించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలలో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం

• డిసిసి అధ్యక్షులు ధారాసింగ్

**తాండూర్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లాలో వికారాబాద్ తాండూర్, పరిగి కొడంగల్ లలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను సాధించి విజయ డంకా మోగించిందని డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు.గురువారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మీడియా పాయింట్ వద్దకు వెళ్లి మాట్లాడారని దానికి మాజీ ఎమ్మెల్యే ఆరోపణ చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే రౌడీలా వ్యవహరించారని అన్నారు. గుండాలను వెంబడి తీసుకు వచ్చి హంగామా సృష్టించారని మా ఎమ్మెల్యే వెంబడి వచ్చిన వారికి మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వెంబడి వచ్చిన వారికి పోలీస్ శాఖ వారు నార్కోటిక్ టెస్టులు చేయించాలని అన్నారు. ఎవరు డ్రగ్స్ గంజాయ్ వాడారో తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు నచ్చి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. పోలీసుల అనుమతితోనే మీడియా పాయింట్ వద్దకు వెళ్లామని వారికి అనుమతి ఇస్తే వెళ్లకుండా హంగామా సృష్టించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే రౌడీ గుండాలా వివరించారని ఎమ్మెల్యే కారుకు అడ్డంగా వచ్చేందుకు ప్రయత్నించారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష వల్లే రోహిత్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారని దుయ్యబట్టారు. డాక్టర్ సంపత్ వల్లే బీఆర్ఎస్ కు ఆమాత్రం సీట్లు వచ్చాయని అన్నారు. డ్రగ్స్ తాగి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మెజార్టీ సీట్లను మేమే గెలిచామని మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పారని రానున్న ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే విజయమని భీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ రవి గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ మురళి గౌడ్, మాజీ మున్సిపల్



చైర్ పర్సన్ స్వప్న పరిమల్, నాయకులు వడ్డే శ్రీనివాస్, పెద్దెముల్ మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు శోభారాణి , మహిళా నాయకురాలు మాధవి, సుమిత్ర పాల్గొన్నారు.

# 21 వార్డుల్లో కాంగ్రెస్ కూటమి విజయం

**మధిర, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** పట్టు వదలని విక్రమార్కుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అని మరోమారు రుజువైంది. మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని పట్టుబట్టి ఒకవైపు పార్టీ శ్రేణులను కదిలించారు, పోరాట స్ఫూర్తిని నింపారు. మరోవైపు రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా మధిర అభివృద్ధికి చేస్తున్న కృషిని ఓటర్లకు తానే స్వయంగా వివరించి వారి మనసు గెలిచి ఘన విజయం సాధించారు.అన్ని తానై ముందుకు నడిచిన భట్టి విక్రమార్క తిరుగులేని ప్రజా నాయకుడని, తాను ఓ క్యాడర్ లీడర్ అని మరోసారి నిరూపించుకున్నారు. భట్టి విక్రమార్క ఏ పని చేసినా పద్ధతి ప్రకారం చేసి ఫలితం సాధిస్తారని మరోసారి స్పష్టమైంది.గత పది సంవత్సరాలు మన పార్టీ అధికారంలో లేదు. మున్సిపాలిటీ కూడా మన చేతిలో లేదు. ఆ పార్టీ అభివృద్ధి నిధులు కూడా మంజూరు చేయలేదు. ఈ సమయంలో మధిర ఎమ్మెల్యేగా మున్సిపాలిటీ బోర్డుపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించడం సాధ్యం కానీ పని అని విజ్ఞులైన, ప్రజాస్వామ్యవాది భట్టి విక్రమార్క మౌనంగా భరించారు.తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిప్యూటీ సీఎంగా ఆర్థిక, విద్యుత్తు మరియు ప్రణాళికా శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు చేతికి వచ్చాయి. ఇదే అదునుగా తనను వరుసగా ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిపించిన మధిర ప్రజల రుణం తీర్చుకునే అవకాశం దక్కిందని భావించిన డిప్యూటీ సీఎం తన ఏళ్ల నాటి కలలను సాకారం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదిపారు.రాజకీయ పొత్తులు, కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు, ఎన్నికల ప్రచారం, అభివృద్ధి ఎత్తుగడ, ప్రతి అంశంలో అనుకున్నట్టే ముందుకు వెళ్లి అద్భుత విజయాన్ని



ప్రజానాయకుడు మన భట్టి విక్రమార్క అందిపుచ్చుకున్నారు. కడుపులో కత్తులు పెట్టుకొని తిరుగుతూ, నిత్యం విమర్శలతో విషం చిమ్మే విపక్షాలను పల్లెత్తు మాట అనకుండా, చిన్న అల్లరి లేకుండా, అదరక బెదరక తాను నమ్మిన పద్ధతుల్లో ముందుకెళ్లి భట్టి భేష్ అనిపించుకున్నారు. మధిర మున్సిపాలిటీలో ఏ పార్టీ బలం ఎంతో వాస్తవంగా అంచనా వేసి టిడిపితో కూటమిగా బరిలో దిగారు. 22 వార్డుల్లో టిడిపి బలపరిచిన స్వతంత్ర అభ్యర్థులు మూడు వార్డుల్లో పోటీలో నిలవగా, మిగిలిన 19 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో నిలబడ్డారు.తన గెలుపు కోసం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎంతగా శ్రమిస్తారో, అంతకుమించి మున్సిపాలిటీలో కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపునకు డిప్యూటీ సీఎం శ్రమించి గొప్ప స్ఫూర్తిని నింపారు. దీంతో తాను నిజమైన నాయకుడని మరోసారి నిరూపించుకున్నారు. తన బలం, బలహీనత కాంగ్రెస్ శ్రేణులేనని నమ్మి వారికి బాధ్యతలు అప్పగించి నిత్యం పర్యవేక్షించారు. వారు క్షేత్రస్థాయిలో చేయాల్సిన కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేస్తూ ముందుకు నడిపించారు. పోటీ చేసిన అభ్యర్థులను కంటికి పాపలా కాపాడుకున్నారు.

మరోవైపు స్వయంగా తానే ప్రచార రంగంలోకి దిగారు. ఎన్నికల ముందు నిర్వహించిన భారీ ర్యాలీతోనే మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తేలింది.తాను డిప్యూటీ సీఎం అయినా చిన్న మున్సిపాలిటీలో ప్రచారం చేయడం అవసరమా అనే భావన లేకుండా వార్డుల వారీగా ప్రచారంలోకి దిగారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా మధిర పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేయబోతున్నారో కళ్లకు కట్టినట్టు వివరించి ఓటర్లను మెప్పించారు. స్వచ్ఛమైన, సుందరమైన మధిర కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్తు, వరద నీటి ఇబ్బంది లేకుండా వైరా నదికి అడ్డంగా కరకట్ట, మధిర పట్టణ విస్తరణకు హైదరాబాద్ తరహాలో ఔటర్ రింగ్ రోడ్డు వంటి పనులకు అనుమతులు సాధించి వేగంగా పనులు చేపడుతున్న తీరును వివరించారు.గత కొన్ని నెలలుగా మధిర మున్సిపాలిటీపై విపక్షాలు చిమ్ముతున్న విషాన్ని తన రెండు రోజుల ప్రచారంతో డిప్యూటీ సీఎం తిప్పికొట్టారు. మధిర పట్టణ ప్రజల మనసులు గెలిచారు. విక్రమార్కుని వ్యూహం ఫలించింది. రికార్డులు తారుమారు అయ్యాయి. మధిర మున్సిపాలిటీని 22 స్థానాలకుగాను 21వార్డుల్లో కాంగ్రెస్ కూటమి ఏకపక్షంగా గెలుచుకొని విజయ దుందుభి మోగించింది.దీ=ా, జూవీ, జూ× కూటమి ఒకే ఒక్క వార్డుకు పరిమితం కావడం భట్టి రాజకీయ చాణక్యానికి అద్దం పట్టింది. మధిర మొత్తం "జయహో భట్టి విక్రమార్క" అంటూ నినదించింది.

## పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాం

• ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. శుక్రవారం పట్టణంలోని సెయింట్ మార్క్స్ జూబ్లీ హై స్కూల్ లో జరిగిన మున్సిపల్ ఓట్ల లెక్కింపు హోరాహోరీగా సాగింది. 36 వార్డులకు గాను మూడు రౌండ్లలో ఒక్కో రౌండ్ కు 12 వార్డులను లెక్కించారు. టగ్ ఆఫ్ వార్‌గా సాగిన కౌంటింగ్ లో నువ్వా నేనా అన్నట్టుగా ఫలితాలు రావడంతో కాసేపు ఉత్కంఠగా మారింది. టిఆర్ఎస్ పార్టీ నుండి చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించిన సాయిపూర్ పట్లోళ్ల నర్సింలు ఓటమిపాలయ్యారు. 36 వార్డులకు గానువికారాబాద్ జిల్లా మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది.

### 36 వార్డులకు గాను మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

కాంగ్రెస్ పార్టీ 19,బిఆర్ఎస్ 12,బీజేపీ 3, ఎంఐఎం 1,ఇండిపెండెంట్ 1 గెలుపొందారు. చైర్ పర్సన్ ను ఎన్నుకోవడానికి కావలసిన 19 మంది కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించి మెజారిటీ సాధించడంతో చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి వరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా విజయమని అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణంతోపాటు, నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తామని అన్నారు.




# ఐటీ స్టాక్స్ కుదేలు..

## రూ.300 పెడితే రూ.634 కోట్లు..

### మిలియన్ డాలర్లు కురిపించిన డొమైన్ నేమ్స్..!

**న్యూఢిల్లీ:**వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే డొమైన్ నేమ్ ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. 30 ఏళ్ల క్రితం రూ.300 పెట్టుబడితో కొనుగోలు చేసిన ఒక డొమైన్ ఇప్పుడు రూ.634 కోట్లు పలికిందన్న వార్త సంచలనంగా మారింది. గతంలోనూ ఇలాంటి సందర్భాలు ఉన్నాయి. మలేసియాకు చెందిన వ్యాపారవేత్త అరిసాన్ ఇస్మాయిల్ 'ఎ.ఇనీఎ' డొమైన్‌ను క్రిప్టో.కామ్ సీఈఓ 70 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. అంటే సుమారు రూ.634 కోట్లు. ఈ డీల్ ఏప్రిల్ 2025లోనే జరిగింది. అయితే దీనిని సూపర్ బౌల్ ఎల్ఎక్స్ (అమెరికన్ ఫుట్‌బాల్ గేమ్) సందర్భంగా రీలాంచ్ చేయడంతో తాజాగా ఈ ఒప్పందం వెలుగులోకి వచ్చింది. అయితే ఇస్మాయిల్ డొమైన్‌ను కొనుగోలు చేసిన విషయంలో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.




ఇస్మాయిల్ 1993లో 10 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు రూ.300తో కొనుగోలు చేసినట్లు కొన్ని కథనాలు పేర్కొనగా, 2021లో డొమైన్ బ్రోకరేజ్ సైట్ ఎాంచి.ఇనీఎ నుంచి ఇస్మాయిల్ ఈ డొమైన్‌ను కొన్నట్టు మరికొన్ని కథనాలు రాసుకొచ్చాయి. అయితే అప్పుడు అతడు ఎంత మొత్తం వెచ్చించాడన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. అంతకుముందు దాని యజమాని ఫ్యూచర్ మీడియా ఆర్కిటెక్ట్స్ అని, అది డొమైన్ నేమ్స్ హోల్డింగ్ కంపెనీ అని వెల్లడించాయి. గతంలోనూ పలు డొమైన్ నేమ్స్ భారీ ధర పలికాయి.

**కార్స్.కామ్.. 872 మిలియన్ డాలర్లు**

అత్యంత విలువైన డొమైన్ నేమ్‌గా దీనికి పేరుంది. తొలుత ఇది క్లాసిఫైడ్ వెంచర్స్ చేతిలో ఉండగా.. 2016లో కార్ డీలర్ రివ్యూ వెబ్‌సైట్ డీలర్ రేటర్ కొనుగోలు చేసింది.బిజినెస్.కామ్ 2007లో 2 మిలియన్ డాలర్లకు అమ్ముడైంది. అయితే ఆ సమయంలో దాని స్టాక్స్ విలువ 345 మిలియన్ డాలర్లు పలికాయి. దాంతో అదికూడా అత్యంత విలువైన డొమైన్లలో ఒకటిగా నిలిచింది. వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలనే టిప్స్‌ను ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.పర్యాటక రంగంలో లొకేషన్ ఆధారిత డొమైన్లు ఎంత కీలకమో ఇది వెల్లడి చేస్తోంది. దీనిని 90 మిలియన్ డాలర్లకు లాస్‌వెగాస్ కన్వెన్షన్ అండ్ విజిటర్స్ అథారిటీ కొనుగోలు చేసింది.కార్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీలో కీలకమైన కార్‌ఇన్సూరెన్స్. కామ్ 49.7 మిలియన్ డాలర్లకు, సరసమైన ధరల్లో ఇన్సూరెన్స్ ప్లాన్ల గురించి చిట్కాలు అందించే ఇన్సూరెన్స్.కామ్ 35.6 మిలియన్ డాలర్లకు అమ్ముడయ్యాయి. ఇలా ఒక పేరుతో రూ.కోట్లు తెచ్చిపెట్టిన డొమైన్లు చాలానే ఉన్నాయి. భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి రిజిస్టర్ చేసుకున్న వారిని కోటీశ్వరులుగా మార్చాయి.


## భారీ నష్టాల్లో సూచీలు

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభ మయ్యాయి అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, ఏఐ భయాలు మన సూచీలను దెబ్బతీశా యి. నిన్నటి నష్టాలను కొనసాగిస్తూ.. నేటి ట్రేడింగ్ లోనూ ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. ఉదయం 9.33 గంటల సమయంలో సెన్సెక్స్ 760 పాయింట్లు క్షీణించి, 82,906 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 245 పాయింట్లు పతనమై 25,561 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 8 పైసలు కోల్పోయి, 90.69గా ఉంది. నిఫ్టీ సూచీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హిందాల్కో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో షేర్లు నష్టాల్లో ఉన్నాయి.గురువారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. కృత్రిమమేధ భయాలతో మదుపర్లు అమ్మకాలకు దిగడంతో నాస్‌డాక్ రెండు శాతం మేర కుంగింది. తాజాగా విడుదలైన జాబ్‌డేటా, జనవరి ద్రవ్యోల్బణ నివేదిక త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ స్టాక్స్‌ను ఆంత్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నా యి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఇవన్నీ మన ఐటీ షేర్లపై ప్రభావం చూపించాయి. ఈ పరిణామాలతో వరుసగా మూడో సెషన్‌లో 5.5 శాతం మేర క్షీణించాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి.




**ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.108.42 కోట్లు**

ఐటీ షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురవడంతో, దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 17 పైసలు లాభపడి 90.61 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 0.27% తగ్గి 69.21 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై సూచీలు సానుకూలంగా ముగిశాయి. హాంకాంగ్ సూచీ నష్టపోయింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.51 లక్షల కోట్లు తగ్గి, రూ.472.48 లక్షల కోట్ల (5.22 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.సెన్సెక్స్ ఉదయం 83,968.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,233.64) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగిన సూచీ 84,061.62 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 83,516.67 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 558.72 పాయింట్ల నష్టంతో 83,674.92 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 146.65 పాయింట్లు కోల్పోయి 25,807.20 పాయింట్ల వద్ద స్థిరపడిం ది.సెన్సెక్స్ 30 షేర్లలో 17 నష్టపోయాయి. టెక్ మహీంద్రా 5.99%, ఇన్ఫోసిస్ 5.79%, టీసీఎస్ 5.41%, హెచ్‌సీఎల్ టెక్ 4.84%, ఎం అండ్ ఎం 2.23%, హెచ్‌యూఎల్ 2.13%, రిలయన్స్ 1.27% చొప్పున తగ్గాయి. బజాజ్ ఫైనాన్స్ 3.17%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.73%, ట్రెంట్ 1.52%, బీఈఎల్ 1.43%, ఎస్‌బీఐ 0.8% లాభపడ్డాయి. భెల్ ఓఎఫ్ఎస్‌లో 5% వాటా విక్రయానికి రిటెయిల్, సంస్థాగత మదుపర్ల నుంచి 1.34 రెట్ల స్పందన లభించినట్లు దీపమ్ కార్యదర్శి అరుణిష్ చావ్లా వెల్లడించారు.తన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల (బీఎంపీల) విషయంలో, మనదేశ నిర్దిష్ట వారంటీ పద్ధతులకు వ్యతిరేకంగా, అనైతికంగా వ్యవహరించినందుకు ఇంటెల్ కార్ప్‌పై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రూ.27.38 కోట్ల జరిమానా విధించింది. ఎగ్జాన్ మొబిల్‌తో తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించి, డేటా సెంటర్ ఇమ్మర్షన్ ఫ్లూయిడ్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇది ఇంధన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న విద్యుత్ వినియోగాన్ని పెంచుతుందని తెలిపింది.గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ రామ్‌కో సిస్టమ్స్ .. సంభాషణాత్మక ఏఐ ఏజెంట్ ప్లాట్‌ఫామ్ 'చియా'ను ప్రారంభించింది. మెరుగైన వినియోగదారు అనుభవాన్ని అందించే లక్ష్యంతో, ఏజెంటిక్ ఏఐ ఉత్పత్తి విభాగంలోకి ప్రవేశించినట్లు సంస్థ తెలిపింది. కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాల్లో ఉద్యోగుల వినియోగాన్ని తగ్గించేందుకు చియా ఉపయోగ పడుతుందని వివరించింది.




## భారత్‌లో రోల్స్ రాయిస్ భారీ ప్రణాళికలు

### యుద్ధ విమానాల ఇంజిన్ల సహ-అభివృద్ధి
### వెల్లడించిన సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్

**న్యూఢిల్లీ:**మనదేశంలో రక్షణ, ఇంధన, పౌర విమానయాన రంగాల్లో తన కార్యకలాపాలు పెంచుతామని బ్రిటన్ దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ వెల్లడించింది. భారత తదుపరి తరం యుద్ధ విమానాల కోసం అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) ప్రోగ్రామ్ కింద ఏరో-ఇంజిన్‌ను ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నట్లు కంపెనీ సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్ తెలిపారు. అది కూడా పూర్తిగా మేధోసంపత్తి హక్కుల బదిలీతో చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 1,400కు పైగా రోల్స్‌రోయిస్ ఇంజిన్లు భారత త్రివిధ దళాల్లోని వివిధ రక్షణ ప్లాట్‌ఫారాలలో




సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో కంపెనీకి ఉన్న సిబ్బందిని రెట్టింపు చేసి 10,000కు చేర్చాలనీ సంస్థ భావిస్తోంది. తన అత్యాధునిక తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మార్చే దీర్ఘకాల లక్ష్యంతో స్థానిక సరఫరా వ్యవస్థ వనరులను పదింతలు చేసుకోవాలనీ చూస్తోంది . దీనివల్ల పలు ఎస్ఎమ్ఈ(చిన్న, మధ్య తరహా కంపెనీలు)లకు ప్రయోజనం దక్కనుంది. 'ఇతర దేశాల్లో విజయవంతంగా మా వ్యవస్థను విస్తరించినట్లుగానే, భారత్‌లోనూ రక్షణ, విమాన, ఇంధన రంగాల్లో వృద్ధి చెందాలని భావిస్తున్న'ట్లు తూఫాన్ అన్నారు. ప్రధాని మోదీతో పాటు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్‌తో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. 'భారత్‌లో తన కార్యక్రమాలను పెంచుకోవాలన్న రోల్స్‌రాయిస్ ఉత్సాహాన్ని మేం స్వాగతిస్తున్నామ'ని మోదీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పెంచుకోవాలన్న రోల్స్‌రాయిస్ ఉత్సాహాన్ని మేం స్వాగతిస్తున్నామ'ని మోదీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. హెచ్ఏఎల్, ఫోర్స్ మోటార్స్‌తో తయారీ సంయుక్త సంస్థలు; టాటా, భారత్ ఫోర్జ్, గోద్రేజ్ వంటి 100కు పైగా వెండార్లతో సోర్సింగ్ భాగస్వామ్యాలు ఈ కంపెనీకి ఉన్నాయి.




## పసిడి వైపే యువత పరుగు

### తక్కువ పరిమాణంలో కొనుగోళ్లు • వ్యక్తిగతంగానే నిర్ణయాలు

**న్యూఢిల్లీ:**జెన్ జీ, మిలీనియల్స్‌లో (18 నుంచి 45 ఏళ్ల వయసున్న) అత్యధికులు (62% మంది) స్టాక్స్, మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్) కంటే పసిడినే అత్యంత సురక్షిత పెట్టుబడి మార్గంగా భావిస్తున్నారని ఓ సర్వే తెలిపింది. కుటుంబ పెట్టుబడి నిర్ణయాలతో సంబంధం లేకుండా, సొంతంగానే తక్కువ పరిమాణంలో, పసిడి కొనుగోలు నిర్ణయాలను యువత తీసుకుంటున్నారని వివరించింది. దేశవ్యాప్తంగా 5,000 మంది యువత నుంచి సేకరించిన అభిప్రాయాలతో ఈ నివేదిక రూపొందించినట్లు 'స్మిట్టెన్ పల్స్ఏఐ' తెలిపింది. దీని ప్రకారం..ప్రస్తుతం 66.7% వరకు పసిడి కొనుగోళ్లు, వ్యక్తిగత నిర్ణయాల ఆధారంగానే జరుగుతున్నాయి. ఇటీవల తమ కుటుంబం చేసిన పసిడి కొనుగోళ్ల విషయంలో, తామే నిర్ణయం తీసుకున్నామని 42.3% మంది యువత తెలుపగా.. తల్లిదండ్రులు లేదా కుటుంబంలో పెద్దవాళ్ల నిర్ణయమని 40% మంది వెల్లడించారు. 5 గ్రాముల లోపే పసిడి కొన్నామని 61.90% మంది వెల్లడించారు. 2 గ్రాముల లోపు కొనుగోలు చేసిన వాళ్లు 27.5% మంది కాగా.. 2-5 గ్రాముల మధ్య కొనుగోలు చేసిన వాళ్లు 34.4% మంది ఉన్నారు. రూ.25,000 నిధులుంటే, పసిడి కొంటామని 61.9% మంది పేర్కొన్నారు. దీంతో పోలిస్తే ఎంఎఫ్ (16.6%), డిపాజిట్లు (13%), షేర్లు (6.6%), క్రిప్టో (1.9%) వైపు ఆసక్తి చూపిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది.ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పుడు బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం, ఎంఎఫ్‌లు, షేర్ల కొనుగోలు కంటే పసిడిలో పెట్టుబడి ఉత్తమమని 65.7% మంది తెలిపారు. మొదటి జీతంతో తొలిసారి పసిడి కొనుగోలు చేసినట్లు 24.3% మంది తెలపగా.. పెట్టుబడిగా పసిడిని కొనుగోలు చేసినట్లు 23.9% మంది వెల్లడించారు.అన్నీ ఆన్‌లైన్‌లో కొనే యువత, బంగారం విషయంలో మాత్రం అందుకు దూరంగా ఉంటోంది. దిగ్గజ ఆభరణాల సంస్థల్లో కొనుగోళ్లకు 38.3% మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక విక్రయశాలలపై 34.7% మంది మొగ్గుచూపారు. 5.2% మంది మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరుపుతున్నారు.

**తగ్గిన బంగారం, వెండి ధరలు**

ఈనాడు వాణిజ్య విభాగం: అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం భారీగా పతనం అయ్యాయి. భారత కాలమానం ప్రకారం రాత్రి 11.55 గంటలకు ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 155 డాలర్లు తగ్గి, 4918 డాలర్లకు, ఔన్సు వెండి ధర 8 డాలర్లు పతనమై 75 డాలర్లకు దిగివచ్చాయి. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,56,650, కిలో వెండి ధర రూ.2,49,760 వద్ద స్థిరపడ్డాయి.

## ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌పై మస్క్ అక్కసు

**వాషింగ్టన్:**'క్లాడ్ చాట్‌బాట్' సృష్టికర్త, అమెరికా కంపెనీ ఆంత్రోపిక్ తన కొత్త ఏఐ టూల్ 'క్లాడ్ కోవర్క్ ఏజెంట్'ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. లీగల్, సేల్స్, మార్కెటింగ్, డేటా అనాలసిస్ వంటి రంగాల్లో ఆటోమేషన్




కోసం ఈ ప్లగ్‌ఇన్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ నేపథ్యంలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలు మరింత పెంచడానికి 30 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో కంపెనీ మొత్తం విలువ 380 బిలియన్ డాలర్ల (సుమారు రూ.34 లక్షల కోట్లు)గా లెక్కగట్టినట్లు తెలిపింది. ఈ ప్రకటనపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంత్రోపిక్ ఏఐ శ్వేత జాతీయులు, ఆసియన్లు, చైనీయులు, పురుషులను ద్వేషిస్తుందంటూ పోస్ట్ చేశారు. ఈ దుష్ప్రవర్తనను ముందు సరిదిద్దుకోవాలని సూచించారు. ఆంత్రోపిక్‌ను.. మిస్‌ఆంత్రోపిక్‌గా (ఇతరులను ద్వేషించేదిగా) మారకుండా తప్పించేందుకు మీరు ఏమీ చేయలేరని దాని యాజమాన్యాన్ని విమర్శించారు. ఆంత్రోపిక్ సంస్థ తీసుకువచ్చిన 'క్లాడ్ కోవర్క్' వల్ల మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ స్టార్టప్ ఎక్స్‌ఏఐ (లీంఎ) కూడా పలు మార్పులకు గురవుతోన్న సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక ప్రకారం..ఆంత్రోపిక్ సంస్థకు ఉన్న 380 బిలియన్ డాలర్ల వాల్యుయేషన్‌తో ఇది ఓపెన్‌ఏఐ (రాజూవనింఎ), స్పేస్‌ఎక్స్ (రాజూజీఇవచీ)లతో పాటు ప్రపంచంలోని అత్యంత విలువైన స్టార్టప్‌లలో ఒకటిగా నిలిచింది. ప్రముఖ పెట్టుబడి బ్యాంకు రినైసాన్స్ క్యాపిటల్.. ఆంత్రోపిక్‌ను మూడో అత్యంత విలువైన ప్రైవేట్ సంస్థగా అభివర్ణించింది.

## అమెరికా విడుదల చేసిన మ్యాప్‌పై పాక్ గగ్గోలు..

**న్యూఢిల్లీ:**భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిన వేళ.. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత్ మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది. చివరకు అగ్రరాజ్య అధికారులకు నచ్చజెప్పి ఆ మ్యాప్‌ను తొలగింపజేశారు.కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. కశ్మీర్‌ను జీవనాడిగా చెప్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోంది. ఇలాంటి సమయంలో దాయాది పేర్కొంటున్నట్టుగా కాకుండా.. భారత్ మ్యాప్ ఉన్నది ఉన్నట్టుగా అమెరికా షేర్ చేసింది. దీన్నిచూసి తట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. అమెరికా అధికారులను ఒప్పించి, దాన్ని తొలగించాలని ప్రాధేయపడటంతో వారు దానిని తొలగించారు. మ్యాప్ షేర్ చేయగానే తాము వెంటనే అగ్రరాజ్య అధికారులను సంప్రదించామని పాక్ విదేశాంగశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబి వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. కాగా.. కశ్మీర్ విషయంలో భారత్ తన వైఖరిని బలంగా వినిపిస్తోంది. ఎప్పటికీ కశ్మీర్ భారత భూభాగమేనని తేల్చిచెప్పింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని గతంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు పీవోకే విదేశీ భూభాగం అవుతుందే తప్ప మరొకటి కాదని అన్నారు.






## ఏడాదిలోనే రూ.8 లక్షల కోట్ల వాణిజ్య మిగులు

### అమెరికాతో ఒప్పందం ప్రభావంపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

**వాషింగ్టన్:**అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన ఎగుమతులు భారీగా పెరుగుతాయని.. దిగుమతులు రాణించినా కూడా, ఏడాది వ్యవధిలోనే మనకు వాణిజ్య మిగులు 90 బిలియన్ డాలర్లు (రూ.8.19 లక్షల కోట్లు)గా ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. ఏడాది వ్యవధిలో అగ్రగామి 15 వస్తువుల ఎగుమతులే 97 బి. డాలర్లకు చేరతాయని, మిగతా వస్తువులూ కలిపితే ఏటా 100 బి. డాలర్ల మార్కును చేరొచ్చని వివరించింది.జీడీపీపై 1.1% ప్రభావం: 2024-25లో అమెరికాతో మనకు 40.9 బి.డాలర్ల మిగులు ఉండగా, 2025-26లో ఏప్రిల్-డిసెంబరు కాలానికి 26 బి.డాలర్లుగా ఉంది. అదనపు ఎగుమతుల వల్ల ఏడాదికి ఇది 90 బి.డాలర్లకు చేరగలదని నివేదిక అంచనా వేసింది. జీడీపీపై నికరంగా 1.1% సానుకూల ప్రభావం పడుతుందనీ తెలిపింది. భారత ఎగుమతుల్లో అమెరికా వాటా 20% కాగా, మన దిగుమతుల్లో అమెరికా వాటా 7 శాతంగానే ఉంది. సేవల దిగుమతుల్లో అమెరికాకు 15% వాటానే ఉండడంతో, భారత్ మంచి మార్కెట్‌గా ఆ దేశానికి మారే అవకాశం కనిపిస్తోంది.

## చైనాలో అనూహ్య ఘటన..

### భూమిలోకి కుంగిన రోడ్డు

షాంఘై:చైనాలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. షాంఘైలో అందరూ చూస్తుండగానే రోడ్డులోని కొంత భాగం భూమిలోకి కుంగిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద సింక్ హోల్ ఏర్పడింది. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఫిబ్రవరి 12న కొత్త మెట్రో రైలు కోసం టన్నెల్ నిర్మాణపనులు చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా నేల కుంగిపోతుండటంతో అక్కడ ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రాణ భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని, ఎవరికీ ఎలాంటి గాయాలు కూడా కాలేదని అధికారులు ధ్రువీకరించారు. సంఘటన జరిగిన వెంటనే సంబంధిత సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని.. శిథిలాలను అక్కడినుంచి తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ రోడ్డును పూడ్చే పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సమీపంలోని కార్యాలయాలు, అపార్ట్‌మెంట్‌లను తాత్కాలికంగా ఖాళీ చేయించినట్లు తెలిపారు. ఈ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా.. అధికారుల నిర్లక్ష్యాన్ని విమర్శిస్తూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇక, ఈ ప్రాంతంలో ఇలాంటి సంఘటనలు



జరగడం ఇదే మొదటిసారి కాదు. 2024లో మురుగునీటి పైపు లైను పగిలిపోవడంతో మిన్‌హాంగ్ జిల్లాలోని ఓ రోడ్డులో కొంత భాగం కుంగిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీనికి ముందు కూడా ఇక్కడ సింక్‌హోల్‌లు ఏర్పడిన సంఘటనలు ఉన్నాయి.

## బిగ్ డీల్

పద్ధతిలో జరిగే ఈ కొనుగోళ్లలో 120 స్వల్ప శ్రేణి క్షిపణులు, 168 సుదీర్ఘ శ్రేణి క్షిపణులు ఉన్నాయి. ఇప్పటికే కాంట్రాక్ట్ జరిగిన మరో రెండు ఎస్-400 వ్యవస్థలు ఈ ఏడాది జూన్, నవంబర్‌లో భారత్‌కు అందనున్నాయి. ఆపరేషన్ సిందూర్' సమయంలో ఉపయోగించిన క్షిపణుల నిల్వలను పునరుద్ధరించడం, వాయి రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడం తాజా కొనుగోళ్ల ముఖ్య ఉద్దేశంగా డిఫెన్స్ వర్గాలు తెలిపాయి. ఇదేవిధంగా చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, 400 కిలోమీటర్ల పరిధిలో వైమానిక ముప్పును సమర్థవంతంగా ఎస్-400 వ్యవస్థ అడ్డుకుంటుందని పేర్కొన్నాయి. పాకిస్థాన్‌తో గత ఏడాది తలెత్తిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్-400 వ్యవస్థ శత్రువుల వెన్నులో చలిపుట్టించింది. 314 కిలోమీటర్ల దూరంలోని పాక్ యుద్ధ విమానాన్ని కుప్పకూల్చింది. ఆదంపూర్, భుజ్ సెక్టార్లలో ఈ వ్యవస్థను మోహరించడంతో పాక్ గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ యుద్ధ విమానాలను ఆఫ్ఘనిస్థాన్, ఇరాన్ సరిహద్దులకు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం కొనుగోలు చేయనున్న 400 కి.మీ, 200 కి.మీ, 150 కి.మీ, 40 కిలోమీటర్ల శ్రేణి క్షిపణులు శత్రువుల విమానాలు, డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టగలవు.



# బోధన్‌లో హంగ్. పుంజుకున్న ఎంఐఎం

- పుంజుకున్న ఎంఐఎం
- ఐదు సీట్లతోనే సరిపెట్టుకున్న బీఆర్ఎస్
- కీలకంగా మారిన ఇండిపెండెంట్ అభ్యర్థి





**బోధన్, ఫిబ్రవరి 13 ( జనంసాక్షి ) :**
బోధన్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలలో హాంగ్ వచ్చింది. అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించిన విధంగానే 17 వార్డులు విజయం సాధించగా ఈసారి అనూహ్యంగా ఎంఐఎం పార్టీ 12 స్థానాలతో పుంజుకుంది. అయితే బీఆర్ఎస్ ఐదు సీట్లతోనే సరిపెట్టుకోగా పట్టణంలోని 16వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి మద్దెల దివ్య సంతోష్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలలో కీలకంగా మారనున్నారు. కొన్ని వార్డులలో అధికార కాంగ్రెస్ పార్టీ కేటాయించిన అభ్యర్థులు కాకుండా అక్కడే ఉన్న అభ్యర్థులకు కేటాయిస్తే మరో నాలుగు వార్డులు అధికార పార్టీకి దక్కే అవకాశం ఉండేది. పట్టణ ప్రజలు ఈసారి గులాబీ పార్టీకి కాకుండా ఎంఐఎం పార్టీ అభ్యర్థులకు తమ ఓటు వేసి 12 మంది కౌన్సిలర్లను గెలిపించారు. గులాబీ పార్టీ విజయం కోసం మాజీ ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా అన్ని వార్డులలో ప్రచారం నిర్వహించినప్పటికీ కేవలం ఐదు వార్డులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ అధికార పార్టీ అభ్యర్థులకు మెజార్టీ ఓట్లు వచ్చినప్పటికీ కొంతమంది అభ్యర్థులు ఓడిపోవడం గమనార్హం.

ఈ మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రానికి అబ్జర్వర్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా సిపి సాయి చైతన్య లు వచ్చి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ ఎసిపి శ్రీనివాస్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించారు. బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సైలు మచ్చేందర్ రెడ్డి, వంశీకృష్ణ రెడ్డి, సునీల్, హబీబ్, భాస్కరాచారి, ముత్యాల రమలు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేక పోలీసు బలగాలతో గట్టి నిఘాను సైతం ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. కాగా చైర్మన్ మ్యాజిక్ ఫిగర్ కోసం 19 మంది కౌన్సిలర్లు మద్దతు తెలపాల్సి ఉంటుంది.

### భార్యాభర్తలు ఇద్దరూ విజేతలే....

కాగా శుక్రవారం జరిగిన మున్సిపల్ ఓట్ల లెక్కింపులో 25వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తూము శరత్ రెడ్డి 35 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తూము పద్మ విజయం సాధించారు.

సదరు తూము పద్మ గత ఎన్నికలలో మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగారు. అయితే ఈసారి ఎన్నికలలో సైతం భార్యాభర్తలు ఇద్దరూ విజయం సాధించారు. అలాగే ఎంఐఎం పార్టీ బోధన్ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ 18 వ వార్డులో విజయం సాధించగా ఆయన సతీమణి వసీం సుల్తానా 32 వ వార్డు నుండి ఎంఐఎం అభ్యర్థిగా గెలుపొందింది.

# సిరిసిల్ల మున్సిపల్ పోరులో కారు జోరు

## బీఆర్ఎస్‌కు అఖండ మెజారిటీ

- 39లో 27 వార్డులు కైవసం
- కేటీఆర్ నాయకత్వానికి ప్రజల విశ్వాసం
- కాంగ్రెస్‌కు భారీ షాక్.. వార్ వన్ సైడ్





**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** సిరిసిల్ల మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అఖండ విజయం సాధించింది. 39 వార్డుల్లో 27 స్థానాలు కైవసం చేసుకుని మరోసారి గులాబీ జెండా ఎగురవేసింది. మొత్తం పోలైన ఓట్లలో 52 శాతం కంటే ఎక్కువ బీఆర్ఎస్‌కు పడ్డాయి. గత ఎన్నికల్లో 22 స్థానాలతో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రతిపక్షంలో ఉండి కూడా 27 స్థానాలు గెలుచుకుని తన బలాన్ని నిరూపించుకుంది.

సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీ రామారావు సొంత నియోజకవర్గంలో ఈ ఘన విజయం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ ఉద్యమం నుంచి సిరిసిల్ల ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలిచారని, ఈ ఫలితాలు ఆ మద్దతును మరోసారి నిరూపించాయని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా సిరిసిల్ల గడ్డ గులాబీ అడ్డాగానే మిగిలిందని, రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాబోతోందన్న సంకేతాలిచ్చిందని చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ గతంలో 2 స్థానాల నుంచి 6 స్థానాలకు చేరుకుంది. అధికార పార్టీగా ఉండి కూడా పట్టణ ప్రజలను పూర్తిగా ఆకట్టుకోలేకపోవడం, పార్టీలో ఐకమత్య లోపం కారణమని రాజకీ య విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ 5 స్థానాలు, ఒక స్థానం స్వతంత్రుడు గెలుచుకున్నారు. త్రిముఖ పోటీ జోరుగా సాగినా ఫలితాలు వార్ వన్ సైడ్‌గా మారాయి.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ, కేటీఆర్ నాయకత్వం పట్ల విశ్వాసంతోనే సిరిసిల్ల ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనా సంక్షోభాన్ని ప్రజలు తిప్పికొట్టారని, ప్రలోభాలు, దాడులు ఎదుర్కొని పార్టీ నాయకులు పోరాడారని కొనియాడారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలు మరచిపోలేదని తెలిపారు.


మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడుతూ, అధికార పార్టీ ఉన్నా బీఆర్ఎస్‌కు 27 స్థానాలు రావడం గొప్పతనమని అన్నారు. కేటీఆర్ ప్రభావంతోనే ఈ భారీ విజయమని, సిరిసిల్ల ప్రజలు ఇది కేటీఆర్ అడ్డా అని మరోసారి రుజువు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు చెంపదెబ్బ లాంటిదని, మరోసారి కేటీఆర్ అడ్డాకు రావద్దని హెచ్చరించారు.

తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, చిక్కాల రామారావు, చీటి నరసింగరావు, జిందం కళాచక్రపాణి, గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, ఎండి సత్తార్, దార్నం అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ విజయం కేటీఆర్ వ్యూహాత్మక ఎత్తుగడలకు నిదర్శనమని పార్టీ నేతలు కొనియాడారు. సిరిసిల్లను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత మరింత పెరిగిందని, పార్టీలకతీతంగా ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని బీఆర్ఎస్ శ్రేణులు హామీ ఇచ్చాయి. గెలిచిన అభ్యర్థులు ప్రజల అందుబాటులో ఎల్లవేళలా ఉండాలని ఓటర్లు కోరుతున్నారు.

## నిమ్స్‌లో సీవోపీడీ చికిత్సలపై

# అవగాహన సదస్సు

### బిటీవిఎ విధానంపై వైద్య నిపుణుల సమగ్ర చర్చ



**ఖైరతాబాద్, ఫిబ్రవరి 13 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని పల్మనరీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్సెస్ ఇన్ సీవోపీడీ మానేజ్మెంట్' అనే అంశంపై శ్వాసకోశ వ్యాధులపై అవగాహన సదస్సు ఎమర్జెన్సీ భవనం ట్రామా ఆడిటోరియంలో నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో సీవోపీడీ(క్రానిక్ అబ్స్ ట్రక్టివ్ పుల్మ నరీ డిసీజ్–దీర్ఘకాలం కొనసాగే శ్వాసకోశ వ్యాధి)కు సంబంధించిన తాజా చికిత్సా విధానాలు, పల్మనరీ రిహాబిలిటేషన్ ప్రాధాన్యత, అలాగే ఆధునిక బ్రాంకోస్కోపిక్ థెరపీలపై నిపుణ వైద్యులు విస్తృ తంగా చర్చించారు. ఈ సందర్భంగా పల్మనరీ మెడిసిన్ విభాగాధిపతి(హెచ్ఓడీ) ప్రొ.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, భారతదేశంలో సీఓపీడీ వ్యాధి ఇంకా చాలామందిలో సరైన సమయంలో గుర్తించబడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి పరీక్షలు చేయించుకుంటే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. తీవ్ర స్థాయి సీఓపీడీ రోగులకు బీటీవీఏ(బ్రంకోస్కోపిక్ థర్మల్ వాపర్ ఆబలేషన్) వంటి ఆధునిక చికి త్సలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ధూమపానం మానడం, బయోమాస్ పొగ ప్రభావాన్ని తగ్గించడం, టీకాలు వేయించుకోవడం, పల్మనరీ రిహాబిలి టేషన్ వంటి నిరోధక చర్యలే సీవోపీడీ నియంత్రణ లో ప్రధానమైనవని ఆయన స్పష్టం చేశారు. సీఓపీడీ ఒక నెమ్మదిగా తీవ్రత పెరిగే దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధి అన్నారు. పొగతాగడం, వాయు కాలుష్యం దీనికి ప్రధాన కారణాలని తెలిపారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి, ఇన్హేలర్ చికిత్సలు, పల్మనరీ రిహాబిలిటేషన్ పాటిస్తే, రోగులు సాధారణ జీవితం గడపవచ్చని ఆయన అన్నారు.

### సీవోపీడీ రోగులకు బీటీవీఏ ఎందుకు అవసరం?

కొంతమంది సీవోపీడీ రోగులు మందులు, ఇన్హేలర్లు, ఆక్సిజన్ వాడుతున్నప్పటికీ తీవ్రమైన శ్వాస ఇబ్బందిని ఎదుర్కొంటుంటారు. ఇలాంటి ఎంపిక చేసిన రోగులకు బీటీవీఏ ఒక కొత్త చికిత్సా మార్గంగా ఉపయోగ పడుతుందని వైద్యులు వివరించారు. బిటివిఏ చికిత్సా విధానంలో ఛాతీ శస్త్రచికిత్స అవసరం లేని విధానం, గొంతు ద్వారా బ్రోంకోస్కోప్ ఉపయోగించి నిర్వహించ బడుతుందని తెలిపారు. ఎక్కువగా దెబ్బతిన్న ఊపిరితిత్తుల భాగాన్ని చిన్నదిగా చేసి, ఆరోగ్యకరమైన ఊపిరితిత్తుల భాగం మెరుగ్గా పనిచేయడానికి సహాయ పడుతుందని తెలిపారు. దీని వల్ల శ్వాస ఇబ్బంది తగ్గే అవకాశం, నడిచే సామర్థ్యం పెరగడం, రోజువారీ పనులు సులభంగా చేయగలగడం, ఆసుపత్రిలో చేరే సందర్భాలు తగ్గడం వంటి ఉపయోగాలు కలుగుతాయని అన్నారు. అయితే, ఈ చికిత్స ప్రతి సీఓపీడీ రోగికి వర్తించదని, ప్రత్యేక పరీక్షల ద్వారా అర్హులైన రోగులను మాత్రమే ఎంపిక చేస్తామని వైద్యులు స్పష్టం చేశారు. ఈ సదస్సులో ప్రో. పరంజ్యోతితో పాటు దేశ వ్యాప్తంగా పేరుగాంచిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. డిల్లీకి చెందిన డా.అమిత్ ధమీజా(సర్ గంగా రామ్ హాస్పిటల్)తో పాటు యశోద హాస్పిటల్స్, ఏఐజీ హాస్పిటల్స్ కు చెందిన పల్మనాలజిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీవోపీడీపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమగ్ర చికిత్సను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నుమాయిష్–2026లో జీహెచ్ఎంసీకి 'బెస్ట్ స్టాల్' అవార్డు

### స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు గుర్తింపు

- చేతి వస్తువులకు ప్రజల నుంచి మంచి స్పందన
- కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ హర్షం.. అభినందనలు
- ప్రశంసా పత్రం, మెమెంటో స్వీకరణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** నాంపల్లి నుమాయిష్–2026 ఎగ్జిబిషన్‌లో జీహెచ్ఎంసీకి 'బెస్ట్ స్టాల్' అవార్డు లభించింది. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో 35 స్వయం సహాయక సంఘాల మహిళలు తమ చేతి వస్తువులను ప్రదర్శించి, అమ్మకాలు జరిపారు. ఈ ఉత్పత్తులన్నీ చేతితో తయారు చేసినవే కావడం విశేషం. నుమాయిష్‌కు వచ్చిన వేలాది మంది ప్రజలు ఈ స్టాల్‌ను సందర్శించి మంచి స్పందన కల్పించారు. నుమాయిష్ నిర్వాహకులు జీహెచ్ఎంసీ కమిషనర్ పేరుతో ప్రశంసా పత్రం అందజేశారు. గోషామహల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి ప్రశంసా పత్రం, మెమెంటో స్వీకరించారు. ఈ అవార్డు రావడం పట్ల కమిషనర్ ఆర్వీ కర్ణన్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్పత్తులు ప్రదర్శించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పట్టణ సామాజిక అభివృద్ధి అధికారులకు అభినందనలు తెలిపారు.

## ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిక..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో విజయదంకా మోగించిన కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్ల చేరికల పర్వం కొనసాగుతుంది.శుక్రవారం వెలువడిన ఫలితాల్లో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నరాల శేఖర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు కుమ్మరి శిరీష శ్రీనివాస్, ఎల(టైలర్) శ్రీనివాస్ లు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజల మార్పు ఆకాంక్షకు నిదర్శనమన్నారు.అభివృద్ధి,పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# పార్కులకు హైడ్రా ప్రాణం

- భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులకు ఫెన్సింగ్
- గుడిమల్కాపూర్‌లో 1452 గజాల పార్కు రక్షణ
- మొత్తం 3712 గజాలు.. రూ.37 కోట్ల విలువ
- స్థానికుల సంబరాలు.. ర్యాలీలు, నినాదాలు

## ఒకే రోజు 7 పార్కులకు హైడ్రా విముక్తి



**హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :**
ప్రాణవాయువును అందించే పార్కుల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తోంది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగి వాటిని రక్షిస్తోంది. ఇలా శుక్రవారం ఒకే రోజు.. ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడి 2260 గజాల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మరో చోట 1452ల గజాలకు పైగా ఉన్న పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి విడిపించింది. మొత్తమ్మీద 3712 గజాల విస్తీర్ణంలో పార్కులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్దయెత్తున బయటకు వచ్చి పార్కుల కబ్జాలను తొలగించిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుల ముందు ఫొటోలు దిగారు. భారీ ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు. ఈ పార్కుల విముక్తికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

### ఒకే కాలనీలో 6 పార్కులు..


మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, జీడిమెట్ల విలేజ్, సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ లే ఔట్‌ను 1968లో వేశారు. 80 ఎకరాలలో 810 ప్లాట్లతో ఈ లే ఔట్ వేసి.. ఇందులో 10 పార్కులను కేటాయించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించేందుకు వేసిన హైటెన్షన్ కరెంటు లైను ఈ లే ఔట్ మీదుగా వెళ్లింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పలు పార్కులను అప్పటి లే ఔట్ వేసిన వారు కేటాయించారు. వేరే లైను ద్వారా పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించడంతో భాగ్యలక్ష్మి కాలనీ మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లను 20 సంవత్సరాల క్రితం తొలగించారు. ఇక అక్కడి నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. స్థానిక అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖలకు చెందిన వారితో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించారు. పార్కు స్థలాలుగా నిర్ధారించుకున్నా రు. శుక్రవారం వరుసగా ఉన్న 6 పార్కుల ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడి కాలనీవాసులు సంబరాలు చేసుకు న్నారు. బోర్డుల ముందు నిలబడి ఫొటోలు దిగారు. హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు.

### గుడిమల్కాపూర్‌లో పార్కు కబ్జాలకు విముక్తి

హైదరాబాద్ జిల్లా, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలో ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట 10 ఎకరాల్లో 83 ప్లాట్లతో దశాబ్దాల క్రితం లేఔట్ వేశారు. ఇందులో 79, 80, 81 నంబర్లతో ఉన్న ప్లాట్లు గుంతలో ఉన్నాయి. లే ఔట్‌ను రివైజ్ చేసి ఇక్కడ ప్లాట్లున్నవారికి వేరే చోట కేటాయించారు. గుంతలా ఉన్న 1500ల గజాల స్థలాన్ని పార్కుగా పేర్కొన్నారు. ఆ గుంత పూడ్చి పార్కును చేయడంలో జాప్యం అవ్వడంతో అది కబ్జాదారులకు వరంగా మారింది. తర్వాత నిర్మాణాలు పెరగడంతో ఆ గుంతలు పూడ్చడం పెద్ద పనికాలేదు వారికి. ఇక అక్కడి నుంచి ఆ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఒకరు ఇసుక వ్యాపారం చేసుకుంటుండగా.. మరొక వ్యక్తి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. మరొకరు కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ పార్కును కాపాడాలని 2018లో జీహెచ్ఎంసీని అక్కడి నివాసితులు కోరారు. అయినా ప్రయోజనంలేదని వాపోయారు. ఈ అంశాలన్నిటినీ పేర్కొంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి.. పార్కు స్థలంగా హైడ్రా అధికారులు నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఆక్రమణదారులను ఖాళీచేయించి సుమారు 1452 గజాల మేర హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

# మున్సిపల్ పీఠానికి అడుగు దూరంలో కాంగ్రెస్

- ఏ పార్టీకి మెజారిటీ సిట్లు ఇవ్వని ఓటర్లు
- చైర్మన్ ఎన్నికలో కీలకం కానున్న స్వతంత్ర కౌన్సిలర్లు
- అధికార పార్టీ వైపు చూస్తున్న ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు..?



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :**
వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో పట్టణ ఓటర్లు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ కట్టబెట్టలేదు. 13 కౌన్సిలర్లతో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ మున్సిపల్ పీఠానికి అడుగు దూరంలో నిలిచిపోయింది. 28 వార్డులుండగా మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి 15 మంది కౌన్సిలర్లు ఉండాలి. కాంగ్రెస్ పార్టీకి 13 మంది కౌన్సిలర్లు ఉండగా, బిజెపికి 8 మంది కౌన్సిలర్లు, బిఆరెఎస్ కు 5 మంది కౌన్సిలర్లు,

స్వతంత్ర అభ్యర్థులు 2 గెలుపొందారు.మున్సిపల్ పై జెండా ఎగురా వేయాలంటే ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారానున్నారు. ప్రతిపక్ష పార్టీల నుండి అధికార పార్టీలోకి వెళ్లేందుకు కొందరు చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం కొనసాగుతుంది. కాగా ఇద్దరు స్వతంత్రులతో కలిపి ఎక్స్ ఆఫీషియో ఓటుతో చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్తోంది.

**పార్టీల వారిగా గెలుపొందిన అభ్యర్థులు.**


కాంగ్రెస్ పార్టీ నుండి 1 వార్డులో సంగే హన్మవ్వ,3 వార్డ్ గుడిసె సంతోష,4 వార్డ్ తోట రాజు, 6 వార్డ్ కాచ శ్రీనివాస్,10 వార్డ్ సిరిగిరి సంగీత,12వార్డ్ రామతీర్థపు కృష్ణవేణి,13వార్డ్ మూడపల్లి నిలమ్మ,14 వార్డ్ తూము మధు,15 వార్డ్ పుల్కమ్ రాజు, 18 వార్డ్ కొండ రాజశేఖర్, 22 వార్డ్ యిప్పపుల మమత, 24 వార్డు అన్నారం శ్రీనివాస్, 25 వార్డ్ కొక్కుల బాలకృష్ణ..

**బిజెపి పార్టీ నుండి..** 8 వార్డ్ మైలారం శ్రీనివాస్,16 వార్డ్ వంగల శ్రీనివాస్, 17 వార్డ్ కొండ్లపు ముత్యం,20 వార్డ్ కుమ్మరి శంకర్,22 బోనాల సాగరిక,26 వార్డ్ మామిండ్ల అమర్న,27 వార్డ్ రేగుల రేణుక, 28 వార్డ్ ప్రతాప హిమబిందు..

**బిఆరెఎస్ పార్టీ నుండి** 2 వార్డ్ ఏనుగు జ్యోతిరెడ్డి,5 వార్డ్ వాసల లావణ్య, 9 వార్డ్ రామతీర్థపు మాధవి, 11వార్డ్ వంగల అనిత, 21వార్డ్ నరాల శేఖర్, స్వతంత్ర అభ్యర్థులు 7 వార్డ్ టైలర్ శ్రీనివాస్,19 వార్డ్ కుమ్మరి శిరీషలు గెలుపొందారు.

# హత్తిగూడ కుంట, ప్రభుత్వ భూములపై అక్రమ వెంచర్


- వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతల డిమాండ్
- స్థానిక ఎంఆర్‌వోకు వినతిపత్రం



**అబ్దుల్లాపూర్‌మెట్ , ఫిబ్రవరి 13(జనం సాక్షి ):**
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పరిధిలోని హత్తిగూడ రెవెన్యూ సర్వే నెం.19 మరియు హయత్నగర్ మండలం బాగ్ హయత్నగర్ సర్వే నెం.190లో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పురాతన కుంటను, దానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అక్రమ వెంచర్ చేసి విల్లాల నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపించారు.వివరాల ప్రకారం, ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీల వర్షపు నీరు ఈ కుంటలోకి చేరుతుంది. అయితే కుంట అలుగు ద్వారా ఆయకట్టుకు వెళ్లే నాలాను సుమారు 10 అడుగుల మేర మట్టి పోసి పూడ్చివేసి, ట్యాంక్ ఓవర్‌ఫ్లో నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వలన భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో కాలనీలు ముంపుకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా నాలా పక్కన ఉన్న సర్వే నెం.12లోని 1.5 ఎకరాలు, సర్వే నెం.19లోని 1.00 ఎకరం, అలాగే 2.5 ఎకరాల బిల్ల దాఖల ప్రభుత్వ భూమి కలిపి మొత్తం సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమితో కలిపి అక్రమంగా వెంచర్ వేసి విల్లాల నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ అంశంపై ఇప్పటికే 2023లో మండల రెవెన్యూ అధికారికి, ఆర్డీవోకు, కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదులు చేసినప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు. కొంతకాలం పనులు నిలిపివేసినా, ప్రస్తుతం మళ్లీ యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, జెఎన్ఎన్‌యుఆర్ఎం శాఖ కార్యదర్శి వర్త్య రమేష్ నాయక్, ధూపం నిరంజన్ తదితరులు పాల్గొని స్థానిక ఎంఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వ భూమిపై వెంటనే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఏ.డి. సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని, కుంట అలుగు నాలాను పునరుద్ధరించి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని సిపిఐ నేతలు డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించడంతో పాటు భవిష్యత్తులో ముంపు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 ఫిబ్రవరి 2026

# మాయగాళ్లున్నారు.. జాగ్రత్త బిడ్డ



## మోసపోయి ఠాణా మెట్లెక్కుతున్న యువతులు

### ప్రేమపేరిట వల..ఆపై అఘాయిత్యాలు


- స్మార్ట్ ఫోన్లతోనూ వాటిల్లుతున్న పెనుముప్పు
- గద్వాల జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

రాజోలి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :

**ప్రేమ పేరుతో కొందరు..పరిచయాన్ని ఆసరా చేసుకొని మరికొందరు యువతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్మార్ట్‌గా వల విసిరి చాటింగ్‌లతో మొదలుపెట్టి ముగ్గులోకి దింపి అవసరం తీరాక మొహం చాటేస్తున్నారు. ఈ స్నేహం, ప్రేమ ముసుగులో జరుగుతున్న దారుణాన్ని తెలుసుకోలేక ఎందరో అమాయకులైన అమ్మాయిలు నిండా మునుగుతున్నారు. తల్లిదండ్రుల అతిగారాబమో, అతి నమ్మకమో, పట్టించుకోనితనం వల్లో యూత్ ట్రాక్ తప్పుతోంది. చివరికి పోలీస్‌స్టేషన్ మెట్లెక్కి బోరున విలపిస్తూ జరిగిన మోసాన్ని తలుచుకుంటూ బాధపడుతున్నారు. ఇలా ఒకటికాదు రెండు కాదు..నిత్యం పదులసంఖ్యలో కేసుల దాకా వెళ్తుండగా, పరువుపోతుందని మిన్నకుండిన వారు ఎందరో...**

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల వాడకం అనేది తప్పనిసరిగా మారింది. కానీ అవసరాన్ని మించి వాడకం వలన చెడు దారులు పట్టిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో యువతి యువకుల మధ్య పరిచయం.. ఇంకేముందు వాట్సాప్‌లో చాటింగ్‌లు.. డేటింగ్‌లు..కొద్దిరోజుల తర్వాత డీప్‌గా లవ్ చేస్తున్నాని నమ్మించడం.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. లైంగిక వాంచ తీర్చుకోవడం.. ఆ తర్వాత వద్దులే అని వదిలించుకోవడం.. బాధిత అమ్మాయిలను జీవితాంతం వెంటాడే మానని గాయం.. ఇక మరో విధంగా రిలేషన్స్ పేరుతో, క్లాస్‌మెట్..ఫ్రెండ్ షిఫ్‌పేరుతో దుర్మార్గులు స్మార్ట్‌గా ట్రాప్ చేస్తూ.. అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వైద్య, ఇంజినీరింగ్, లా, పీజీ, డిగ్రీ ఉన్నత చదువులు చదివిన అమ్మాయిలు కూడా ఏమి ఆలోచించంచకుండా దుర్మార్గుల చేతుల్లో చిక్కి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొవిడ్ ఎఫెక్ట్‌తో ఆన్‌లైన్ క్లాస్‌ల వల్ల స్మార్ట్‌ఫోన్ల వాడకం కొందరి ఆడపిల్లల జీవితాలను నాశనం చేస్తున్నది. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఘటనలు జోగులాంబ గద్వాల జిల్లా పోలీసుల పరిధిలో వెలుగుచూశాయి.

**ప్రేమ పేరుతో మోసపోయి జూనియర్ వైద్యురాలు సుసైడ్**



జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలానికి చెందిన యువతి (23) 2020లో సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం జూనియర్ డాక్టర్గా పని చేస్తోంది. ఇక్కడే జనరల్ మెడిసిన్ చదువుతున్న సికింద్రాబాద్ అల్వాలకు చెందిన ప్రణయ్ తేజతో గత సంవత్సరం పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వివాహం చేసుకుంటానని అతడు నమ్మించి సన్నిహితంగా మెలిగాడు. తర్వాత కులం భేదాన్ని కారణంగా చూపించి వివాహం చేసుకోవడానికి నిరాకరించాడు. యువతి తీవ్ర మనోవేదనకు గురైంది. జనవరి 3న కళాశాల వసతి గృహంలో గడ్డి నివారణకు వాడే మందును ఇంజెక్షన్ చేసుకొంది. ఆమెను హైదరాబాద్ నిమ్స్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

**ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య**

గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన రఘునాథ్ గౌడ్, ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన యువతి ప్రియాంక హైదరాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో క్లాసులకు వెళ్తున్న సమయంలో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆమెను పెళ్లిచేసుకుంటానని రఘునాత్ ఆమెను నమ్మించాడు. ఈ క్రమంలో పోలీస్ కానిస్టేబుల్ జాబ్ కొట్టాడు. గద్వాల జిల్లా మల్దకల్లో కానిస్టేబుల్ గా చేరాక ప్రియాంకను దూరం పెడుతూ వస్తున్నాడు. మార్పును గమనించిన ఆమె పెళ్లి చేసుకుందామని అడిగే సరికి మరింత దూరం పెట్టాడు. దీంతో ప్రియుడి ఇంటి ముందు ప్రియాంక నిరసనకు దిగింది. ఫలితం లేకపోవడంతో గట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి రఘునాథ్ ను రిమాండ్కు తరలించారు. అధికారులు అతడిని సస్పెండ్ చేశారు.

**యువతి ప్రాణం విలువ రూ.9లక్షలు**

గద్వాల జిల్లాకు చెందిన వీరప్ప అనే ఓ యువకుడు ప్రేమ పేరుతో సునంద (23) అనే యువతి వెనకాల పడ్డాడు. నువ్వంటే నాకు చాలా ఇష్టమని, నువ్వు లేకుండా నేను ఉండలేనని, నిన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో.. ఆ యువతి ఇతడ్ని ప్రేమించింది. ఇలా కొంతకాలం వరకూ ఈ ప్రేమ వ్యవహారం సజావుగానే సాగింది. కానీ.. పెళ్లి టాపిక్ వచ్చేసరికి వీరప్ప ముఖం చాటేశాడు. చస్తే నిన్ను పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పాడు. దీంతో అవమానంగా భావించిన సునంద ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లారు. వీరప్ప మోసం చేయడం వల్లే చనిపోయింది కాబట్టి.. అతని చేత రూ.9 లక్షల పరిహారం కట్టించారు. తొలుత అతడు ఒప్పుకోలేదు కాదు. గ్రామ పెద్దలు బలవంతం చేయడంతో, అతడు ఆ పరిహారం ఇచ్చాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

**అవగాహన కల్పిస్తున్నాం**

చిన్న వయసులో కలిగే ఆకర్షణలు తరచుగా నిజమైన ప్రేమలు కావు అవి, శారీరక మానసిక మార్పుల వల్ల కలిగే తాత్కాలిక వ్యామోహాలు. బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలి. చదువుపై మాత్రమే దృష్టి పెట్టి అవసరమైన వాటికి మాత్రమే సెల్ ఫోన్స్ ఉపయోగించాలి. షీటీం ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు సదస్సులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు, విద్యార్థినిలు భయపడకుండా డయాల్ 100కు సమాచారం ఇవ్వాలి.

-శాంతినగర్ సీఐ, టాటాబాబు



# ఆలియాబాద్‌లో కాంగ్రెస్ ఆధిక్యం

## మూడుచింతలపల్లి, ఎల్లంపేట్‌లో బీఆర్ఎస్

కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్.. గెలుపొందినవారికి ధ్రువపత్రాలు

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన ఓటర్లకు కృతజ్ఞతలు



మేడ్చల్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి, సాధారణ ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశలో పారదర్శకతకు ప్రాధాన్యమిచ్చి కౌంటింగ్ చేపట్టారు. ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లు తెరిచి బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతి టేబుల్ వద్ద సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు జరిగింది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, తర్వాత సాధారణ బ్యాలెట్ పత్రాల లెక్కింపు పూర్తయింది. మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో, గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సాగింది. మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 వార్డులు గెలుచుకుని ఆధిక్యం సాధించింది. కాంగ్రెస్ 9 వార్డులు, బీజేపీ ఒక వార్డు గెలుచుకున్నాయి. ఆలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ 8 వార్డులతో ముందంజలో నిలిచింది. బీఆర్ఎస్ 7 వార్డులు, బీజేపీ 3 వార్డులు, బీఎస్పీ ఒక వార్డు గెలుచుకోగా, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 12 వార్డులతో ఆధిక్యం సాధించగా, కాంగ్రెస్ 8 వార్డులు, బీజేపీ 4 వార్డులు గెలుచుకున్నాయి.

ఫలితాల నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల్లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా బందోబస్తు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. గెలుపొందిన అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను విజయవంతం చేసిన ఓటర్లకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన సిబ్బంది, పోలీసులు, సంబంధిత శాఖల అధికారులకు అభినం దనలు అందించారు. ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడం జిల్లాకు గౌరవకార ణమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారని తెలిపారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి ప్రజల సహకా రం అవసరమని అన్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# ఎరువుల ఉత్పత్తికి సంపూర్ణ సహకారం

## ఎరువుల కర్మాగారం, జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



గోదావరిఖని, జనంసాక్షి : నిర్దేశిత లక్ష్యం మేరకు ఎరువుల ఉత్పత్తి చేసి రాష్ట్రానికి సరఫరా చేసేందుకు అవసరమైన సంపూర్ణ సహాయసహకారాలు జిల్లా యంత్రాంగం ఆర్ఎఫ్‌సిఎల్‌కు అందిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగుండంలోని ఎరువుల కర్మాగారం, గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఆర్ఎఫ్‌సిఎల్ ప్లాంట్‌లో జిల్లా కలెక్టర్ సెంట్రల్ కంట్రోల్ రూమ్ ప్రిల్లింగ్ టవర్, బ్యాగింగ్,లోడింగ్ అండ్ డిస్పాచ్ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రస్తుత యాసంగి సీజన్‌లో తెలంగాణ రాష్ట్రానికి 2,14,223 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినందుకు ఆంఎఫ్సిఎల్ అధికారులను కలెక్టర్ అభినందించారు. రైతులకు వ్యవసాయ సీజన్‌లో సమయానుకూలంగా.. తగిన పరిమాణంలో యూరియా అందుబాటులో ఉంచినందుకు సంస్థ యాజమాన్యం..సిబ్బంది చేసిన కృషిని ప్రశంసించారు.ఉత్పత్తి, రవాణా పరిస్థితులను సమీక్షించిన అనంతరం, పీక్ డిమాండ్ సమయంలో తెలంగాణ రైతులకు యూరియా నిరంతర సరఫరా జరుగేలా ప్లాంట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఎఫ్సిఎల్ యాజమాన్యం పూర్తి సహకారం అందిస్తామని, స్థిరమైన ఉత్పత్తి.. సమయపాలిత ఎరువుల సరఫరా ద్వారా రైతు సమాజానికి మద్దతుగా పనిచేస్తామని పునరుద్ఘాటించింది. అనంతరం గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సందర్శించిన కలెక్టర్ గ్రౌండ్ ఫ్లోర్ జరుగుతున్న రిన్నోవేషన్ పనులను పరిశీలించారు.ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులు నిలబడి వేచి చూసే అవసరం రాకుండా అదనపు కుర్చీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.ఆసుపత్రి ప్రాంగణంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడ దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.డ్రెస్ స్టోర్ నందు ఎక్కడ కూడా మందుల కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలని, అవసరమైన రాక్స్ ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట వైద్యులు డాక్టర్ రాజు, డాక్టర్ అరుణ కృపాభాయ్, టిజి ఎంఐడిసి ఈఈ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సజావుగా మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

## కౌంటింగ్ కేంద్రాలను కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

గోదావరిఖని, జనంసాక్షి : జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు కౌంటింగ్ సజావుగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల, రామగుండంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరుగుతుందని అన్నారు.ప్రతి డివిజన్ సంబంధించి ఒక టేబుల్ కేటాయించి కౌంటింగ్ సజావుగా జరుగుతుందని అన్నారు.కౌంటింగ్ ప్రక్రియ పూర్తిస్థాయిలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో నిబంధనలు ప్రకారం కౌంటింగ్ సజావుగా జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కౌన్సిలర్లు,ఆర్వోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీకి న్యాయవాదులు వినతిపత్రం

## వన్‌టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని

గోదావరిఖని, జనంసాక్షి : ఈ నెల 10న రాత్రి 10 గంటల సమయంలో న్యాయవాది మార్కాపురం తిలక్‌పై పోలీసుల ధమనకాండ..దాడిని నిరసిస్తూ రెండవరోజు (శుక్రవారం) గోదావరిఖని బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు.బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం తీర్మానం ప్రకారం న్యాయవాది మార్కాపురం తిలక్‌పై దాడి చేసిన వన్ టౌన్ సీఐ గన్‌మ్యాన్, న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన గోదావరిఖని వన్‌టౌన్ సిఐపై చర్య తీసుకోవాల్సిందిగా అధిక సంఖ్యలో న్యాయవాదులు తరలి వెళ్లి రామగుండం పోలీస్ కమిషనర్‌ను కలిసి వినతీపత్రం ఇచ్చారు. దీనికి సీపీ సానుకూలంగా స్పందించారు.తదనంతరం బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన న్యాయవాదుల విస్తృతస్థాయి సమావేశంలో మార్కాపురం తిలక్ న్యాయవాదిపై దాడి చేసిన వన్ టౌన్ గన్‌మ్యాన్,న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వన్‌టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.వారిపై చర్యలు తీసుకునే వరకు విధులను బహిష్కరణకు పిలుపునివ్వడం జరిగిందన్నారు.పై విషయంలో సోమవారం లోగా రామగుండం పోలీస్ కమిషనర్ నుండి సరియైన స్పందన రాకపోతే సోమవారం విధులకు దూరంగా ఉండి తదుపరి కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

సింగరేణి సంస్థలో గతంలో ఏదైనా ప్రమాదం జరిగితే లోతైన విచారణ జరిపి, మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకునేవారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారిందని, అధికారుల తీరు కూడా దానికతోడు మారిపోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యోగులకు అండగా జీహెచ్ఎంసీ

- పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక ఫోకస్
- ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : క్యాన్సర్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అందుబాటులో సరైన సదుపాయాలు లేక ఆరోగ్య పరీక్షలు నిర్లక్ష్యం చేస్తున్నారు కొందరు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ తమ ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికులు, సిబ్బందినీ క్యాన్సర్ బారిన పడకుండా, క్యాన్సర్ నుంచి సంరక్షించేందుకు నడుం బిగించింది. ఈ కార్యక్రమంలోనే పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులకు కార్కినోస్ హెల్త్ కేర్ భాగస్వామ్యంతో జీహెచ్ ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జీహెచ్ఎంసీ మొబైల్ ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం ను ఏర్పాటు చేసింది.

మహిళలకు ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, పురుషులకు ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ భయాలు తొలగించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం. ప్రమాదస్థాయిలో ఉన్నవారిని గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చెయ్యడం ద్వారా వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం, వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతుంది. ఇండియన్ క్యాన్సర్ సొసైటి దీనికి ఫండింగ్ చేస్తుంది. ఇప్పటికే 20 సర్కిల్‌లను కవర్ చేశారు. కమిషనర్ ఆర్ వి జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో నిర్వహిస్తున్న శిబిరాన్ని పరిశీలించారు. మొబైల్ ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణను కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రభావంతంగా ప్రాథమిక పరీక్షలు జరిగేలా అధికారులను దిశా నిర్దేశం చేస్తున్నారు

**ఎంతో ప్రయోజనకరం :**

**శైలజ, జూనియర్ సహాయకులు, హెల్త్ సెక్షన్, జీహెచ్ఎంసీ**

కార్కినోస్ హెల్త్ కేర్ భాగస్వామ్యంతో జీహెచ్ఎంసీ ఉద్యోగులకు మొబైల్ ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తుంది. పారిశుద్ధ్య కార్మికుల ప్రత్యేక ఫోకస్ గా శిబిరం నిర్వహిస్తుంది. ప్రాథమిక స్థాయిలోనే వ్యాధులు గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుంది. పరిశుద్ధ కార్మికులకు ఈ శిబిరం ఎంతగానో ప్రయోజనకరం

**అందరూ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకొనేలా ప్రోత్సహిస్తున్నాం :**

**జీ ప్రమీల, పారిశుద్ధ కార్మికురాలు, మల్కపేట**

పారిశుద్ధ కార్మికులకు, ఉద్యోగులకు జిహెచ్ఎంసి ప్రత్యేక చొరవతో మొబైల్ ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం నిర్వహించడం హర్షణీయం. మా ఆరోగ్యం పట్ల జిహెచ్ఎంసికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం. మేము జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో పరీక్షలు చేసుకున్నాం. సహచర పారిశుద్ధ కార్మికులను కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాల్సిందిగా ప్రోత్సహిస్తున్నం.

**జీహెచ్ఎంసీకి ధన్యవాదాలు :**


**ఏ లక్ష్మమ్మ, పారిశుద్ధ కార్మికురాలు, మల్కపేట**

ఈ శిబిరం మాకు ఎంతో మేలు చేస్తుంది. క్యాన్సర్ పై చక్కగా అవగాహన కల్పించారు. మాలో ఉన్న భయాన్ని సిబ్బంది తొలగించారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ కు ప్రభావంతమైన చికిత్స అందించవచ్చు అని సిబ్బంది తెలియజేశారు. మా ఆరోగ్యం కోసం జిహెచ్ఎంసి తీసుకున్న చొరవకు ధన్యవాదాలు.

# కాషాయ జెండా ఎగరేస్తాం

## భాజాప్తా చెబుతున్నా...హైదరాబాద్‌పై

- తెలంగాణలో బీజేపీ తొలిసారి కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేశాం
- మోదీపై నమ్మకంతో గెలిపించిన కరీంనగర్ ప్రజలకు శిరస్సు వంచి వందనం చేస్తున్నా..
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కామెంట్స్



కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) : శుక్రవారం రోజు నాకు పట్టలేని సంతోషం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ఎన్నో కుట్రలు చేసింది. ఓటుకు రూ.7 వేలు ఇచ్చాయి. చివరకు బీజేపీ అభ్యర్థులకు, నాయకు లను ప్రలోభ పెట్టేదుకు అనేక కుట్రలు చేసింది. పాచిక పారలేదు. అయినా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన బడే భాయ్ ఎంఐఎం ఓవైసీ బ్రదర్స్ ను పిలిచి రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మ లేదు. తెలంగాణలో తొలిసారి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేసి రికార్డు సృష్టించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. "కరీంనగర్ తీర్పు స్ఫూర్తితో భాజాప్త చెబుతున్నా.... హైదరాబాద్‌పై కాషాయ జెండా ఎగరేయబోతున్నాం."అని చెప్పా రు. "ఒవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకు రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేసి ఒక ముక్క ఒవైసీకి రాసిచ్చారు. అదే రేవంత్ రెడ్డి పాలిట మరణ శాసనం కాబోతోంది. హైదరాబాద్ తోపాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లపై కాషాయ జెండా ఎగరేయబోతున్నం. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా? అని ఎదురు చూస్తున్నాం"అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావుసహా స్థానిక బీజేపీ నేతలతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండాను ఎగరేయడం చాలా గొప్ప విషయం. ఈ అద్భుత అవకాశాన్ని మాకు అందించి మోదీ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నామని ఈ సంతోషం పట్టలేనిదని పేర్కొన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని కలిసికట్టుగా పనిచేశాం. జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మార్గదర్శకత్వంలో మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాం అన్నారు.

బండి సంజయ్ హిందుత్వమే మాట్లాడతారు. అభివృద్ధి మాట్లాడరు. కరీంనగర్ కు నయాపైసా కూడా తేలేదంటూ పిచ్చి కూతలు కూసిన వాళ్లకు చెంప పెట్టు తీర్పు ఇచ్చారు. కర్రు కాల్చి వాతపెట్టారు. కరీంనగర్ ప్రజలను ఆదుకునేది, అభివృద్ధి చేసేది మోదీ ప్రభుత్వమేనని నమ్మి ఆదరించారు. 5 ఏళ్లలో కరీంనగర్ అభివృద్ధి ఏ విధంగా చేస్తామో చేతల్లో చూపిస్తామన్నారు. కరీంనగర్ అభివృద్ధికి రూ.1500 కోట్లు మోదీ ప్రభుత్వం ఖర్చు చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నయాపైసా ఇయ్యలేదు. ప్రజలు బేరీజు వేసి ఆశీర్వదించారు. నేను ఒక సామాన్య కార్యకర్తను. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన. రెండుసార్లు కార్పొరేటర్ గా గెలిచిన. రెండుసార్లు ఎంపీగా గెలిచిన. బీజేపీ నాయకత్వం నాకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. కేంద్ర మంత్రిగా అవకాశం కల్పించిందన్నారు. కరీంనగర్ ప్రజలు బీజేపీనే నమ్మారని, నరేంద్రమోదీపై విశ్వాసంతోనే కేంద్ర ప్రభుత్వమే నిధులిస్తుందనే నమ్మకంతో మోదీని చూసి బీజేపీకి ఓటేసి గెలిపించారు. ఇప్పుడు 30 సీట్లు గెలిచినమని, కొన్ని కారణాలవల్ల మరో 3గురికి సీట్లు ఇవ్వలేకపోయినా కాషాయ జెండా కప్పుకుని తిరిగి గెలిచారని, మరో 3 గురు ఇండిపెండెంట్లు వస్తున్నారని, అందరూ షాక్ తినేలా ఇతర పార్టీల్లో గెలిచిన అభ్యర్థులు కూడా బీజేపీలోకి రాబోతున్నరు. మాజీ మేయర్ సునీల్ రావు కు ఫోన్ చేసి బీజేపీకి మద్దతిస్తామని స్వచ్ఛందంగా చెబుతున్నారు.

వారందరి సహకారం తీసుకుంటాం. అభివృద్ధే లక్ష్యంగా అందరినీ కలుపుకుపోతామని తెలిపారు. కరీంనగర్ ఎంఐఎం కాంగ్రెస్ తో సంసారం చేస్తోంది. బీఆర్ఎస్ కు కన్ను కొట్టింది. ప్రజలు గమనించారు. గతంలో 7 సీట్లున్న ఎంఐఎంను 3 సీట్లకే పరిమితం చేశారు. ఎంఐఎం పార్టీ కార్యాలయ డివిజన్ లో ఆ పార్టీని బద్దలు కొట్టినం. ఎంఐఎం కు ఆదరణ ఉన్న కాశ్మీర్ గడ్డ వంటి ప్రాంతాల్లోనూ బీజేపీ సత్తా చాటామన్నారు. మొత్తం 66 డివిజన్లలో సర్వే చేసి 56 మందికి కట్టర్ బీజేపీ కార్యకర్తలకే సీట్లు ఇచ్చినం. ఇయాళ 33 మంది గెలిచారు. 100 ఓట్లలోపు తేడాతో మరో 10 మంది బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారు. పార్టీని నమ్ముకుని, చెప్పిన మాట విని నామినేషన్లను ఉపసంహరించుకుని పనిచేసిన బీజేపీ నాయకులకు భవిష్యత్తులో మంచి అవకాశాలిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

## సంగారెడ్డి, సదాశివపేటలో

# కాంగ్రెస్ హవా

- విజయంపై జగ్గారెడ్డి హర్షం



**సంగారెడ్డి, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సంగారెడ్డి మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 22 వార్డుల్లో విజయం సాధించింది. అలాగే బీఆర్ఎస్ 10, బీజేపీ 2 స్థానాల్లో గెలవగా.. ఇతరులు 4 వార్డుల్లో గెలిచారు. దీంతో ఛైర్మన్ పదవి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది. సదాశివపేటలో మొత్తం 26 వార్డుల్లో కాంగ్రెస్ 16, బీఆర్ఎస్ 8 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కో స్థానం దక్కించుకున్నారు. ఈ విజయంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, ఘనమైన విజయాన్ని అందించిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 'పార్టీ అభ్యర్థుల విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. అలాగే 'నేను ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను' అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి సహకారంతో ఈ రెండు మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ హామీ ఇచ్చారు. కాగా.. ఈ రెండు మున్సిపాలిటీల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం చేసి అభ్యర్థుల విజయానికి కీలక పాత్ర పోషించారు. బీఆర్ఎస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ కాంగ్రెస్ పైచేయి సాధించింది.

## పర్యావరణ పరిరక్షణ దిశగా

# తెలంగాణ ఆర్టీసీ అడుగులు

- ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఆర్టీసీ రికార్డ్
- ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి నేతృత్వంలో అభివృద్ధి దిశలో తెలంగాణ ఆర్టీసీ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరవాసులను అనారోగ్యానికి గురి చేసే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్‌లో కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇప్పుడు సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే 'రెట్రో ఫిట్మెంట్' సాంకేతికతపై వీసీ, ఎండీ నాగిరెడ్డి దృష్టి సారించారు. ఇందులో భాగంగా 'రెట్రో ఫిట్మెంట్' కోసం 15.09.2025 టెండర్లు పిలువగా 30.09.2025 టెండర్ ప్రక్రియ ముగియడంతో సాయి గ్రీన్ మొబిలిటీ సంస్థకు 200, కల్యాణి పవర్ ట్రైన్ లిమిటెడ్ కు 40 బస్సు లను 'రెట్రో ఫిట్మెంట్' చేసే బాధ్యతను ఆర్టీసీ అప్పగించింది.

2027 నాటికి హైదరాబాద్ ఓఆర్ ఆర్ లోపల 2800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ప్రజా రవాణా పెరగడంతో కాలుష్యం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు తగ్గి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని భావిస్తున్నారు.

ఇప్పటికే నగరంలోని ఆరు డిపోల పరిధిలో 325 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, ఈ ఏడాదిలో మరో 175 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. రాబోయే బస్సుల కోసం అదనంగా 19 డిపోలలో చార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా 10 డిపోలు, 10 చార్జింగ్ కేంద్రాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మౌలిక సదుపాయాల కోసం సుమారు 392 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా.

### సక్సెస్ అయిన ముషీరాబాద్ ప్రయోగం

2023లోనే ముషీరాబాద్ డిపోకు చెందిన ఒక డీజిల్ బస్సును ప్రైవేటు సంస్థ సహకారంతో ఎలక్ట్రిక్ బస్సుగా మార్చారు. ప్రస్తుతం ఈ బస్సు ఉప్పల్ డిపో పరిధిలో విజయవంతంగా నడుస్తోంది. హైదరాబాద్ భవిష్యత్తు కోసం తీసుకొస్తున్న ఈ హరిత ప్రయాణాన్ని ప్రజలు ఆదరించాలని ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి కోరారు. నగర ప్రజా రవాణా రూపురేఖలను మార్చే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బస్ భవన్ లో జరిగిన ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, విజయపుష్ప సాయి గ్రీన్ మొబిలిటీ కల్యాణీ పవర్ ట్రైన్ లిమిటెడ్ ప్రతినిధులు, తదితర సంస్థ అధికారులు, పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో జనసేన బోణీ

- 14వ వార్డులో గెలుపొందిన ఆరూరి విజయలక్ష్మి



**సూర్యాపేట, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** జనసేన పార్టీ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో జనసేన అభ్యర్థి ఘన విజయం సాధించారు. 14వ వార్డులో జనసేన తరఫున పోటీ చేసిన విజయలక్ష్మి ఆరూరి 60 ఓట్ల మెజారిటీతో విజయకేతనం ఎగుర వేసింది. ఈ గెలుపుపై ఇప్పటికే పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. కాగా.. ఈ మున్సిపాలిటీలో మొత్తం 15 స్థానాలకు గానూ 9 వార్డుల్లో కాంగ్రెస్, 5 వార్డుల్లో బీఆర్ఎస్ గెలుపొందగా, ఒక వార్డును జనసేన దక్కించుకుంది. అయితే.. విజయలక్ష్మి గెలుపుతో తెలంగాణలోని జనసేన కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణలో ఇప్పటివరకు ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో కొత్త శక్తిగా ఎదగాలని చూస్తున్న జనసేనకు ఈ గెలుపు ప్రోత్సాహాన్ని ఇస్తోందని అభిమానులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీ విస్తరణపై దృష్టి పెట్టే అవకాశాలు ఉంటాయా అనే అంశాన్ని జనసేన పార్టీ నిర్ణయించాలి.

# జనగామలోనూ తప్పని హంగ్



ఛైర్మెన్ పదవి ఇస్తే మద్దతిస్తానని తెలుపుతున్న స్వతంత్ర అభ్యర్థి

**జనగామ, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో 11 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. జహీరాబాద్, కేసముద్రం, కోహిర్, దేవరకద్ర, అలంపూర్, ఇస్నాపూర్, అమరచింత, జనగామ, ఆసిఫాబాద్, జమ్మికుంట, జిన్నారం, బోధన్, వేములవాడ, గద్వాల, ఆలియాబాద్ లో హంగ్ ఏర్పడింది. హంగ్ నేపథ్యంలో ఈ మున్సిపాలిటీల్లో స్వతంత్రులు కీలకం కానున్నారు. జనగామలో హంగ్ నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మున్సిపాలిటీ కైవసం చేసుకునేందుకు ఇండిపెండెంట్లు కీలకంగా మారారు. దీంతో ఛైర్మన్ పీఠం కోసం నలుగురు స్వతంత్ర అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక మిగిలిన వార్డుల్లో గెలిచిన అభ్యర్థులను పార్టీలోకి చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటాపోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆలియాబాద్ మున్సిపాలిటీలో ఓ అభ్యర్థిని పలువురు వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ 876 వార్డుల్లో గెలుపొందగా.. బీఆర్ఎస్ 462 వార్డుల్లో, బీజేపీ 138 వార్డుల్లో విజయం సాధించింది. ఇక గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకుంది.



## చిట్యాలలో ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ విజయం

**నల్లగొండ, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** రాష్ట్రంలో రెండు కార్పోరేషన్‌లు, 116 మున్సిపాలిటీలకు ఇటీవల పోలింగ్ జరిగింది. ఇవాళ కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. నల్గొండ జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఓ ట్రాన్స్‌జెండర్ విజయం సాధించారు. ట్రాన్స్‌జెండర్ శ్వేత సుధాకర్ చిట్యాల మున్సిపాలిటీలోని 1వ వార్డు నుంచి బరిలో దిగారు. ఎన్నికల ప్రచారంలో శ్వేత సుధాకర్ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధి లక్ష్యంగా సుధాకర్ ఇచ్చిన హామీలు ఓటర్లను ఆకట్టుకున్నాయి. దాంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను కాదని ఓటర్లు శ్వేత సుధాకర్‌ను గెలిపించుకున్నారు.

# పటాన్‌చెరులో చక్రం తిప్పిన గూడెం

- ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ గెలుపు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 13 (జనంసాక్షి) :** పఠాన్‌చెరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ జోరు కొనసాగుతోంది. ఈ నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో ఏ ఒక్క చోట కూడా కాంగ్రెస్‌కు మెజార్టీ వార్డులు దక్కలేదు. గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలు బీఆర్ఎస్ కైవసం అయ్యాయి. గుమ్మడిదలలో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపొందగా, గడ్డపోతారంలో కూడా స్పష్టమైన ఆధిక్యంతో పార్టీ విజయం సాధించింది. మిగిలిన మూడు మున్సిపాలిటీలైన ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారంలోనూ బీఆర్ఎస్‌కు అత్యధిక వార్డులు దక్కాయి. మున్సిపల్ ఎన్నికల్లో పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి చక్రం తిప్పారు. మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యే అనుచరులు కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరకుండానే ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బీఆర్ఎస్ గెలుపునకు విస్తృతంగా కృషి చేశారు. ఆయన మద్దతుతోనే బీఆర్ఎస్ ఈ ఐదు మున్సిపాలిటీల్లో ఆధిపత్యం సాధించినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# మున్సిపల్ ఫలితాల్లో కవిత సంచలనం

- వడ్డేపల్లి మున్సిపాలిటీ జాగృతి కైవసం
- ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ కింద పోటీ చేసి విజయం



**గద్వాల, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** తెలంగాణలోని మున్సిపాలిటీ ఫలితాల్లో సంచలనం నమోదయ్యింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఇప్పటికే చాలా మున్సిపాలిటీల ఫలితాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఖాతాలో ఒక మున్సిపాలిటీ చేరింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని కవిత పార్టీ అయిన తెలంగాణ జాగృతి పార్టీ కైవసం చేసుకుంది. తెలంగాణ జాగృతి పార్టీ అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింబల్ పై పోటీ చేసిన విషయం తెలిసిందే. జాగృతి పార్టీ నేత వాడేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ అభ్యర్థులు ఎనిమిది స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ సింబల్‌తో పోటీ చేసి విజయం సాధించారు. మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులు ఉండగా.. కవిత జాగృతి పార్టీ అభ్యర్థులు ఎనిమిది స్థానాల్లో, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు చెరో వార్డులో విజయం సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఘన విజయం సాధించింది. ఏఐఎఫ్‌బీ తరఫున పోటీ చేసిన కీలక అభ్యర్థి శ్రీను గత నెల రోజుల కింద మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత వెంట ఉన్నారు. ఆమెతో కలిసి పని చేశారు. అయితే.. వడ్డేపల్లి మున్సిపాలిటీలో మొత్తం 10 వార్డులకు గానూ.. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 8 గెలుచుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఒక్కో సీటు లభించింది. బీజేపీ, జనసేనకు మాత్రం ఒక్క సీటు కూడా రాలేదు. ముందుగానే కవిత తమ పార్టీకి చెందిన అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరుపున పోటీ చేస్తారని కవిత ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీలో విభేధాల అనంతరం పార్టీ కవితను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆమె ఒంటిరిగా మిగిలిపోయింది. ఈ విభేధాల అనంతరం జరిగిన తొలి ఎన్నికల్లో ఏకంగా ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకోవడం ఆసక్తిగా మారింది.

## సీఎం ఇలాకాలో కాంగ్రెస్ హవా



**వికారాబాద్, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కొడంగల్, మద్దూర్, కోస్గి మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. కొడంగల్‌లో 10 వార్డులు, మద్దూర్‌లో 9 వార్డులు, కోస్గిలో 8 వార్డులను కాంగ్రెస్ దక్కించుకుంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపాలిటీలో వార్డులు -12 ఉండగా కాంగ్రెస్ - 10, బీఆర్ఎస్ - 1 ఎంఐఎం - 1గెల్చుకుంది. నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీలో వార్డులు - 16 ఉండగా కాంగ్రెస్ - 9,బీఆర్ఎస్ - 6,ఇండిపెండెంట్- 1,స్థానం గెలుచుకున్నారు. కోస్గి మున్సిపాలిటీలో వార్డులు -16 ఉండగా కాంగ్రెస్ - 8 గెల్చుకుంది.

# కొత్తగూడెంలో హంగ్

- సిపిఐకి ఓపెన్‌గా మద్దతు తెలిపిన కెటిఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అసక్తికర కామెంట్స్ చేశారు. కొత్తగూడెంలో మాతో కలిసొస్తె సీపీఐకి అన్ కండిషనల్ సపోర్ట్ చేస్తామని కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం 60 స్థానాలకు గానూ సీపీఐకి 22, కాంగ్రెస్‌కు 22, బీఆర్ఎస్‌కు 8, బీజేపీ, సీపీఎం పార్టీలకు చెరో స్థానం దక్కింది. మిగతా ఆరు చోట్ల ఇండిపెండెంట్లు విజయం సాధించారు. దీంతో అక్కడ హంగ్ ఏర్పడింది. ఇప్పుడు మేయర్ పదవి దక్కాలంటే సీపీఐకి ఇంకా 9 స్థానాలు అవసరం. ఎమ్మెల్యే కూనమనేని ఎక్స్ ఆఫీసియో ఓటుతో పాటు బీఆర్ఎస్ 8 ఓట్లు కలిస్తే కొత్తగూడెం మేయర్ పీఠం సీపీఐకి దక్కే అవకాశముంది. ఇవాళ సింగరేణిని కాంగ్రెస్, బీజేపీలు కలిసి దోచుకుంటున్నాయి. సింగరేణిలో దోపిడిని అడ్డుకోవడంలో మాతో కలిసొస్తే సీపీఐకి మద్దతిస్తామని కేటీఆర్ అన్నారు. ఇవాళ సింగరేణిలో దోపిడీ జరుగుతుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ పట్టించుకోవట్లేదు. అంటే ఈ రెండు పార్టీలు కలిసే సింగరేణిని దోచుకుంటున్నాయి. సింగరేణిలో జరుగుతున్న స్కాంలు, దుర్మార్గాలకు అడ్డు కట్ట వేయాలంటే మేం సీపీఐతో కలిసొస్తామని కూనమనేనికి ఓపెన్ ఆఫర్ ఇచ్చామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇబ్రహీంపట్నంలో ఎగిరిన గులాబీ జెండా

- 24 వార్డుల్లో 13 స్థానాలను చేజిక్కుంచుకున్న పార్టీ




**రంగారెడ్డి, ఫిబ్రవరి13 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కౌంటింగ్ పూర్తయింది. బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కువ వార్డులను కైవసం చేసుకోవడంతో ఇక్కడ బిఆర్ఎస్ పాగా వేసింది. మొత్తం 24 వార్డుల్లో బీఆర్ఎస్ 13 స్థానాల్లో విజయం సాధించింది. అధికార కాంగ్రెస్ పార్టీ 8 వార్డులను సొంతం చేసుకోగా.. బీజేపీ అభ్యర్థులు 2 వార్డుల్లో గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థి ఒక వార్డులో విజయం సాధించారు. గెలుపొందిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. 1వ వార్డు : బీజేపీ - ముత్యాల శ్యామల,2వ వార్డు: కాంగ్రెస్ - నీళ్ల భాను బాబు,3వ వార్డు: స్వంతంత్ర అభ్యర్థి - దాసరి మురళీకృష్ణ (90 మెజారిటీ), 4వ వార్డు: బీఆర్ఎస్ - కొండ్రు ప్రవీణ్ కుమార్, 5వ వార్డు: బీఆర్ఎస్ - జెర్కొని మమత రాజు,6వ వార్డు: కాంగ్రెస్ - మహమ్మద్ అమీనా బేగం,7వ వార్డు: బీఆర్ఎస్ - సుదర్శన్ రెడ్డి, 8వ వార్డు: కాంగ్రెస్ - వర్త్య రాందాస్,9వ వార్డు: కాంగ్రెస్ - దారు రాఘవేంద్రరావు,10వ వార్డు: కాంగ్రెస్ - విజయం దొంతర మోని భార్గవి,11వ వార్డు: బీఆర్ఎస్ - కొండ్రు శ్రీలత,12వ వార్డు: బీఆర్ఎస్ - కొండిగారి త్రిలోక్ కుమార్, 13వ వార్డు: కాంగ్రెస్ - ఇందూరి శ్రీనివాస్,14వ వార్డు: కాంగ్రెస్ - ఎదుల్లా విజయలక్ష్మి,15వ వార్డు: బీఆర్ఎస్- క్యామ శంకర్ (100 ఓట్ల మెజారిటీ),16వ వార్డు: బీఆర్ఎస్ - అల్వాల జ్యోతి వెంకటరెడ్డి (343 మెజారిటీ ),17వ వార్డు: బీఆర్ఎస్ - మదుపు లక్ష్మమ్మ,18వ వార్డు: బీజేపీ - సిద్ధం భానుప్రియ, 19వ వార్డు: బీఆర్ఎస్ - ఆకుల యాదగిరి,20వ వార్డు: బీఆర్ఎస్ - మంద జయ,21వ వార్డు: బీఆర్ఎస్ - చిలుక బుగ్గ రాములు,22వ వార్డు: కాంగ్రెస్ - కప్పరి స్రవంతి,23వ వార్డు: బీఆర్ఎస్ - నీలం శ్వేతా 24వ వార్డు: బీఆర్ఎస్ - గూడూరు గిరీశ్ గెలుపొందారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370